ఇక సమరమే..!

- ఎన్నికల నోటిఫికేషన్ జారీ
- ఒంగోలులో విడుదల చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్
- ఆ వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- ఇప్పటికే అభ్యర్థుల ప్రచారం ముమ్మరం
- మరింత పెరగనున్న వేడి

సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టానికి తెరలేసింది. వచ్చేనెల 13న జరగనున్న పోలింగ్‌కు గురువారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆ వెంటనే నామినేషన్‌ల దాఖలు ప్రక్రియ మొదలైంది. ఈనెల 25 వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ 29తో ముగియనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు దూసుకుపోతున్నారు. ఇప్పుడు నామినేషన్ల పర్వం కూడా ప్రారంభమవడంతో ఎన్నికల వేడి మరింత పెరిగింది.



ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఒంగోలులో కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫాం-1 నోటిఫికేషన్‌ను జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆర్వోలు జారీ చేశారన్నారు. ఆ వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. నిర్దేశించిన కార్యాలయాల్లో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను సమగ్రంగా సమర్పించాలన్నారు. ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు వీడియో గ్రఫీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. బ్యాంకు ఖాతా వివరాలను విధిగా అందజేయాలన్నారు. తాజా అఫిడవిట్ ఫాం-16, తాజా నామినేషన్ పత్రాలను మాత్రమే వినియోగించాలన్నారు.



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన డీఆర్వో శ్రీలత

తొలిరోజు 13 నామినేషన్లు దాఖలు

- ఒంగోలు పార్లమెంట్‌కు నాలుగు, అసెంబ్లీ స్థానాలకు తొమ్మిది సెట్లు
- వై.పాలెం, మార్కాపురంలలో నిల్

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమైన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎక్కడికక్కడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ విడుదల చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్లు స్వీకరించారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నాలుగు సెట్‌లు, జిల్లాలో ఉన్న ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు స్థానాలకు 9 నామినేషన్లు దాఖలయ్యాయి. మార్కాపురం, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కటి కూడా దాఖలు కాలేదు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒక సెట్ నామినేషన్ వేయగా, మాగుంట గీతాలత మరో సెట్ దాఖలు చేశారు. బూచి ఏడుకొండలు, బొడ్డు క్రాంతికుమార్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, నందిని బూచేపల్లి మరో రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. మందా మీనా స్వతంత్ర, పి.కొండారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా కైలా వెంకటరావు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆసోది శంకర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కొండపి నియోజకవర్గం నుంచి శ్రీపతి సతీష్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక తరఫున ఈవీ సురేష్‌బాబు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట, పక్కన రాఘవరెడ్డి, రియాజ్ తదితరులు

అకుంఠిత దీక్ష, పట్టుదలతో సివిల్స్‌లో ర్యాంకు

- తల్లిదండ్రుల ప్రోత్సాహం, భార్య సహకారం మరువలేనిది
- 504 ర్యాంకర్ రాహుల్‌కుమార్

కనిగిరి, ఏప్రిల్ 18: అదో కఠిన పరీక్ష.. ప్రతి యువకుడు సాధించేందుకు తపన పడే సివిల్స్ సర్వీసెస్. ఆ లక్ష్యాన్ని సాధించాలంటే ఎంతో కఠోర సాధనతోపాటు అకుంఠిత దీక్ష, పట్టుదల అవసరం. అలాంటి సివిల్స్ పరీక్షల్లో 504 స్థానాన్ని సాధించి కనిగిరి ప్రాంతానికి పేరు తీసుకువచ్చిన రాహుల్‌కుమార్‌ను ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు. రాహుల్ స్వగ్రామం వెలిగండ్ల మండలం మొగళ్లూరు. తండ్రి వంగేపురం రత్నకుమార్ పశుసంవర్ధకశాఖలో (ఈహెచ్‌ఏ)గా పీసీపల్లి మండలం ముద్దపాడు గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి వయోలారాణి కనిగిరి మండలం చింతలపాలెం హైస్కూల్‌లో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా వీరిద్దరూ గత 25 ఏళ్లుగా కనిగిరిలో నివాసం ఉంటున్నారు. తమ ఒక్కగానొక్క కుమారుడు రాహుల్ ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే వారి ఆకాంక్ష. రాహుల్ కనిగిరి పట్టణంలోని ప్రగతి విద్యానిలయంలో పదో తరగతి 2009లో పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ నెల్లూరు నారాయణ కళాశాలలో చదివారు. 2011 నుంచి 2015 వరకు కాకినాడ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.



కుటుంబ సభ్యులతో రాహుల్‌కుమార్ (ఫైల్)

కలెక్టర్ కావాలన్నదే లక్ష్యం.. రాహుల్

చిన్ననాటి నుంచి నాకు కలెక్టర్ కావాలన్న కోరిక బలంగా ఉండేది. ఇంజనీరింగ్ పూర్తయిన అనంతరం ఢిల్లీలో ఒక ఏడాది కోచింగ్ తీసుకున్నా. ఆతర్వాత స్వీయ శిక్షణతో నిరంతరం పుస్తకపఠనం, కొత్త విషయాలను తెలుసుకోవడం, గూగుల్ ద్వారా జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకుంటూ వచ్చా. పోటీ పరీక్షలకు హాజరవుతూ 2017లో 701వ ర్యాంకు సాధించా. ఆర్యాంకు ద్వారా ఐఆర్‌ఎస్, ఐఎఫ్‌ఎస్‌లలో ఉద్యోగం వచ్చేది. అయితే, కలెక్టర్ కావాలన్నదే నా సంకల్పం. వాటిలో చేరకుండా మళ్లీ సాధన చేశా. 2024 యూపీఎస్‌సీ ఫలితాల్లో 504 ర్యాంకు పొంది లక్ష్యాన్ని సాధించా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు భార్య సహకారం మరువలేనిది.

కార్పొరేటర్లకూ తాయిలాలు..!

- కొంతకాలంగా వైసీపీకి చెందిన కొందరు అలక
- వారిని బుజ్జగించేందుకు అభ్యర్థుల ప్రయత్నం
- భారీగా నగదు పంపిణీ
- నగరంలో చర్చనీయాంశం



ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 18 : వచ్చే ఎన్నికల్లో విజయం కోసం వైసీపీ అనేక అడ్డదారులను తొక్కుతోంది. కోడ్‌ను అతిక్రమించి తాయిలాలు పంపిణీ చేస్తోంది. ఒంగోలులో ఇప్పటికే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశావర్కర్లు, ఆర్పీలు, అంగన్‌వాడీలకు దుస్తులు, నగదు ఇచ్చిన వైసీపీ నేతలు ఇప్పుడు అసంతృప్తితో ఉన్న సొంత పార్టీ నాయకులను సంతృప్తిపరిచే చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా కార్పొరేటర్లను బహుమతుల పేరుతో బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రజల్లో వ్యతిరేకతతో ప్రలోభాలు

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గ్రహించిన వైసీపీ నాయకులు పార్టీ శ్రేణులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆపార్టీ తరఫున ఒంగోలు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు తాయిలాల పంపిణీని ముమ్మరం చేశారు. ఎన్నికల కోడ్ అమలుకు ముందే ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పుడు పార్టీ నాయకులు, శ్రేణులపై దృష్టి సారించారు. కొద్ది నెలల క్రితం నగరంలో పేదలకు పట్టాల పంపిణీ సందర్భంగా ఎస్.అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కలపాలెంలో కొనుగోలు చేసిన పొలాలను బాగు చేసి, రోడ్లు, ఎర్త్ వర్క్, విద్యుత్ సౌకర్యం కల్పన పనుల్లో తమకు వాటా ఇస్తారని నగరపాలక సంస్థ కార్పొరేటర్లు ఆశపడ్డారు. అయితే ఆ పనులు తమకు కేటాయించకపోవడంతో వారు అసంతృప్తికి గురయ్యారు. కొందరు కార్పొరేటర్లు తమకు అధికార పార్టీలో ఉన్నా అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఈనేపథ్యంలో ఆర్థికంగా స్థితిమంతుడైన నాయకుడిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా వైసీపీ రంగంలోకి దింపడంతో మరోసారి ఆశలు పెంచుకున్నారు. ఆయన ఒంగోలులో పర్యటించే ప్రతిసారీ తమకు కబురు వస్తుందని ఆశించిన వారికి ఎంపీ అభ్యర్థి నుంచి పిలుపురాలేదు. అధిక సమయం ఆయన పశ్చిమ ప్రాంతంపై దృష్టి సారించారు. అంతేకాకుండా తన కార్యాలయాన్ని సైతం జిల్లాకు మధ్యస్థంగా ఉండే పొదిలిలో తీసుకోవడంతో కార్పొరేటర్లు తీవ్ర నిరాశకు గురయ్యారు.

కార్పొరేటర్‌కు రూ.3లక్షలు, కోఆప్షన్ సభ్యుడికి రూ.2లక్షలు

నెలరోజులుగా ఎంపీ అభ్యర్థి పిలుపు కోసం ఎదురు చూసిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వైసీపీ డివిజన్ అధ్యక్షులకు ఎట్టకేలకు అవకాశం లభించింది. రెండు రోజుల క్రితం ఒంగోలులో ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాన్ని విజయవంతం చేయాలంటూ నియోజకవర్గ పార్టీ శ్రేణులకు, కార్పొరేటర్లకు తాయిలాలు ఇచ్చినట్లు సమాచారం. సమావేశం జరిగిన వేదిక వద్ద ఇస్తే మీడియా కంట పడే అవకాశం ఉందని గ్రహించిన నేతలు గుట్టుగా డివిజన్‌లకే వెళ్లి కార్పొరేటర్‌కు రూ.3లక్షలు, కోఆప్షన్ సభ్యుడికి రూ.2లక్షలు, డివిజన్ అధ్యక్షుడికి రూ.లక్ష చొప్పున తాయిలాలు ఇచ్చినట్లు తెలిసింది. ఓటమి తప్పదని భావించిన వైసీపీ నాయకులు అటు ప్రజలను, ఇటు పార్టీ శ్రేణులను డబ్బుతో కొనుగోలు చేయడం చర్చనీయాంశమైంది.

ఇంటింటికీ బియ్యం బస్తా..

- కొత్తపట్నం మండలంలో జోరుగా పంపిణీ
- ఓటర్లకు వైసీపీ అభ్యర్థి ప్రలోభాలు

కొత్తపట్నం (ఒంగోలు నగరం) ఏప్రిల్ 18 : కొత్తపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో వైసీపీ నేతలు తాయిలాల పంపిణీతో ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. నెల క్రితం నుంచే రకరకాల వస్తువుల పంపానికి శ్రీకారం చుట్టారు. తాజాగా వారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ బియ్యం బస్తాలు, వంటనూనె ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రతిరోజూ రాత్రి సమయాల్లో నిర్వహిస్తున్నారు. ఒంగోలు నుంచి వాహనాల్లో బియ్యం, నూనె ప్యాకెట్ల బస్తాలు రాత్రి సమయాల్లో గ్రామాలకు చేరుతున్నాయి. వీటిని స్థానిక నాయకులు ఇంటికి ఒక బస్తా లెక్కన అందజేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు బియ్యం లోడుతో వస్తున్న వాహనాలను చూసీచూడనట్లు వదిలేస్తుండగా లారీ గ్రామాల్లోకి వచ్చిన గంటలోపే వీటిని స్థానిక నాయకులు పంపిణీ చేస్తున్నారు. నెల క్రితమే అంటే ఎన్నికల కోడ్ రాకముందే డ్వాక్రా సంఘాల మహిళలకు వైసీపీ నేతలు చీరలు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఆ తర్వాత అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు రూ.5 వేల వంతున నగదును ఇచ్చారు. ఇప్పుడు ఇంటింటికీ బియ్యం బస్తాను పంపిణీ చేస్తున్నారు. వారం నుంచి ఈ పంపిణీ ప్రారంభమైంది. తొలుత కొత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని డీటీకాలనీ, డీకేకాలనీల్లోని ఎస్టీ కుటుంబాలకు ఇచ్చారు. ఇప్పుడు గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ అందజేస్తున్నారు. కాగా వైసీపీ శ్రేణులు పంపిణీ చేస్తున్న బియ్యం నాసిరకంగా ఉన్నాయంటూ ఓటర్లు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే సబ్సిడీ బియ్యాన్ని తిరిగి మర పట్టించి గోతాలు మార్చి నాణ్యమైన బియ్యంగా పంపిణీ చేస్తున్నారని వారు చెబుతున్నారు. కొంతమంది వైసీపీ ఇస్తున్న బియ్యాన్ని తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని ఓటర్లను ప్రలోభపెట్టే దిశగా చిన్నస్థాయి మీటింగ్‌లు పెడుతున్నారు. చిన్నదే అయినప్పటికీ సమావేశానికి వస్తే రూ.500, బిర్యానీ ప్యాకెట్లను అందజేస్తున్నారు. ఈ రకంగా వైసీపీ నేతలు గత ఐదేళ్ల నుంచి దోచుకున్న డబ్బును మంచినీళ్ల ప్రాయంగా వెదజల్లుతున్నారని మండల వాసులు మాట్లాడుకుంటున్న పరిస్థితి.



కొత్తపట్నంలో రాత్రివేళ బియ్యం బస్తాను తీసుకొని ఓ ఇంట్లోకి వెళ్తున్న కూలీ

సూర్యప్రతాపం

- పశ్చిమప్రాంతంలో 42 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు
- మార్కాపురంలో అత్యధికంగా 45 డిగ్రీలు



ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18 : జిల్లాపై సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. ఎండతీవ్రతకు తోడు ఉక్కపోత అధికంగా ఉంటుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. గురువారం పశ్చిమప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. ఎక్కువచోట్ల 42 డిగ్రీలకుపైనే గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మార్కాపురం మరింత మండింది. అక్కడ అత్యధికంగా 45.3 డిగ్రీల ఎండ కాచింది. అర్ధవీడు మండలంలో 44.1, కంభంలో 44.1, దొనకొండలో 44.0, దోర్నాలలో 43.8, హనుమంతునిపాడులో 43.3, కనిగిరిలో 43.8, కొనకనమిట్లలో 43.6, చీమకుర్తిలో 43.2, దర్శిలో 42.8, సీఎస్‌పురంలో 42.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అది జిల్లాకేంద్రమైన ఒంగోలులో 39 డిగ్రీలుగా ఉంది. తూర్పుప్రాంతంలోని ఇతరచోట్ల ఇంచుమించు ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఉదయం 10 గంటలకే భానుడి భగభగలు మొదలవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో గడపదాటి బయటకు వచ్చేందుకు భయపడిపోతున్నారు.

కొత్తగా 11 హైస్కూల్ ప్లస్‌లు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 18 : జిల్లాలో కొత్తగా 11 కోఎడ్యుకేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను హైస్కూలు ప్లస్ (జూనియర్ కళాశాలలు)గా ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఇవి అందుబాటులోకి రానున్నాయి. వీటిలో కొత్తగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు ఉంటాయి. ఒక్కో కోర్సులో 40 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. జరుగుమల్లి మండలం కామేపల్లి, వెలిగండ్ల మండలం పందువనాగులవరం, గిద్దలూరు మండలం ముండ్లపాడు, బేస్తవారపేట బాలుర, హనుమంతునిపాడు, కొనకనమిట్ల, కొత్తపట్నం, కురిచేడు, పుల్లలచెరువు, సంతనూతలపాడు, తర్లుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా ఉన్నతీకరించారు. ఇప్పటికే జిల్లాలో 9 హైస్కూల్ ప్లస్ మహిళా జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి.



ఓబన్నపాలెంలో బీఎన్ సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

వైసీపీకి షాక్

- ఎన్‌జీపాడు మండలంలో భారీగా టీడీపీలో చేరికలు
- సీనియర్ నేత పున్నారావు సైతం గుడ్‌బై
- కండువాలు వేసి ఆహ్వానించిన కూటమి అభ్యర్థి విజయ్‌కుమార్

ఒంగోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని నాగులుప్పలపాడు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మూడు గ్రామాల్లో గురువారం ఒక్కరోజే పలువురు కీలక నేతలు, వారి అనుచరులతో టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ ఆ గ్రామాలకు వెళ్లి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి పసుపు కండువాలు వేశారు. నియోజకవర్గంలోనే గతంలో కాంగ్రెస్, ప్రస్తుతం వైసీపీలో సీనియర్ నేత అయిన దివి పున్నారావు తన అనుచరులతో స్వగ్రామమైన పోతవరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సైకిల్ ఎక్కారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న పున్నారావు పోతవరం గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఆయన సతీమణి దివి రంగవల్లి నాగులుప్పలపాడు ఎంపీపీగా పనిచేశారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, వైసీపీ ఆవిర్భావం అనంతరం ఆపార్టీ మండల కన్వీనర్‌గా పనిచేసిన పున్నారావు సంతనూతలపాడుతోపాటు ఒంగోలు నియోజకవర్గంలోనూ రాజకీయ వర్గాలకు సుపరిచితులు. ఇక మండలంలోని ఓబన్నపాలెంలో మాజీ సర్పంచ్ వక్కంటి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్‌తోపాటు పలువురు బీఎన్ సమక్షంలో టీడీపీ చేరారు. అగ్రహారంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పొద శ్రీధర్‌తోపాటు మరికొంత మంది పసుపు కండువాలు వేసుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో వైసీపీ నేతలు పలువురు టీడీపీలో చేరేందుకు మండల నాయకులతోపాటు అభ్యర్థి బీఎన్ విజయకుమార్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

అభివృద్ధి చేశా.. అందుబాటులో ఉన్నా..

- కక్షసాధింపు లేదు.. అవినీతికి దూరం
- వైసీపీ అభ్యర్థులు అటు ఇటు మార్పులో ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలి
- బెదిరింపులు, ప్రలోభాలతో ప్రజల మనసు గెలవలేరు
- టీడీపీ కూటమి గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ప్రజలు ఆదరించి అవకాశమిచ్చిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డా. వివిధ కారణాలతో ఆదరించకపోయినా వారి సేవలోనే ఉన్నా. కక్షసాధింపు, అవినీతి, దొమ్మీలు, భూఆక్రమణలు లేని పాలన అందించిన నేను గత ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలు పిలిస్తే పలికా. పరుగెత్తి పనులు చేశా. నేను స్థానికుడిని. అటువైపు చూస్తే భారీ ఆధిక్యతతో గెలిపించిన ఎమ్మెల్యే నియోజకవర్గం మారారు. ఉన్నచోట ప్రజలు కాదన్నారని మరొకరిని గిద్దలూరు తెచ్చారు. ఈ మొత్తం వ్యవహారాన్ని విజ్ఞులైన ప్రజలు ఆలోచించి తరతమ బేధాలు, ప్రలోభాలకతీతంగా టీడీపీ కూటమి తరఫున రంగంలో ఉన్న నన్ను బలపరుస్తున్నారు.' ఇదీ శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో టీడీపీ కూటమి గిద్దలూరు అభ్యర్థి ముత్తుమల అశోక్‌రెడ్డి వెల్లడించిన అభిప్రాయాలు. తాను ఎమ్మెల్యే ఉన్న సమయంలో 200పైగా ఉన్న గ్రామాలన్నింటి లోనూ ఏదో ఒక అభివృద్ధి పని చేశానన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్‌లు అర్హులైన వారందరికీ ఇప్పించడమే కాక సీఎం రిలీఫ్ ఫండ్‌ను అవసరమైన వారందరికీ పార్టీ, కుల, మతరహితంగా మంజూరు చేయించానన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ఒక దశకు తీసుకువచ్చానని తెలిపారు. తాగునీటి సమస్య నివారణకు భారీ పథకాలను మంజూరు చేయించానని చెప్పారు. తాను తీసుకొచ్చిన అభివృద్ధి పథకాలను పూర్తిచేయలేక వైసీపీ ప్రభుత్వం మూలనపడేసిందన్నారు. గత ఎన్నికల్లో భారీ మెజారిటీ వచ్చిన వైసీపీ ఎమ్మెల్యేను వేరే నియోజకవర్గానికి పంపి స్థానికేతరుడైన మరో ఎమ్మెల్యేను ప్రస్తుతం ఇక్కడ రంగంలోకి దింపడంలోని ఆంతర్యాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. మారిన పరిస్థితులు.. నియోజకవర్గ ప్రజల్లో తనపట్ల, కూటమి పార్టీలకు పెరిగిన బలాన్ని గుర్తించి ఆ మార్పులు జరిగాయని ప్రజలు బహిరంగంగానే అంటున్నారని అశోక్‌రెడ్డి తెలిపారు. మార్కాపురంలో ఆయన ప్రజల మద్దతు పొంది ఉంటే ఇక్కడకు మార్చరు కదా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో మార్కాపురం ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చివరకు అధికార పార్టీ నాయకులే తమ ఆస్తులు కబ్జా అవుతున్నాయంటూ గగ్గోలు పెట్టిన తీరు అందరం చూశామన్నారు. అక్కడ జరిగిన భూఆక్రమణలు, దౌర్జన్యాలు, విధ్వంసాలకు అధికారపార్టీ ఎమ్మెల్యే బాధ్యత వహించక తప్పదని స్పష్టం చేశారు. అందుకే గిద్దలూరు ప్రజానీకం కూడా భవిష్యత్తులో రక్షణ కోరుకుంటున్నారని తెలిపారు. టీడీపీ కూటమిలో భాగస్వామ్యం అయిన జనసేన, బీజేపీ నుంచి పూర్తిస్థాయిలో తనకు మద్దతు లభిస్తున్నదన్న ఆయన మూడు పార్టీలు సమష్టిగా పనిచేస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో బెదిరింపు, కుల రాజకీయాలు పనిచేయవని అశోక్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు.



టీడీపీలోకి ఉప్పెనలా చేరికలు !

- ఓబన్నపాలెంలో వైసీపీ ఖాళీ
- తెలుగుదేశంలో చేరిన పలు గ్రామాల శ్రేణులు
- సాదర స్వాగతం పలికిన ఎస్ఎన్‌పాడు టీడీపీ కూటమి అభ్యర్థి విజయ్‌కుమార్



మద్దిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న బీఎన్, జయంత్‌బాబు, నాగేశ్వరరావు



పార్టీలో చేరిన పిడతలపూడివాసులతో బీఎన్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 18 : అధికార వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు ఉప్పెనలా కొనసాగుతున్నాయి. నాగులుప్పలపాడు మండలంలోని పోతవరం, టి.అగ్రహారం, ఓబన్నపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులతో పాటు వందలాది మంది కార్యకర్తలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు.

ప్రధానంగా పోతవరం గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నేత, పార్టీ మండల మాజీ అధ్యక్షులు దివి పున్నారావు, మాజీ ఎంపీపీ దివి రంగవల్లి, దివి హనుమంతరావు, పెద్దిపోగు కిరణ్, అంకమ్మరావు, అంజయ్యతో పాటు మరో 100 మంది బీఎన్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి సమక్షంలో సైకిలెక్కారు.

ఇక టి.అగ్రహారం గ్రామానికి చెందిన వైసీపీ మాజీ ఎంపీటీసీ పొద శ్రీధర్, గోరంట్ల రామారావు, పొద సింగయ్య, బెల్లం రామకృష్ణ, పిన్నక అనుదీప్‌తో పాటు ఎస్సీ కాలనీవాసులు 100 మంది, గ్రామానికి చెందిన మరో 50 మంది తెలుగుదేశంపార్టీలో చేరారు.

ఓబన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వక్కంటి శ్రీనివాసరావు, యూత్ నాయకులు పోలినేని సింగారావు, మాజీ సొసైటీ అధ్యక్షులు మండవ ప్రసాద్, పోలినేని రంగయ్య మరో 100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేరారు. దాంతో ఆ గ్రామంలో దాదాపు అధికార పార్టీ ఖాళీ అయ్యింది. పార్టీలో చేరిన వారికి బీఎన్ తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

వైసీపీతో అందరికీ అన్యాయం : బీఎన్

ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ అధికార వైసీపీతో ఏ ఒక్కరికి న్యాయం జరుగలేదన్నది ఇంత పెద్ద ఎతున జరుగుతున్న చేరికలతోనే అర్థమవుతుందన్నారు. ఆ పార్టీతో విసుగు చెందిన శ్రేణులు తెలుగుదేశం పార్టీ గూటికి చేరడం శుభపరిణామమన్నారు. గత 15 ఏళ్ళ నుంచి సంతనూతలపాడు నియోజకవర్గంలో ప్రజలతో మమేకమైన తనకు రాజకీయ పరిస్థితులు పూర్తిగా తెలుసన్నారు. తల్లిలాంటి తెలుగుదేశం పార్టీలోకి మరిన్ని చేరికలు కొనసాగుతాయన్నారు. సమష్టి కృషి తో పనిచేసి రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొద వరప్రసాద్, సురేష్, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, అడకా స్వాములు, గ్రామ అధ్యక్షులు శరత్, చిన్నా, కట్టా అంజయ్య, చెరుకూరి వెంకి, నార్నె అంజయ్య, చెంచయ్య, పొనుగుపాటి సుబ్బరావమ్మ, షేక్ ఖాజావలి, చుండూరి నాగేశ్వరరావు, బి.సెల్వం, జాగర్లమూడి హరిబాబు, ఉప్పుటూరి హరినాథ్, పెనుబోతు సునీల్, గూడూరు ఝాన్సీ, పోలినేని చలపతి, తెలగతోటి జాన్సన్, జనసేన నాయకులు సాయి, కొంజేటి ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

15 కుటుంబాలు చేరిక

సంతనూతలపాడు, ఏప్రిల్ 18: మండలపరిధిలోని పేర్నమిట్ట పరిధిలోని 40 డివిజన్ వైసీపీకి చెందిన 15 కుటుంబాలు గురువారం వైసీపీని వీడి బీఎస్.విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో వారికి పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పాలపర్తి సుబ్బారావు, పాలపర్తి సురేష్, లక్ష్మణ్, పీటర్, జగన్నాథగోపి, రామ్‌కుమార్, ప్రశాంత్ జార్జి, చింటూ, మహేష్, యాకోబ్, అజయ్‌కుమార్, మనీష్‌కుమార్, పాల్గొన్నారు. కాగా ఎనికపాడు గ్రామ టీడీపీ నాయకులు ఒంగోలులో బీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీవీ.ప్రసాద్, కట్టా సుబ్బారావు, విక్రం కోటయ్య, రాఘవ, గణేష్, చిన్నరాఘవ, వెంకట్రావు, శ్రీనివాసరావు, వీరనారాయణ, సుబ్బారావు, శ్రీహరి కోటేశ్వరరావు, రాజు, మాత్యాద్రి, నరసింహ తదితరులుపాల్గొన్నారు.

పిడతలపూడి నుంచి..

చీమకుర్తి: పిడతలపూడి గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకుడు కూనం అంజిరెడ్డి తన అనుచరులతో గురువారం టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి విజయ్ కుమార్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలవెల్లి సింగారెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, వెంకట్రావు, ఆదినారాయణ, కడియాల సుబ్బారావు, వెంకట్రావు, ఆదినారాయణ, కడియాల సుబ్బారావు, గాలి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దిపాడు: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కువమార్ పేర్కొన్నారు. మద్దిపాడు గ్రామంలోని అరుంధతి నగర్‌లో గురువారం ఆయన బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బీఎస్ మాట్లాడుతూ స్థానిక అరుంధతినగర్‌లో మురుగు కాలువలు ఆధునికీకరణ చేస్తామని, గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లకు మరమ్మత్తలు చేపట్టి సాగు, తాగునీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు. ముస్లింకాలనీ, అరుంధతినగర్‌లకు చెందిన వైసీపీకి చెందిన 60 కుటుంబాల వారు టీడీపీలో చేరగా వారికి విజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అడకా స్వాములు, ఉప్పుగుండూ రి నాగేశ్వరరావు, కడియాల రఘుబాబు, వెంకయ్యనాయు డు శుద్ధపల్లి అనిల్, ముల్లూరి మురళి, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, జనసేన మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం, నూనె శ్రీనివాసరావు, ఆర్ఎం.వెంకటేశ్వ ర్లు, ఎస్‌కే.అబ్దుల్‌కలాం, షేక్ అబ్దుల్ జలీల్, పాడిపండ్ల రవి పాల్గొన్నారు.

మంత్రాలయంలో దామచర్ల ప్రత్యేక పూజలు



దామచర్లకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 18 : తెలుగుదేశం పార్టీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం కర్నూలు జిల్లాలోని మంత్రాలయం ఆలయాన్ని సందర్శించిన దామచర్ల స్వామి వారి పల్లకిని మోశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్పొరేటర్ చెన్నుపాటి వేణుతో పాటు మరి కొంతమంది దామచర్ల వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వారిని ఆశీర్వదించారు.

నామినేషన్ దాఖలు చేసిన మాగుంట



మాట్లాడుతున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: ఒంగోలు లోక్‌సభ తెలుగుదేశంపార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దినేష్‌కుమార్‌కు మాగుంట నామినేషన్ అందజేశారు. మాగుంట నామినేషన్‌ను ఆయన తనయుడు రాఘవరెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, అయినాబత్తిన ఘనశ్యాం, న్యాయవాది కొండారెడ్డి బలపర్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన విలేఖరుల సమావేశంలో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మాగుంట కుటుంబం 33 సంవత్సరాల నుంచి సేవ చేస్తోందన్నారు. ప్రజల ఆశీస్సులతో ఇంకా సేవ చేయాలని మాగుంట కుటుంబం నిర్ణయించుకుందన్నారు. వచ్చేనెల 13వతేదీన జరిగే పోలింగ్‌లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పార్లమెంట్‌తో పాటు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల టీడీపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, తాతా ప్రసాద్, కుప్పా రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు



జనసేనలో చేరిన శ్రీనివాసరావుతో బీఎన్

ఒంగోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మద్దిపాడులో వైసీపీ కీలక నేతగా ఉన్న నూనె శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. గురువారం స్థానిక గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయకుమార్ ప్రచార కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరి బాబు, మండల జనసేన అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొనగా వారి సమక్షంలో శ్రీనివాసరావు పార్టీలో చేరారు. మద్దిపాడు పంచాయతీ ఐదో వార్డు మెంబరు కూడా అయిన శ్రీనివాసరావుకు వివిధ వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయనతో పాటు 20 కుటుంబాలకు పైగా జనసేనలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



ఒంగోలులో గురువారం టీడీపీ సూపర్ సిక్స్ ప్రచార వాహనాలను తెలుగుదేశం కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత, కుటుంబసభ్యులు ప్రారంభించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయ ం సాధిస్తున్న దీమాను వారు వ్యక్తం చేశారు. - ఒంగోలు

ఎన్నికల నిబంధనలతో ట్రాఫిక్ ఆంక్షలు

- అవస్థలు పడిన నగరవాసులు
- పోలీసు అధికారులపై ఏఎస్పీ ఆగ్రహం

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 18: ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కావడంతో పోలీసులు అధికారులు అందుకు సంబంధించిన ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. ఒంగోలు నగరంలోని ప్రకాశంభవన్ గల కలెక్టర్ చాంబర్‌లో ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి, పక్కనే ఉన్న ఆర్డీవో కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీకి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. ఈనెల 25వ తేదీ వరకు ఈప్రక్రియ జరుగుతుంది. నిబంధనల ప్రకారం నామినేషన్లు స్వీకరించే ప్రాంతాల నుంచి చుట్టూ 200 మీటర్లు రెండు అంచలగా బారిగేడ్లు ఏర్పాటు చేసి రహదారులను మూసివేస్తారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అయితే ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా దారులన్నీ మూసివేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులుపడ్డారు. ఎటు నుంచి ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఎటువైపు వెళ్ళినా బారిగేట్లతో రోడ్డును మూసివేసిన పోలీసులు కనీసం ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడం ప్రజలు అసహనానికి గురయ్యారు. ఎవరో నామినేషన్లు వేస్తుంటే మాకు ఎందుకు ఇన్నీ కష్టాలు అంటూ బాహటంగా పోలీసులతో వాగ్వావాదాలకు దిగారు.

ముందస్తు సూచనలు లేవు..

జిల్లా కేంద్రం కావడంతో ప్రజలు అనేక అవసరాలతో ఇక్కడకు వస్తుంటారు. కేశవస్వామిపేట వద్ద పూర్తిగా బారిగేడ్లు ఏర్పాటు చేసి కార్పొరేషన్ కార్యాలయం వైపు దారి బంద్ చేశారు. అదేవిధంగా నెల్లూరు బస్టాండ్, పాత ఎస్‌బీఐ తదితర ప్రాంతాలలో బారిగేడ్లు ఏర్పాటు చేయగా అడ్డరోడ్డుల నుంచి కూడా వెళ్లేందుకు దారులు లేకుండా చేశారు. ఈక్రమంలో ప్రజలు, వాహన రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా పోలీసులు గాలికి వదిలేశారు. ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువగా ఉండటం, పిల్లలకు ఒకపూట బడులు కావడంతో మధ్యాహ్నం ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో పిల్లలు ఇళ్లకు చేరే సరికి రెండు గంటల సమయం పట్టింది. పిల్లల తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారు.

అలసత్వం వహిస్తే చర్యలు : ఏఎస్పీ

స్థానిక ప్రకాశంభవన్ వద్ద భద్రతా ఏర్పాట్లు చూస్తున్న పోలీసు అధికారులపై అదనపు ఎస్పీ నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయం ఉదయం పది గంటల దాటినా ఎవరు ఎక్కడ విధులు నిర్వహించాలో కూడా అవగాహన లేకపోవడం ఏమిటని మండిపడ్డారు. విధినిర్వహణలో అలసత్వం పాటిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబుతోనే పేద, మధ్యతరగతి ప్రజలకు భరోసా



మధురానగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



నాగులుప్పలపాడులో ప్రచారం చేస్తున్న శ్రేణులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 18: పేద, మధ్యతరగతి ప్రజలకు భరోసా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడని ఆ పార్టీ మహిళా నాయకురాలు అరికట్ల సుమతి పేర్కొన్నారు. పేర్నమిట్ట పరిధిలోని 39, 40 డివిజన్, మధురానగర్‌లో సంతనూతలపాడు టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ విజయం కోసం గురువారం రాత్రి బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ హయాలోనే జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందని, వైసీపీ మాత్రం ఒక్క పని చేపట్టలేదని విమర్శించారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీఎస్.విజయ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి.నాగేశ్వరరావు, కె.మహేష్, అమానుల్లా, బి.రాంబాబు, పురుషోత్తమరావు, ఎస్.మాధవిలత, బి.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీను, ఐ.మధు ఎన్.శ్రీను పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం నాగులుప్పలపాడు ముస్లింకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ నాయకులు ఉన్నం వెంకట్రావు, మారెళ్ళ వెంకట్రావు, కట్టా చిరంజీవి, పోలినేని హనుమంతు, తోకల చైతన్య, మారెళ్ళ వెంకట్రావు (గన్), కల్లూరి రవి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచారు. అందరికీ సుపరిచితుడైన కూటమి అభ్యర్థి బీఎస్‌ను గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.

టీఎన్‌టీయూసీ మద్దతు ఇవ్వాలి

మద్దిపాడు: రానున్న ఎన్నికలలో టీఎన్‌టీయూసీ సంఘం తనకు మద్దతు ఇవ్వాలని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ కోరారు. గురువారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్‌ను మద్దిపాడులో బీఎన్ కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడకా స్వాములు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మండవ గోపీనాథ్, దేవబత్తిని ప్రసాద్, మార్నేని కృష్ణారావు, గంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 18: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్నచెన్నకేశవ స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ జరిగాయి. అర్చకులు స్వామివారికి, అమ్మవారికి విశేష అలంకరణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా రాత్రి తులసీ మెలోడీస్ బృందంచే ఏర్పాటుచేసిన భక్తిసంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గాయకులు లక్ష్మీతులసి, అప్పిశెట్టి రత్తయ్య, కోటేశ్వరరావు, తాళ్లూరి శ్రీదేవిలు గానం చేసిన పలు అన్నమాచార్య కీర్తనలు, తెలుగు చిత్రాలలోని భక్తిగీతాలు ఆలపించారు. కీబోర్డుపై ఎస్‌కే.బాబు, తబలాపై శ్రీనివాస్‌లు వాద్య సహకారాన్ని అందజేయగా ఆలయ కమిటీ ఛైర్మన్ ఈదుపల్లి గురునాథ రావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. ఇక బ్రహ్మోత్సవాలలో రెండవ రోజైన శుక్రవారం ఉదయం నిత్యహోమం, కుంభారాధన, రాత్రికి శేషవాహన సేవ, అనంతరం చందు డాన్స్ అకాడమీ చిన్నారులచే నృత్య ప్రదర్శన ఉంటాయని వారు తెలిపారు.



భక్తిగీతాలను ఆలపిస్తున్న గాయకులు

ఎమ్మెల్యే ఇంటికెళ్లే

దారి బురదమయం!

అయినా ఎవరికీ పట్టని వైనం ● ఇబ్బందిపడుతున్న ప్రజలు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నగరం అభివృద్ధి ఆమడ దూరంలోనే నిలిచింది. అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోగా, మరోవైపు ఉన్న వనరులను సక్రమంగా పర్యవేక్షించే నాథుడు కరువయ్యారు. గత ఏడాది కాలంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటికెళ్ళే మార్గంలో భారీగా పైపులైను లీకు ఏర్పడింది. అప్పటి నుంచి నీరు వృథాగానే పోతోంది. వేసవి కాలం కావడంతో నగరంలో తాగునీటికి కష్టాలు ఎదురయ్యాయి. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉన్నా అవి గృహాలకు చేరేపరిస్థితి లేదు. దీంతో వథాగా పోతున్న నీటితో ఈ ఎమ్మెల్యే ఇంటికెళ్లే దారి బురదమయంగా మారింది. నిత్యం ఆ వైపు ప్రజాప్రతినిదులు, అధికారులు రాకపోలు సాగిస్తున్నప్పటికీ లీకు గురించి పట్టించుకున్నవారు కరువయ్యారు.

- ఒంగోలు (కార్పొరేషన్)





పైపులైన్ లీకుతో రోడ్డుపై పారుతున్న నీరు, బురదమయంగా మారిన రోడ్లు

అవీ..ఇవీ..

జిల్లా ఎన్నికల అధికారిని కలిసిన వ్యయ పరిశీలకుడు



దినేష్‌కుమార్‌కు బొకే ఇస్తున్న బిశ్వాస్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18 : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్‌ను జిల్లా ఎన్నికల పరిశీలకులు దూకే బిశ్వాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం దినేష్‌కుమార్‌ను కలిసి బొకే అందజేశారు. ఒంగోలు, కనిగిరి, దర్శి నియోజకవర్గాలకు వ్యయపరిశీలకునిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా అయా నియోజకవర్గాలపై చర్చించారు.

ఒంగోలు పార్లమెంట్‌కు నాలుగు నామినేషన్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18 : ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం ఒంగోలు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి దినేష్‌కుమార్ నామినేషన్లు స్వీకరించారు. తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి నామినేషన్ దాఖలు చేయగా, మాగుంట గీతాలత మరో నామినేషన్‌ను అందజేశారు. అలాగే బూచి ఏడుకొండలు, బొడ్డు క్రాంతికుమార్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో మొదటి రోజు ఒంగోలు పార్లమెంట్‌కు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సహాయకేంద్రం

మద్దిపాడు, ఏప్రిల్ 18: ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు చీమకుర్తి పురపాలక సంఘ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడ సిబ్బంది అక్కడ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

యరజర్లలో ఆర్వో ప్లాంటు ప్రారంభం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: యరజర్ల గ్రామంలో సింగవరపు కోటేశ్వరరావు చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. భగీరథ కెమికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సింగవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా ట్రస్టు కోశాధికారి చెన్నారెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం గ్రామ ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, పువ్వాడ రామయ్య కొనికి బ్రహ్మయ్య, కంకణాల శ్రీనివాసులు, కంకణాల అంజనేయులు, చెరుకూరి వెంకటశేషయ్య, చెరుకూరి రాఘవరావు, చెన్నుపాటి భాస్కరరావు, కంకణాల తిరుపతిస్వామి, చల్లా శ్రీనివాసులు, దామచర్ల కోటేశ్వరరావు, పోకూరి అంజమ్మ, కంకణాల సుశీల, భగీరథ ఫ్యాక్టరీ మేనేజర్ కాకాని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ ప్రవేశపరీక్ష హాల్‌టిక్కెట్లు విడుదల

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 18: జిల్లాలోని ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రవేశపరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈనెల 21న ఉదయం 10నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. హాల్‌టిక్కెట్లను ఏపీ మోడల్ స్కూల్స్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యార్థులకు ఆయా మోడల్ స్కూళ్ళలోనే ప్రవేశ పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆమె కోరారు.

బీజేపీలో చేరిన వైసీపీ మహిళా నాయకులు



మహిళా కార్యకర్తలను స్వాగతిస్తున్న శివారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18 : అధికార వైసీపీకి చెందిన పలువురు మహిళా నాయకులు గురువారం బీజేపీలో చేరారు. ఒంగోలులోని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో మహిళా మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి బి.వి జయరావు, జిల్లా కార్యదర్శి దేవరపల్లి శ్రీలక్ష్మిల ఆధ్వర్యంలో పలువురు మహిళలు చేరగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్‌లు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల 13వతేదీన జరగనున్న ఎన్నికల్లో బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్‌డీఏ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందువల్ల కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, ఖలీఫాతుల్లాబాషా, తీగల సత్యవతి, చిట్టాతిరుమల, కృష్ణవేణి, గుర్రం రంగనాథ్, రాజశేఖర్, ధనిశెట్టి రాము, కోటయ్య. భాగ్యవతి, సీతారామయ్య, కోటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను సంరక్షించుకోవాలి

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 18 : స్మారక చిహ్నాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలని, మనకు వారసత్వంగా లభించిన ఈ సంపదను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం డీన్ డి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా గురువారం ఒంగోలులోని యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద గురించి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. దేశంలోని 40 చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను యునిస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించిందన్నారు. రామప్పదేవాలయం, అజంతా గుహలు, తాజ్‌మహల్, కోణార్క్ దేవాలయం, హంపి వంటి చారిత్రక కట్టడాల ప్రదేశాలు ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు.

పాలిసెట్ హాల్ టిక్కెట్లు సిద్ధం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 18 : ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్-24 ప్రవేశపరీక్షకు హాల్‌టిక్కెట్లు సిద్ధమయ్యాయి. హాల్ టిక్కెట్లను విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పదో తరగతి హాల్ టిక్కెట్ నెంబరు, రిజిస్టర్డ్ మొబైల్ నెంబరుతో వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ నెల 27వతేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేరెంట్స్, టీచర్ సమావేశాలు వాయిదా

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 18: ప్రస్తుత విద్యాసంవత్సరం చివరిరోజు ఈనెల 23న అన్ని పాఠశాలల్లో నిర్వహించతలపెట్టిన పేరెంట్స్ టీచర్ సమావేశాలు వాయిదాపడ్డాయి. ఈనెల 23కు బదులుగా వేసవి సెలవులు అనంతరం జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం రోజు ఈ సమావేశాలు నిర్వహిస్తారు. ఈ మేరకు విద్యాశాఖముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. 23న విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ కార్డులు యథాతదంగా అందజేయాలని ఆదేశించారు.

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక నామినేషన్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలైంది. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జీవీ.సుబ్బారెడ్డికి గురువారం కొత్తకూరగాయలమార్కెట్‌లో వ్యాపారం చేసుకునే ఆసోది శంకర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అందజేశారు.

22 నుంచి ఫొటోగ్రఫీ ఉచిత శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 22నుంచి పురుషులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.ప్రతాపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్ళలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అర్హులన్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండటంతో పాటు శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు 9492583484 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

సీపీఎం మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: ఒంగోలులోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రకాశం జిల్లాను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, బి.రఘురాం, వి.బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దామచర్ల సత్య

టీడీపీలో చేరిన ఐదు వైసీపీ కుటుంబాలు

సింగరాయకొండ, ఏప్రిల్ 18 : మండలంలోని పాతసింగరాయకొండ వైసీపీకి చెందిన 5 కుటుంబాల వారు ఆపార్టీని వీడారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య సమక్షంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి సత్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆదిపూడి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, మద్దెల నాగరాజు వారికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, బ్రహ్మేశ్వరరావు మోరుబోయిన వంశీ, నరసింహారావు పాల్గొన్నారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కారం

జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో టాపర్‌గా నిలిచిన తులసి

సింగరాయకొండ, ఏప్రిల్ 18 : ఇటీవల ప్రకటించిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సింగరాయకొండ ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సౌజన్య సత్కరించారు. ఈసందర్భంగా పిన్సిపాల్ మాట్లాడుతూ సీనియర్ ఎంపీసీ విభాగంలో చవిడిబోయిన తులసి 967 మార్కులు సాధించి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో టాపర్ నిలిచిందని తెలిపారు. సీనియర్ బైపీసీ విభాగంలో ఉప్పుటూరి సంధ్య 969 మార్కులు సాధించి జిల్లాలో (ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో) ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుందని వివరించారు. జూనియర్ బైపీసీ విభాగంలో పి. సాయిరాం 422 మార్కులు జిల్లాలో ప్రథమ స్థానాన్ని సాధించారన్నారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. భవిష్యత్‌లో వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


పెట్రోలు బంకు వద్ద అగ్నిప్రమాదాల నివారణకు సూచనలు చేస్తున్న ఆశాఖ సిబ్బంది

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వచ్చే వారిని దూరంగా ఉంచండి

టంగుటూరు, ఏప్రిల్ 18 : సెల్ ఫోన్ మాట్లాడుతూ, సిగరెట్టు తాగుతూ పెట్రోల్ బంకుల వద్దకు వచ్చేవారిని కాస్త దూరంగా ఉంచాలని పెట్రోల్ బంకుల సిబ్బందికి అగ్నిమాపక అధికారులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజైన గురువారం టంగుటూరులోని ది టంగుటూరు లారీ ఓనర్స్ ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్(పెట్రోల్ బంకు)లో అక్కడి సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పెట్రోల్ బంకు సిబ్బంది, మేనేజ్‌మెంట్ వారు పాల్గొన్న ఈకార్యక్రమంలో పెట్రోల్ బంకుల్లో జరిగే అగ్నిప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఏ రమణారెడ్డి, సిబ్బంది సీహెచ్ బంగారుబాబు, సీనియర్ డ్రైవర్ ఆపరేటర్ బి. పాల్‌బర్నలు, లీడింగ్ ఫైర్‌మెన్ డి. వెంకటేశ్వర్లు, డ్రైవర్ ఆపరేటర్ పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు .


ప్రజలకు అవగాహన కలిగిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు

అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలి

● అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు

కొండపి, ఏప్రిల్ 18: ఎన్నికల వేళ ప్రజలు, యువకులు అల్లర్లకు, గొడవలకు దూరంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు అన్నారు. గురువారం రాత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పెట్లూరు, పెదకండ్లగుంట, అనకర్లపూడి గ్రామాల్లో ఆయన ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా సహకరించాలని సూచించారు. సీఐ పాండురంగారావు, ఎస్సై కృష్ణబాజీబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తాం

ఇంటింటి ప్రచారంలో టీడీపీ కూటమి నాయకులు


ప్రచారంలో టీడీపీ కూటమి ఉమ్మడి నాయకులు

టంగుటూరు, ఏప్రిల్ 18 : వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసిన సంక్షేమ పథకాలన్నీ రానున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో తిరిగి పునరుద్ధరిస్తామని, అందుకే తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓట్లేసి అధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ కూటమి నాయకులు ఓటర్లకు సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసుల రెడ్డికి ఓట్లేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టంగుటూరు పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో గురువారం ఇంటింటి తెలుగుదేశం శంఖారావం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి హాజరైన కూటమి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేసిన ముఖ్యమంత్రి జగన్ ఏ ఒక్క కార్పొరేషన్‌కు పైసా నిధులు విడుదల చేయలేదని, అదే టీడీపీ ప్రభుత్వంలో 4లక్షల మంది దళితులకు ప్రయోజనం జరిగిందని తెలిపారు. వైసీపీ పాలనలో దారిమళ్లిన సబ్‌ప్లాన్ నిధులు తిరిగి రాబట్టి లబ్ధిచేకూర్చనున్నట్లు తెలిపారు. రద్దయిన భూమి కొనుగోలు పథకం తిరిగి ప్రారంభం అవుతుందని, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం దళిత కాలనీల్లో ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు కామని విజయకుమార్, రాంబాబు, బెల్లం కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్‌నేత బెజవాడ వెంకటేశ్వర్లు, తోకల భారతి, బ్రహ్మానందం, భానుచందర్, మక్కెన కోటేశ్వరరావు, దయానందం, జక్కుల శ్రీను, కుందేటి వెంకట్రావు, యజమాని, పెద్దోడు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్‌నాయకుడు గొల్లపూడి ఆదినారాయణ మృతి

● నివాళులర్పించిన బీఎన్, ప్రముఖులు


నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్ (ఇన్‌సెట్లో) ఆదినారాయణ (ఫైల్)

చీమకుర్తి, ఏప్రిల్18 : చీమకుర్తి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ రంగస్థల నటుడు, వ్యాపారవేత్త గొల్లపూడి ఆదినారాయణ అలియాస్ అడితి ఆదినారాయణ (65) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యానికి గురవటంతో విజయవాడలో వైద్యసేవలు అందిస్తుండగా బుధవారం రాత్రి మృతిచెందారు. గురువారం చీమకుర్తిలోని ఆయన స్వగృహంలో ఉంచిన భౌతికకాయాన్ని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సందర్శించి ఘనంగా నివాళుర్పించారు. ఆదినారాయణ కుమారుడు కోటేశ్వరరావుచౌదరి, కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆదినారాయణ ప్రముఖ రంగస్థలనటుడు, కళారంగంపై మక్కువ కల్గిన వ్యక్తి, రోటరిక్లబ్ ఆఫ్ చీమకుర్తి వ్యవస్థాపనలో, తదుపరి సేవాకార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించటంలో, బాలోత్సవం నిర్వహణలో ఆయన కీలకపాత్ర వహించారు. టీడీపీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనటంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన భౌతికకాయానికి గురువారం సాయంత్రం అంత్యక్రియలను ఘనంగా జరిపారు. ఆయనకు నివాళులర్పించిన వారిలో రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావు, రావిపాటి రాంబాబు, గొల్లపూడి వెంకట్రావు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, రోటరీ క్లబ్ సభ్యులు, కళాకారులు ఉన్నారు.

ఇరుకు రోడ్లు.. ట్రాఫిక్ కష్టాలు

● ఐదేళ్లలో వైసీపీ పాలకులకు కనిపించని ఒంగోలు నగర వీధులు


ఇరుకుగా ఉన్న మునిసిపల్ ఆఫీస్ రోడ్ వద్ద ట్రాఫిక్ జామ్

గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న వైసీపీకి ఒంగోలు నగర వీధులు కనిపించడం లేదు.. ఎక్కడ చూసినా ఇరుకైన రోడ్లు, నిరంతరం ట్రాఫిక్ సమస్యలు కనిపిస్తున్నాయి. గురువారం స్థానిక ప్రకాశంభవనంలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభంకావడంతో కలెక్టరేట్‌కు నాలుగువైపులా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రధానరోడ్డులోకి వాహన రాకపోకలు దారిమళ్ళించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. రోజూ ఆ వైపు నిరంతరం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, నామినేషన్ సమయం వరకు బారికేడ్‌లు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. అయితే ఆ సమయంలో ప్రజల నుంచి పెదవి విరుపు మాటలు వినిపించాలయి. ఇరుకైన రోడ్లలో ఇంకెన్నాళ్ళు ఈ కష్టాలు అంటూ అసహనం వ్యక్తం చేశారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

ఉద్యోగుల పక్షాన పోరాడతాం

ఒకటో తేదీన జీతాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

ఆర్థిక ప్రయోజనాలు చెల్లించకుండా కాలయాపన

జేఏసీ చైర్మన్ సూర్యనారాయణ


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18 : ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిలతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. స్థానిక రంగా భవన్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు రూ.25వేల కోట్లకు పైగా ఆర్థిక బకాయిలు పెండింగ్‌లో ఉండగా ఇంత వరకూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. గత ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. 30 రోజులు కష్టపడి పనిచేసిన ఉద్యోగికి ఒకటో తేదీన జీతం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. 30 ఏళ్లు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వారికి సకాలంలో పించన్ అందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో ఉద్యోగుల పక్షాన నిలవాల్సిన నాయకత్వం నిస్సత్తువతో ఉందని విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఎదురైన సమస్యలు పరిష్కరించడంలో నెలకొన్న జాప్యంతో ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక రాష్ట్ర కోచైర్మన్ కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాజీపఠాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేదారేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యదర్శి వరకుమార్, పాండురంగారెడ్డి, మోహర్‌రావు, రాము, నరసింగరావు, విజయ్‌కుమార్, సురేష్, పి.వి.నారాయణ, కె.శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మాధవి, రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాను, మసూద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు. కాగా అనుమతి లేకుండా ఉద్యోగులతో సమావేశం జరుగుతుందని సి విజిల్ యాప్‌లో ఫొటోను ఎవరో అప్‌లోడ్ చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సూర్యనారాయణతో మాట్లాడారు. అయితే ఈ సమావేశానికి ఎటువంటి అనుమతి అవసరం లేదని, నోటీసు ఇస్తే అందుకు సమాధానం ఇస్తానని ఆయన చెప్పడంతో వెనుదిరిగి వెళ్లారు.

అద్దంకిలో తొలిరోజు నామినేషన్లు నిల్

● హడావుడిగా సీసీ కెమెరాలకు మరమ్మతులు

● అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం


సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అద్దంకి నియోజవర్గంలోని నామినేషన్ పక్రియ గురువారం నుంచి ప్రారంభం అ యింది. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీవీ సునీల్ నామినేషన్ల పక్రియకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. 18 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సెలవు రోజులు మినహాయించి నామినేషన్ల పక్రియ జరుగుతుందన్నారు. 26న పరిశీలన, 29న ఉపసంహరణ అదేరోజు సాయంత్రానికి పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియలో సందేహాలుంటే తహసీల్దార్ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ ద్వారా తెలుసుకోవచ్చని రిటర్నింగ్ అధికారి సునీల్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం రోజు తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాట్లను హడావుడిగా చేశారు. ఇప్పటికే ఆ పని పూర్తి చేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా గురువారం మరమ్మతులు చేయించి ఏర్పాటు చేయించారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయం లోకి అనుమతించబోమని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ఈమేరకు మెయిన్ గేటు వద్ద నిల్చుని ఎవరినీ లోనికి పంపలేదు. ఎన్నికల విధులు కేటాయింపులో భాగంగా ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు వారి అనుమతి పత్రాలను అధికారులకు ఇచ్చేందుకు కూడా లోపలకు అనుమతించలేదు. దీంతో మహిళా ఉద్యోగులు, ఇతర శాఖల ఉద్యోగులు గేటు వద్ద పడిగాపులు కాలయాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు వెనుదిరిగి వెళ్లారు.


నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఈఆర్వో కుమార్

కొండపి అసెంబ్లీకి నోటిఫికేషన్ విడుదల

కొండపి, ఏప్రిల్18: కొండపి అసెంబ్లీకి ఎన్నికల నోటిఫికేషన్ గురువారం ఉదయం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కుమార్ విడుదల చేశారు. ఆమేరకు కొండపి తహసీల్దార్ కార్యాలయంలో బోర్డులో నోటీసును ప్రచురించారు. కార్యక్రమంలో ఏఆర్వో బి. కిరణ్‌కుమార్, తహసీల్దార్లు చక్రవర్తి, సుధాకర్, ఉమాశంకర్ పాల్గొన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న వెంకట్రావు

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో సింగిల్ నామినేషన్

చీమకుర్తి, ఏప్రిల్ 18: సాధారణ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పర్వం మొదలైన తొలిరోజైన గురువారం ఎస్ఎన్‌పాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సింగిల్ నామినేషన్ మాత్రమే దాఖలయింది. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బీఎస్పీ తరపున కైలా వెంకట్రావు ఒకసెట్టు నామినేషన్‌ను ఆర్వో గోపాలకృష్ణకు అందజేశారు. నామినేషన్ కేంద్రం వద్ద పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.


చెక్‌పోస్టు వద్ద ఆర్వో గోపాలకృష్ణ, సీఐలు,అధికారులు

మర్రిచెట్లపాలెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

చీమకుర్తి, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల నిమిత్తం అక్రమంగా మద్యం, నగదు, ఓటర్లను ప్రభావితం చేసే సామగ్రి రవాణాకు అడ్డుకట్ట వేసే నిమిత్తం మర్రిచెట్లపాలెం జంక్షన్ వద్ద గురువారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు ఈ చెక్‌పోస్ట్ పని చేస్తుంది. పోలీస్, రెవెన్యూ ఇతర ఉద్యోగులు మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వర్తిస్తారు. నియోజకవర్గ ఆర్వో గోపాలకృష్ణ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్, ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐ కృష్ణయ్యలు చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ప్రగతి స్కూల్ పూర్వవిద్యార్థి ప్రతిభ

చీమకుర్తి, ఏప్రిల్18 : చీమకుర్తి పట్టణంలోని ప్రగతి స్కూల్‌లో పదోతరగతి వరకూ విద్యాభ్యాసం చేసిన సీహెచ్. ఉదయ్‌కిరణ్ ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 466 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక పాఠశాలలో ఉదయ్‌కిరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుప్రజ, అకడమిక్ అడ్వయిజర్ మల్లిఖార్జునరావు, ప్రిన్సిపల్ కొండలరావు, నాగేశ్వరరావు, శ్రీను, అనురాధ, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌పాడు కాంగ్రెస్ అభ్యర్థిగా విజేష్‌రాజ్

సంతనూతలపాడు, ఏప్రిల్ 18: సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాలపర్తి విజేష్‌రాజ్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల నుంచి బీఫాం అందుకున్నట్లు ఆ పార్టీ నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో సంతనూతలపాడు నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజ్ కుమారుడు విజేష్‌రాజ్ రానున్న ఎన్నికల్లో షర్మిల నాయకత్వంలో పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

త్రిమూర్తులకు ఏడేళ్లు శిక్షవిధించాలి

సింగరాయకొండ, ఏప్రిల్ 18 : దళితుల శిరోముండనం కేసులో 18 నెలలు శిక్షపడిన వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు ఏడేళ్ల జైలుశిక్ష విధించాలని, ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే తొలగించాలని దళిత, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం ప్లకార్డులతో నిరసన తెలిపారు.

నేడు 'స్వామి' నామినేషన్

కొండపి, ఏప్రిల్ 18: కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తన నామినేషన్‌ను కొండపిలోని ఈఆర్వోకు దాఖలు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని స్వగృహం నుంచి 11 గంటలకు బయలు దేరి వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ర్యాలీగా టంగుటూరు మీదుగా కొండపికి చేరుకుని నామినేషన్‌ను దాఖలు చేస్తారు. అనంతరం టంగుటూరు రోడ్డులోని కొండపి గ్రామం వెలుపల బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సీపీఎం సభ్యుల సమావేశం

కొండపి, ఏప్రిల్ 18: పెరిదేపిలోని ముప్పరాజు శేషయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సీపీఎం పార్టీ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడారు. ముప్పరాజు చినబ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్, నాయకులు గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, మల్లెల పెదపేతురు, అంగలకుర్తి బ్రహ్మయ్య, సూరిబాబు, శ్రీనివాసరావు, పరిశుద్ధరావు, చిన్న పేతురు, పుట్టా రామారావు, జి వందనం, రవీంద్ర పాల్గొన్నారు.


నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న శ్రీపతి సతీష్ నాయకులు

కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీపతి సతీష్ నామినేషన్ దాఖలు

కొండపి, ఏప్రిల్18: కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శ్రీపతి సతీష్ తన నామినేషన్‌ను గురవారం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయంలో ఈఆర్వో ఎ. కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఈదా సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, పార్టీ కొండపి మండల అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసులు, సీపీఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్ నామినేషన్లను అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంగమేశ్వరం పూర్తికి కృషి...

నామినేషన్ వేసిన అనంతరం శ్రీపతి సతీష్ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న మూడు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో కొండపిని ఎస్సీ మాల వర్గానికి కేటాయించడం పట్ల పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి తాడికొండ వెంకటేశ్వర్లు, డీసీసీ అధికార ప్రతినిధి మన్నం ప్రసన్నరాజు, కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు దండేల కృష్ణ, డాక్టర్ నావూరి రాం బాబు, డాక్టర్ సురేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌కె. రసూల్, టంగుటూరు మండల సీపీఎం కార్యదర్శి ఏశిపోగు మోజెస్, కాంగ్రెస్‌పార్టీ పొన్నలూరు మండల అధ్యక్షుడు కృష్ణ, మర్రిపూడి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మాలకొండయ్య పాల్గొన్నారు.

మాగుంట సెంటిమెంట్

కొత్తపట్నం మండలం అల్లూరు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం

● అనంతరం మార్కాపురం సెగ్మెంట్లో

● నేడు వైపాలెంలో ఎరిక్షన్‌బాబు నామినేషన్ కార్యక్రమానికి హాజరు



అల్లూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి

కొత్తపట్నం(ఒంగోలు నగరం), ఏప్రిల్ 18 : మాగుంట కుటుంబీకులు రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేసి మొదటిసారి నుంచి వారికి ఒక సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి మొదటిసారి ఎన్నికల్లో ఒంగోలు నుంచి పోటీ చేసి అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న కొత్తపట్నం మండలంలోని అల్లూరులో తొలి ఎన్నికల సభ నిర్వహించి ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి ఆ కుటుంబానికి అల్లూరు గ్రామం ఎన్నికల ప్రచారానికి సెంటిమెంటుగా మారింది. మాగుంట సుబ్బరామిరెడ్డి మరణానంతరం జరిగిన ఉపఎన్నికల్లో పోటీ చేసిన మాగుంట పార్వతమ్మ గాని, ప్రస్తుత ఎంపీ శ్రీనివాసులరెడ్డి గాని పోటీ చేసిన ప్రతిసారీ ఇదే గ్రామంలో మొదట ఎన్నికల సభ నిర్వహించి ప్రచారం ప్రారంభిస్తారు. ఇలా చేయటం వలన విజయం తమ సొంతం అవుతుందని వారికి గట్టి నమ్మకం. ఈ నమ్మకానికి మరింత బలం చేకూర్చుతూ ఎన్నికల్లో పోటీ చేసిన ఎక్కువ సార్లు విజయం సాధించారు. 1991లో ఉప ఎన్నికలతో మొదలైన సెంటిమెంట్‌ను ఇప్పటికీ మాగుంట కుటుంబం కొనసాగిస్తూనే ఉంది. ఏ పార్టీ తరపున పోటీ చేసినా అల్లూరు నుంచే ఆ కుటుంబం ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెడుతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ నుంచి పార్లమెంటుకు పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసులరెడ్డి గురువారం తన నామినేషన్‌ను దాఖలు చేసి అల్లూరు వెళ్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు.

రాజాజీ వీధిలోని సొంతింట్లో నిద్ర కూడా సెంటిమెంటే...

మాగుంట కుటుంబీకులు రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రెండు రకాల సెంటిమెంట్లను తూచ తప్పకుండా పాటిస్తున్నారు. అందులో ఒకటి అల్లూరు గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించటం కాగా, రెండోది నెల్లూరులో వారి సొంత ఇళ్లు ఇంకో సెంటిమెంటు. ఏ ఎన్నికల్లో అయినా ఆ కుటుంబంలోని ఎవరు పోటీ చేయాలన్నా నామినేషన్ వేయబోయే ముందు రోజు రాత్రి నెల్లూరులోని రాజాజీ వీధిలో ఉన్న మాగుంట కుటుంబానికి చెందిన పాత ఇంటిలో నిద్ర చేయటం కూడా వారికి సెంటిమెంటుగా మారింది. తాతాల నాటి నుంచి వస్తున్న ఆ ఇంటిలో నిద్ర చేసి మరుసటి రోజున నామినేషన్ వేస్తే విజయం తమ సొంతం అవుతుందనేనిది కూడా ఆ కుటుంబానికి గట్టి నమ్మకం. ఇదే నమ్మకాన్ని పాటిస్తూ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం రాత్రి నెల్లూరులోని రాజాజీ వీధిలోని తన ఇంటిలో నిద్ర చేసి గురువారం ఒంగోలు వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.

పర్యటన సాగిందిలా...

తొలుత సెంట్‌మెంట్ ప్రకారం ఎంపీ మాగుంట అల్లూరు గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ఒక వీధిలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రత్యేకించి టీడీపీ, జనసేన కార్యకర్తలు మాగుంటకు సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి బయలుదేరి మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని పొదిలి మండలం ఉప్పలపాడులో ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. మాగుంట కుటుంబం సేవా కార్యక్రమాలు, రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు లాంటి నేత సీఎం కావాల్సిన అవసరం వంటి అంశాలను మాగుంట ప్రస్తావించారు. కాగా గురువారం రాత్రి మార్కాపురంలో బస చేసిన మాగుంట శుక్రవారం ఎర్రగొండపాలెంలో అక్కడి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ కార్యక్రమం, ఆ సందర్భంగా నిర్వహించే ర్యాలీ, సభల్లో పాల్గొంటారు. సాయంత్రం మార్కాపురంలో జరిగే టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ఆత్మీయ సమావేశంలోనూ, అలాగే 20వతేదీ మార్కాపురం, తర్లుబాడు మండలాల్లో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. గురువారం ఉదయం ఎంపీ మాగుంట నామినేషన్ కార్యక్రమంలో, పొదిలి మండలంలో ప్రచారంలో ఆయన తనయుడు రాఘవరెడ్డి పాల్గొన్నారు. అలాగే శుక్రవారం కొండపిలో డాక్టర్ స్వామి నామినేషన్ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొననున్నారు.

లోకేష్‌ను కలిసిన బాచిన

బాపట్ల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ఆయన కుమారుడు కృష్ణ చైతన్యలు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఇటీవల వరకు పనిచేసిన కృష్ణచైతన్య ఇటీవలే టీడీపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. గురువారం వారి అనుచరులతో కలిసి లోకేష్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ అధికారంలోకి రాగానే సముచిత ప్రాధాన్యం దక్కుతుందని లోకేష్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎవరికీ అన్యాయం జరగదని, పార్టీ గెలుపుకోసం సమష్టిగా పనిచేయాలని న్యాయం చేసే బాధ్యత తాను తీసుకుంటానని లోకేష్ స్పష్టం చేసినట్లు సమాచారం



హైదరాబాద్‌లో నారా లోకేష్‌ను కలిసిన బాచిన కృష్ణ చైతన్య, ఆయన తండ్రి చెంచు గరటయ్య

ధీటుగా.. ధాటిగా

అటు అసెంబ్లీలోనూ, ఇటు జిల్లాలోనూ వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన ఎమ్మెల్యే స్వామి

అధికారంతో పదేపదే అడ్డంకులు కలిగించినా లెక్కచేయని డోలా



ఒంగోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయడంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ముందు నిలిచారు. అది అసెంబ్లీ అయినా, లేక జిల్లాస్థాయి సమావేశం అయినా రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టడంలో ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. అలాగే జిల్లాలోని వివిధ వర్గాల సమస్యలను ఎత్తిచూపుతుండడం వైసీపీ నేతలకు కంటగింపుగా మారింది. వారు ఎమ్మెల్యే స్వామిని లక్ష్యంగా చేసుకుని అసెంబ్లీ సాక్షిగా దాడులకు తెగబడినా.. సొంత పార్టీ సభ్యుల సంఖ్యా బలం లేని జిల్లా స్థాయి సమావేశాలలో స్వామిపై ఒంటికాలిపై వైసీపీ ప్రజా ప్రతినిధులు లేచినా.. చివరకు నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి, ఇతర నాయకులు అనరాని మాటలు అన్నా ఏ మాత్రం అదరలేదు.. బెదరలేదు..! అందుకు రాష్ట్రస్థాయిలో అధిష్టానం, జిల్లాలో ఇతర ముఖ్యనేతలు, నియోజకవర్గంలో పార్టీ యువనేత దామచర్ల సత్య, అలాగే పార్టీ శ్రేణులు అంతా స్వామికి అండగా నిలిచారు.

ఒకే ఒక్కడుగా గెలిచి.. నిలిచి..

రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీకి చేదు ఫలితాలు ఎదురైన విషయం విదితమే. కేవలం 23 స్థానాలకే పరిమితం కాగా అందులోనూ నలుగురు వైసీపీకి మద్దతు తెలిపారు. ఆ విషయం అలా ఉంచితే.. రాష్ట్రంలో 33 ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాలు ఉండగా టీడీపీలో ఒకే ఒక్కడుగా కొండపి ఎస్సీ స్థానం నుంచి డాక్టర్ స్వామి గెలుపొందారు. రాష్ట్ర పార్టీ తరపున ఉన్న ఏకైక దళిత ఎమ్మెల్యే ఆ పార్టీ తరపున ఎస్సీ ఎస్టీల సమస్యలపై గొంతు విప్పే బాధ్యత స్వామిపై పడింది. అదే సమయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో లెక్కకు టీడీపీ నుంచి నలుగురు గెలిచినా ముగ్గురు బాపట్ల జిల్లా పరిధిలోకి పోగా ప్రస్తుత ప్రకాశంజిల్లా పరిధిలో స్వామి ఒక్కరే మిగిలారు.

యావత్తు పార్టీ, దామచర్ల కుటుంబం అండగా...

నియోజకవర్గంలోని వైసీపీ బాధ్యులు స్వామిపై లేని ఆరోపణలు చేయిస్తూ, ఇతర రూపాలలో ఆటంకాలు కలిగించి ఇంటిపై రెండు సార్లు, సంగమేశ్వర వద్ద ఒకసారి, కొండపి సభలో మరోసారి భౌతిక దాడికి కూడా సిద్ధమయ్యారు. ఈ క్రమంలో యావత్తు టీడీపీ శ్రేణులు, దామచర్ల కుటుంబం ఆయనకు మద్దతుగా నిలిచారు. ఎప్పటికప్పుడు వాటిని తిప్పకొట్టి ప్రతిపక్షంలో సమర్థ నేతగా గుర్తింపు పొందారు.

వైసీపీ నేతలకు కంట్లో నలుసుగా మారిన ఎమ్మెల్యే స్వామి

అటు రాష్ట్రంలో దళిత, గిరిజన వర్గాల సమస్యల పైనా, ఇటు జిల్లాలో మొత్తం ప్రజా సమస్యలు పైనా అసెంబ్లీ లోపలా, వెలుపలా సమర్థంగా తన వాణిని బలంగా వినిపించి వైసీపీ నేతలకు కంట్లో నలుసుగా మారారు. అధికార పక్షాన్ని అవసరమైన ప్రతి సందర్భంలోనూ ఇరకాటంలో పడేసేలా, వారి తీరుని ఎండగడుతూ బలంగా గొంతు విప్పారు. టీడీపీ ప్రభుత్వంలో దళిత, గిరిజన వర్గాల సంక్షేమానికి జరిగిన కృషి, అమలు చేసిన పథకాలు, వాటి ఫలితాలు అదే సమయంలో వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న నిర్లక్ష్యం, పథకాలు, దళితులపై జరుగుతున్న దాడులు అంశాలపై అసెంబ్లీ వేదికగా ముందుండి వాణి వినిపించిన స్వామి జిల్లాలోని ప్రజా సమస్యలపైనా అలాగే స్పందించారు. వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులపై ఆందోళనలు, అమరావతి రైతులకు అలాగే చంద్రబాబు అరెస్టుకు నిరసనా సాగిన ఆందోళనలు, ఆయా వర్గాలపై జరిగే దాడులను ఖండించడంలోనూ జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై యంత్రాంగాన్ని, అధికార పక్షాన్ని నిలదీయడంలోనూ ముందున్నారు. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ అధినాయకులు.. స్వామిని కట్టడి చేసే విధంగా తమదైన శైలిలో ప్రయత్నించినా ఏ మాత్రం వెరవకుండా ముందుకు సాగారు.

'చెక్'పోస్ట్ కష్టాలు..!

సింగరాయకొండ, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల వేళ వాహనాల్లో అక్రమ నగదు, మద్యం, ఇతర సామాగ్రి తరలింపునకు చెక్ పెట్టటానికి జాతీయ రహదారిపైన అక్కడక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సింగరాయకొండ జాతీయ రహదారిపై పెరల్స్ డిస్టలరీ వద్ద జిల్లా సరిహద్దు చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. దీనిని ఆంధ్రజ్యోతి గురువారం పరిశీలన చేసింది. రోజుకి మూడు షిఫ్టులలో స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఒక్కో టీంలో ఐదుగురు పోలీసు సిబ్బంది, వారికి ఒక ఇన్‌చార్జి 8గంటలు పనిచేస్తున్నారు. ఒక షిఫ్టుకు 250 నుంచి 300 వాహనాల వరకూ తనిఖీ చేస్తున్నారు. రోజుకి సుమారు 800 వావానాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ వాహనాల తనిఖీల వలన వాటిలో ప్రయాణించే సామాన్యులకు ఇక్కట్లు తప్పడం లేదు. చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేయాలని ఎస్ఈసీ ఆదేశాలతో సిబ్బంది జాతీయ రహదారిపై వెళ్లే అధికభాగం వాహనాలను జల్లెడపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది. అత్యవసరంగా వెళ్లే వారు సైతం పోలీసులు చేయిత్తిన వెంటనే వాహనాలకు బ్రేక్ వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివలన వారు కొంత అసౌకర్యానికి గురవుతున్నారు.





మహిళ ప్రయాణిస్తున్న కారులో పోలీసుల తనిఖీలు

కారులో ప్రయాణించే మహిళలు కూడా చెక్‌పోస్ట్ వద్ద వాహనాన్ని నిలుపుదల చేసినపుడు కిందకి దిగి కారు డిక్కి, డోర్స్ తీసి పోలీసుల సోదాలకు ఇబ్బంది పడుతూనే సహకరిస్తున్నారు. ఆంధ్రజ్యోతి కొంతమంది వాహనదారులతో మాట్లాడగా ఎన్నికల నిబంధనల ప్రకారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారుకాని.. రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి కావాల్సిన నగదు, మద్యాన్ని వారి అనుచరులు, అనుకూల ప్రాంతాలకు ముందుగానే తరలించారని వారి మనోగతాన్ని వ్యక్తం చేశారు.

బైక్‌పై కోడిపిల్లలను తీసుకెళ్తున్న ట్రేను పరిశీలిస్తున్న పోలీసులు



85 ఏళ్లు పైబడిన వృద్ధులు దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దకే ఓటు

వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్

ఈనెల 22లోపు దరఖాస్తుకు అవకాశం

వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం ఉన్న దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఎన్నికల కషన్ అవకాశం కల్పించింది. అందుకోసం జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కును పొందేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫారం-12డి దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల కమిషన్ నిర్దేశించిన తేదీల్లో వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించుకోనున్నారు. అందుకోసం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేయడంతో తదనుగుణ చర్యలు చేపట్టారు. ఉద్యోగులు ఏ విధంగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటారో అదే విధంగా వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. ఆ దరఖాస్తుతోపాటు ఓటరు కార్డు జెరాక్స్‌ను కూడా జత చేసి సమర్పించాలి. జిల్లా వ్యాప్తంగా 85 ఏళ్ల పైబడిన వృద్ధులు సుమారు 7వేల మందికి పైగా ఉన్నట్లు సమాచారం. 40శాతానికి పైగా ఉన్న దివ్యాంగులు మరో 15వేల మంది వరకు ఉన్నట్లు సమాచారం. వారంతా ఆ నియోజకవర్గ పరిధిలోని ఆర్వోల వద్ద దరఖాస్తు చేసుకుంటే వచ్చేనెల 5వ తేదీ నుంచి 7వ తేదీలోపు వారి ఇంటి వద్దకే వచ్చి ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. అందుకోసం ఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈ అవకాశాన్ని కల్పించింది.

ప్రజల నాడి పట్టిన డాక్టర్ లక్ష్మి

» ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ కూటమి అభ్యర్థి » ఆప్యాయ పలకరింపులతో ప్రజల్లోకి.. విశేష స్పందన

దర్శి, ఏప్రిల్ 18 : దర్శి నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రజల నాడి పట్టుకున్నారు. నిన్న మొన్నటి వరకు ప్రజల నాడి పట్టుకొని వైద్య సేవలు అందించి మంచి డాక్టర్‌గా గుర్తింపు పొందిన లక్ష్మి నేడు రాజకీయ రంగంలో ప్రజల సమస్యలను సావదానంగా వింటూ, పరిష్కారం కోసం మార్గాలను చూపుతూ ముందుకు సాగుతున్నారు. మూలనున్న పండుముదుసలి నుంచి చంకలో ఉన్న చిన్న పిల్లోడి వరకు అందరితో ఆప్యాయంగా మాట్లాడుతూ.. వారిలో ఒకరిగా వదిగిపోతూ సాంత్వన చేకూరుస్తున్నారు. కొన్ని అంశాల్లో ముక్కుసూటిగా మాట్లాడుతూ స్పష్టమైన హామీలు ఇస్తున్నారు. ఆమె ప్రచార తీరుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా వ్యవహరిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులందరితో కలిసికట్టుగా ప్రచారం చేస్తున్నారు. వీరికితోడు ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అపార అనుభవం, ఆయన కుమారుడు రాఘవరెడ్డి చొరవతో టీడీపీ ప్రచారంలో దూసుకెళ్తుంది. అదే క్రమంలో టీడీపీలోకి వైసీపీ నుంచి భారీగా చేరికలు జరుగుతున్నాయి.

వైసీపీ నుంచి భారీ చేరికలు

వైసీపీ నుంచి ముఖ్య నాయకులతో పాటు వందలాది కుటుంబాలు ఇప్పటికే టీడీపీలో చేరాయి. ముండ్లమూరు, దొనకొండ మండలాల వైసీపీ కన్వీనర్లు బిజ్జం సుబ్బారెడ్డి, కందుల నారపురెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, దొనకొండ జడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీలు మిట్టా కోటిరెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, దర్శి నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డి తదితర ముఖ్య నాయకులతో పాటు అనేకమంది ముఖ్య కార్యకర్తలు కూడా టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి వచ్చిన నాయకులు తన అనుచరులను ముమ్మరంగా టీడీపీలో చేర్పిస్తున్నారు. దర్శి, దొనకొండ, ముండ్లమూరు మండలాల్లో వందలాది కుటుంబాలు టీడీపీలో చేరి పార్టీ గెలుపుపై మరింత నమ్మకాన్ని పెంచాయి.



ప్రజల్లో ఒదిగిపోతూ ప్రచారం చేస్తున్న లక్ష్మి

గొట్టిపాటి కుటుంబంపై తరగని నమ్మకం

టీడీపీ పట్ల ఆదరణ పెరుగుతుండడంతోపాటు అసెంబ్లీ అభ్యర్థి లక్ష్మి పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఆమె మహిళల వద్దకు వెళ్లి వారితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆమె ప్రసంగాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి.. ఆలోచింపజేస్తున్నాయి. నియోజకవర్గ సమస్యలను వివరిస్తూ శాశ్వత పరిష్కారం చేయిస్తానని స్పష్టమైన హామీ ఇస్తుండటంతో ప్రజల్లో విపరీతమైన స్పందన లభిస్తోంది. ఆమె కుటుంబ నేపథ్యం కూడా ఆమెపై నమ్మకాన్ని పెంచుతుంది. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనమరాలిగా, దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య కుమార్తెగా ఆమె పరిచయం చేసుకుంటున్నారు. గత 40 ఏళ్లగా వారి కుటుంబం అందించిన సేవలను మచ్చలేని రాజకీయ జీవితాన్ని గుర్తుచేస్తున్నారు. వారి వారసురాలిగా దర్శి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ఇచ్చిన హామీలు తుచ తప్పకుండా అమలు చేస్తానని భరోసా ఇస్తున్నారు.

మద్దతు ప్రకటించిన అన్ని వర్గాల వారు

టీడీపీకి అన్ని వర్గాలు, విభాగాల వారు మద్దతు ప్రకటించారు. టీడీపీకి కాపు జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు దర్శిలో పర్యటించి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదేవిధంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఐటీ ఉద్యోగులు ఆత్మీయ సమావేశాలు నిర్వహించి సంపూర్ణ మద్దతు తెలిపారు. అన్నివర్గాల మద్దతు లభిస్తుండటంతో విజయం తథ్యమని టీడీపీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.

వంద పడకల ఆస్పత్రి, వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటు

టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సేవలందించటమే కాక సొంత నిధులతో దర్శిలో మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ నిర్మించి తమ కుటుంబం సేవలందిస్తుందని భరోసా ఇస్తున్నారు. ఎన్ఆర్ఐల సహకారంతో నియోజకవర్గంలో వంద వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దొనకొండలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చేస్తామని, ఎన్ఆర్ఐల సహకారంతో పరిశ్రమల ఏర్పాటు చేస్తామని చెప్పటంతో నిరుద్యోగ యువత కూడా సానుకూలంగా స్పందిస్తోంది. అన్నివర్గాల ప్రజల సమస్యలు గుర్తించి అందరికీ న్యాయం చేస్తానని వినమ్రంగా తెలియజేస్తున్నారు.

సైకిల్ ఎక్కిన వైసీపీ నేత



నామినేషన్ల ప్రారంభం రోజునే ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ నియోజకవర్గంలో ముఖ్యనేతగా ఉన్న దివి పున్నారావు తెలుగుదేశం పార్టీలో చేరారు. తన స్వగ్రామమైన ఎన్‌జీపాడు మండలం పోతవరంలో అనుచరులతో కలిసి టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే ఆయన పార్టీలో చేరిన ఆనందంలో ఆయన అనుచరులు, టీడీపీ శ్రేణులు వెంటనే ఓ సైకిల్ తెప్పించి ఆయనను దానిపై కూర్చోబెట్టి నినాదాలు చేశారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా దివి క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలో, తర్వాత ఆవిర్భావం నుంచి వైసీపీలో ముఖ్యనేతగా ఉంటున్నారు. ఎన్‌జీపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా సుదీర్ఘ కాలం పనిచేసిన పున్నారావు, వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ మండల అధ్యక్షుడుగా పనిచేశారు. పోతవరం సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యునిగా పున్నారావు పనిచేయగా ఆయన సతీమణి దివి రంగవల్లి ఎన్‌జీపాడు ఎంపీపీగాను గతంలో పనిచేశారు.

-ఒంగోలు, ఆంధ్రజ్యోతి

కఠిన నిబంధనలతో ఇబ్బందులు

కొండపి, ఏప్రిల్ 18 : నామినేషన్ల సందర్భంగా కఠిన ఆంక్షలు విధించడంతో ప్రజలు గురువారం నానా ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్లు వరకు బారికేడ్లు కట్టి వాహన రాకపోకలపై, నడిచివెళ్లే ప్రయాణికులపై సైతం ఆంక్షలు విధించారు. వంద మీటర్లు లోపల దుకాణాలను పోలీసులు మూయించారు. ఉదయం పది గంటల వరకు ఆర్టీసీ డిపో వరకు టంగుటూరు రోడ్డులోని బస్సులను అనుమతించిన పోలీసులు పది గంటల తర్వాత నుంచి ఆంక్షలు విధించారు. అదేవిధంగా ఆటోలు, ఇతర వాహనాలు కూడా రాకుండా నిరోధించారు. టంగుటూరు రోడ్డులో కొండపి గ్రామం వెలుపలే బస్సులను, ఆటోలను ఆపివేయడంతో ప్రయాణికులు నడిచి వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రతలో వృద్ధులు నడవలేక అవస్థలు పడ్డారు. కొంత మంది పొలాలకు అడ్డంగా నడుచుకుంటూ దగ్గరి దారులు ద్వారా నడిచివెళ్లారు. మీడియా కూడా తహసీల్దార్ కార్యాలయం వెలుపల వేచి ఉండగా, ఆర్వోతో మాట్లాడిన సింగరాయకొండ సీఐ రంగనాథ్ 100 మీటర్ల వెలుపల మీడియా వేచి ఉండాలని సూచించారు. ఈఆర్వో కూడా తాను డీఆర్వోతో మాట్లాడానని వంద మీటర్లు దూరంలో మీడియా పాయింట్ ఏర్పాటు చేశామని అక్కడే మీడియా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. భద్రతను కొండపి సీఐ పాండురంగారావు, ఎస్సై కృష్ణబాజీబాబు, పొన్నలూరు ఎస్సై రాజేష్‌లు పర్యవేక్షించారు.



బస్సులు, ఆటోలు గ్రామం వెలుపల ఆపడంతో పొలాల్లో నడిచివెళుతున్న ప్రయాణికులు

వెలిగొండ పూర్తే తొలిప్రాధాన్యత

● గిద్దలూరు టీడీపీ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ● నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



వెలగలపాయలో పర్యటిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

కంభం (అర్ధవీడు), ఏప్రిల్ 18 : పశ్చిమ ప్రకాశం ఆయువు పట్టు అయిన వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం, రైతాంగానికి నీరు అందించడం ఎన్‌డీఏ కూటమితోనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజలకు తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 14వ రోజు అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, బొమ్మిలింగం, చెంచుకాలనీ, గన్నేపల్లి, రంగాపురం, యాచవరం, పోతురాజుటూరు, మాగుటూరు, కొత్తూరు, నాగులవరం, కాకర్ల గ్రామాలలో పర్యటించారు. గ్రామంలో పెద్దలను, కార్యకర్తలను, మహిళలను కలుసుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ హయాంలో వెలుగొండ ప్రాజెక్టును నారా చంద్రబాబునాయుడు 80శాతం పనులను పూర్తి చేస్తే అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మిగిలిన 20శాతం పనులు పూర్తి చేయడానికే ఐదేళ్ల సమయం సరిపోలేదని యద్దేవచేశారు. ఎన్నికల సమయం వచ్చిన ప్పటికీ టన్నెల్ పూర్తికాకపోయినా జగన్ ప్రభుత్వం గారడి చేసి టన్నెల్ పూర్తి చేసినట్లు అబద్ధపు ప్రచారాలు చేసి రైతులను మోసం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి రైతులపై, వ్యవసాయ రంగంపై చిత్తశుద్ధి లేదన్నారు. రైతులకు అనేక పథకాలను ప్రవేశపెట్టి వాహనాలు, రాయితీ రుణాలను ఎన్నో సంక్షేమ పథకా లను అందించినట్లు గుర్తుచేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే గతంలో ఇచ్చిన సంక్షేమ పథకా లను అందిస్తూ అన్నదాతకు ఏటా రూ.20వేలు అందించనున్నట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గిద్దలూరు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, ఎవరిపై కక్షసాధింపు చర్యలు చేయలేదన్నారు. తాను స్థానికుడినని, ప్రజలకు అందుబా టులో ఉంటానని, అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, టీడీపీ, బీజేపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గిద్దలూరులో ముత్తుముల పుష్పలీల ప్రచారం



అర్ధవీడులో అశోక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

గిద్దలూరు టౌన్ : అభివృద్ధి చేసే వారికే ఓటు వేయాలని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి భార్య ముత్తుముల పుష్పలీల అన్నారు. గురువారం పట్టణంలోని 3వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి మానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ కర పత్రాలను పంపిణీ చేశారు. పుష్పలీల మాట్లాడుతూ నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి శాసనసభ్యునిగా ఉన్న సమయంలో అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించారన్నారు. మే 13న జరిగే శాసన సభ, పార్లమెంటు ఎన్నికల్లో ముత్తుముల అశోక్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో పట్టణ పార్టీ అధ్యక్షులు షానావలి, కౌన్సిలర్లు పాలుగుళ్ల శ్రీదేవి, చంద్రశేఖర్, బాలచెన్నయ్య. బొంతా లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పాములపల్లెలో పుష్పలీలకు బ్రహ్మరథం

టీడీపీ అభ్యర్థి ముత్తుముల పుష్పలీల నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. గ్రామ పొలిమేర నుంచి మహిళలు గ్రామ టీడీపీ శ్రేణులు ఆమెకు ఘనస్వాగతం పలికాయి. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపుతో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆమె వివరించారు. ఆమె వెంట కౌన్సిలర్లు చంద్రశేఖర్‌యాదవ్, గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు గర్రె శ్రీనాథ్, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, పాముల వెంకటరమణ యాదవ్, రఫీ, తదితరులు ఉన్నారు.

వైసీపీ నాయకుల కనుసన్నల్లో మద్యం నిల్వలు

బేస్తవారపేట,ఏప్రిల్18 : ఎన్నికల నిబంధనలతో మద్యం దుకాణాలను లక్ష్యం పూర్తయిన వెంటనే దుకాణాలు మూసివేయాలి. దీంతో మధ్యాహ్నానికే దుకాణాలు మూత పడుతున్నాయి. దీంతో గ్రామాల్లో ఉండే అధికారపార్టీ నాయకులకు ముందుగానే మద్యం నిల్వలు చేరుతున్నాయి. వాటిని నిల్వ పెట్టుకొని ఆ గ్రామాల నుండి నామినేషన్‌కు, సమావేశానికి వచ్చే సమయంలో ఆ గ్రామ చోటా నాయకుడు మద్యం సీసాలు ఇస్తున్నారు. వారం రోజులు క్రితం బేస్తవారపేటలో టీడీపీ బహిరంగ సభ సమయంలో ఒక వ్యక్తి రెండు కేసుల మందు తీసుకెళుతోంటే స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. అధికార పార్టీ నాయకుల కనుసైగల్లో మద్యం నిల్వలు ఉంటే పోలీసులు పట్టిపట్టనట్లు ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఏడుగురు వలంటీర్లు రాజీనామా

పొదిలి, ఏప్రిల్ 18 : నగరపంచాయతీ పరిధిలోని కంభాలపాడు, సచివాలయం 3లో పనిచేస్తున్న ఏడుగురు వాలంటీర్లు గురువారం రాజీనామ చేశారు. రాజీనామ పత్రాన్ని ఎంపీడీవో గేసియాబేగంకు అందజేశారు. రాజీనామ చేసిన వారిలో కంభాలపాడు సచివాలయం నుండి కర్ణా శ్రీనివాస్, కల్లూరి క్రిష్ణారెడ్డి, టి శిరీషారెడ్డి, కోవెలకుంట్ల వెంకటేశ్వర్లు, అంబటి రఘురామిరెడ్డి, అంబటి లక్ష్మిలు ఉన్నారు. అదే విధంగా సచివాలయం 3లో వాలంటర్‌గా పనిచేస్తున్న షేక్ షాహీనా రాజీనామ చేశారు. గతంలో నలుగురిని వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న క్రమంలో విధుల నుండి తొలగించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

● నెర్రెలు ఇచ్చి కూలేందుకు సిద్ధం



బాలికల వసతిగృహం వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభం

పొదిలి, ఏప్రిల్ 18 : పట్టణంలోని పుల్లర్‌పేట, బాలికల వసతిగృహం పక్కన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ఈ స్తంబాలు అలాగే ఉన్నాయి. విద్యుత్ స్తంబాలు శిథిలావస్థకు చేరాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో ఏమి చేయలేని స్థితిలో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలికల వసతిగృహం పక్కన ఉన్న స్తంభం పూర్తిగా పెచ్చులూడి ప్రమాదకరంగా పట్టించుకోకపోవడం ఏమిటని ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి స్తంభాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న రమేష్‌యాదవ్

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 18 : అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన పులి మధుగౌడ్ కుటుంబానికి టీడీపీ నాయకులు బిల్లా రమేష్ యాదవ్ రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశాడు. 7వ వార్డులోని గాయత్రి నగర్‌లో నివసిస్తున్న పులి మధు గౌడ్ కుటుంబసభ్యులను బిల్లా రమేష్ పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

చిత్రపటాల పంపిణీ

గిద్దలూరు, ఏప్రిల్ 18 : తొలిస్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. ముండ్లపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడుతూ.., దేశభక్తి కలిగిన నరసింహారెడ్డి చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

హత్య కేసునుఛేదించిన పోలీసులు

● రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన నిందితుడి అరెస్టు
● బావమరిదే హతమార్చినట్లు నిర్ధారణ
● మద్యానికి బానిసై అక్కను వేధించడమే కారణం

గిద్దలూరు, ఏప్రిల్ 18 : మద్యానికి బానిసై తన అక్కను చిత్రహింసలు పెడుతున్న బావను పథకం ప్రకారం అంతమొందిన బావమరిదిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి(43)కు హస్మితతో ఇంచుమించు పద్దెనిమిదేళ్ల క్రితం వివాహమైంది. అయితే మద్యానికి బానిసైన ఖాజావలి నిత్యం ఆమెను శారీరకంగా మానసికంగా వేధించేవాడు. ఖాజావలి బావ షేక్ అబ్దుల్ సుభానీ కూడా గిద్దలూరు పట్టణంలోని కొప్పువారివీధిలో నివసిస్తూ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలోనే ఖాజావలిని అడ్డు తప్పించాలని ఆయన బావమరిది షేక్ అబ్దుల్ సుభాని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం ఈ నెల 13న అంబులెన్స్‌లో ఎక్కించుకుని గిద్దలూరు నుండి తాటిచెర్లమోటుకు వెళ్లాడు. యడవల్లి సమీపంలో క్రాస్ రోడ్డు వద్ద అంబులెన్స్‌ను ఆపి హెడ్‌లైట్లు వెలుగడం లేదని చూడాలని బావ ఖాజావలి చెప్పాడు. ఖాజావలి అంబులెన్స్ ముందుకు వెళ్లి హెడ్‌లైట్లు పరిశీలిస్తుండగా డ్రైవింగ్‌లో ఉన్న బావమరిది అబ్దుల్‌సుభాని అంబులెన్స్‌ను ముందుకు నడిపాడు. దీంతో ఖాజావలి రోడ్డుపై పడిపోయాడు. అనంతరం అంబులెన్స్ ఎక్కించి ఖాజావలి మృతికి కారణమయ్యాడు. అనంతరం ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వలన ఖాజావలి మృతిచెందినట్లు షేక్ హస్మత్‌తో ఫిర్యాదు చేయించాడు. అయితే రూరల్ సీఐ దాసరి ప్రసాద్, రాచర్ల ఎస్సై హరిబాబు పూర్తిస్థాయిలో విచారించారు. బావమరిదే హత్య చేసినట్లు గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశించినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. ఘటనపై విచారించే క్రమంలో పోలీసులకు పలు అనుమానాలు వ్యక్తం కావడంతో వారిదైన కోణంలో విచారించడంతో వాస్తవాలు వెలుగుచూశాయి.

చిరు వ్యాపారులపై ఎన్నికల ఆంక్షలు

పోలీసుల ఆదేశాలతో మూతపడ్డ దుకాణాలు

గిద్దలూరు, ఏప్రిల్ 18 : ఎంకి పెళ్లి సుబ్బిచావుకొచ్చిందన్న చందంగా గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చిరువ్యాపారుల పరిస్థితి తయారైంది. నామినేషన్ల నేపథ్యంలో ఆంక్షలతో చిరు వ్యాపారులకు ఉపాధి పోయింది.

ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ వేసేందుకు పెద్దసంఖ్యలో కార్యకర్తలు నాయకుల వెంట తరలివస్తారు. కావున టీలు కాఫీలు, టిఫిన్లు, కూల్‌డ్రింక్స్ లాంటివి కొనుగోలు బాగుంటుందని చిరువ్యాపారులు ఎన్నికలపై కోటి ఆశలు పెట్టుకున్నారు. అసలు దుకాణాలే తెరవవద్దని పోలీసులు ఆంక్షలు విధించడంతో ఒక్కసారిగా వారి ఆశలు ఆవిరయ్యాయి. గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల కేంద్రం ఏర్పాటు చేయడంతో కార్యాలయం బయట జాతీయ రహదారికి ఇరువైపులా పోలీసులు బారీకేడ్లు ఏర్పాటు చేశారు. కుమ్మరాంకట్ట నుంచి అయ్యప్పస్వామి దేవాలయం వరకు సగం రోడ్డును పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మిగిలిన సగం రోడ్డులో మాత్రమే జాతీయ రహదారిలో వాహనాలను అనుమతించారు. దీంతో ఎదురు దెరుగా ఒకే రోడ్డులో వాహనాలు వచ్చి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దానికితోడు రెవెన్యూ కార్యాలయానికి అటూ ఇటూ ఉండే రోడ్డు పక్కన అంచులలో ఉన్న టీస్టాల్స్, హోటల్స్ ఇతర చిరు దుకాణాలను, బంకులను పోలీసులు మూయించారు. దీంతో ఎన్నికల వేళ ఎక్కువ వ్యాపారం చేసుకొని ఒకరూపాయి అదనంగా మిగిలించుకోవచ్చని భావించిన చిరు వ్యాపారులకు అసలు ఉపాదే లేకుండా పోయింది.



రోడ్డు వెంబడి మూతపడ్డ చిరు దుకాణాలు

కూటమి విజయంతోనే వైసీపీ దురాఘాతాలకు అడ్డుకట్ట

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరసనగండ్ల

మార్కాపురం వన్‌టౌన్ 18 : రాష్ట్రంలో అధికారపార్టీ దురాగాతాలకు అడ్డకట్ట వేయాలంటే ఎన్డీఏను గెలిపించుకోవాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు సిరసనగండ్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ఎంపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని గెలిపించుకుంటే నియోజకవర్గ సమస్యలను డబుల్ ఇంజన్ సర్కార్‌ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సరోజిని, పీవీ.కృష్ణారావు, జి.శ్రీనివాసరావు, కె.రమణ, కడియం రామయ్య, జి.రాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పేదల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

పొదిలి : రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టీడీపీ కూటమి అభ్యర్థుల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని టి.సల్లూరు, ఏలూరు, ఉప్పలపాడు, తలమళ్ల, గోగినేనివారిపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ పాలనలో బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆనందంతో ఉంటారన్నారు. పేదల కోసం ఆనాడు అన్న ఎన్‌టీఆర్ టీడీపీ స్థాపించి ఎన్నో సంక్షేమ పథకాలను అన్నిరంగాల ప్రజలకు అందించార న్నారు. అదేదారిలో ఇప్పుడు నారా చంద్రబాబునాయుడు నడుస్తున్నారని తెలిపారు. పేదలు అభివృద్ధి చెందాలంటే జరగబోయే ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో కూటమి గెలుపుతోపాటు చంద్రబాబు పాన ఎంతో అవసరమన్నారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా తన తండ్రి శ్రీనివాసరెడ్డి బరిలో ఉన్నారని చెప్పారు. వీరి ఇరువురి గెలుపు పోలవరం, వెలుగొండ, మార్కాపురం జిల్లా చేయడం ముందున్న ధ్యేయమన్నారు. మండలంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత నీటి సమస్యను శాశ్విత పరిష్కారం చూపేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కసారి తనకు మద్దతు పలకాలని కందుల నారాయణరెడ్డి కోరారు. గ్రామాల్లో మీరు చూపిస్తున్న ఆదరాభిమానాలను ఓటు రూపంలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ టీడీపీ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో రాఘవరెడ్డి, కందుల నారాయణరెడ్డి

వైసీపీని వీడి టీడీపీలోకి ఎంపీటీసీ సభ్యుడు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 18 : మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి సహా 50 కుటుంబాలు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరందరికీ ముత్తుముల అశోక్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వెసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో శాసనసభ్యుడిగా తనను, పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఎద్దుల సుబ్బారెడ్డి, ఖాశింపీరా, మంద అశోక్, బి.శిఖామణి, తంగెళ్ల సురేష్ సుధాకర్, గౌరీదాస్ ఉండగా టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గోడి ఓబులరెడ్డి ఉన్నారు.



అనుచరులతో టీడీపీలో చేరిన నల్లగుంట్ల ఎంపీటీసీ సభ్యుడు

అన్న కోసం చెల్లెలు ప్రచారం

గిద్దలూరు : టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం కోసం ఆయన సోదరి గీత రాచర్ల మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాచర్ల ఫారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ మానిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరిస్తూ మేనిఫెస్టో ప్రతులను అందజేశారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

బేస్తవారపేట : టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం చెట్టిచెర్ల గ్రామంలోని ఆయన నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనతో ప్రజలు విసుకుచెందారని ఆ నాయకుల దాడులను తట్టుకోలేక రాష్ట్రంలో ఎంతో మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోన్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, మన భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడి ఉందని, టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు.

ముగిసిన ఉగాది వసంత నవరాత్రులు

త్రిపురాంతకం, ఏప్రిల్ 18: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో నిర్వహిస్తున్న ఉగాది వసంత నవరాత్రులు గురువారం ముగిశాయి. ఈ నెల 9 నుండి నవరాత్రులు నిర్వహిస్తుండగా గురువారం గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, మండపారాధన, గోపూజ, సప్తశతి పారాయణం, కలశ పూజ, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు నాగఫణిశాస్త్రి, ఫణీంద్ర కుమార్‌శర్మ, ఆలయాల ప్రధాన అర్చకులు ప్రసాదశర్మ, విశ్వన్నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో బలిహరణ పూజలు, వసంతోత్సవం, సంప్రోక్షణ అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటి సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



శ్రీరామునికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

వేడుకగా శ్రీరాముని పట్టాభిషేకం

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక ప్రసన్న రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం వేడుకగా శ్రీరామ పట్టాభిషేకం శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు.

అవీ..ఇవీ..

బలప్రదర్శన పోటీల్లో కడప జిల్లా ఎడ్ల సత్తా



బండను లాగుతున్న ఎడ్లజత

కంభం, ఏప్రిల్ 18 : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కంభం మండలం లింగోజీపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో కడప జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన ఎం.చిన్నవీరన్నయాదవ్ ఎడ్ల జత 5024 అడుగుల దూరం బండను లాగి రూ.40వేలు ప్రథమ బహుమతి సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. గుంటూరు జిల్లా కోటయ్య మెమోరియల్స్ ఎడ్లు జత 4554 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానం రూ.30వేలు గెలుచుకొంది. కడప జిల్లా దువ్వూరు మండలం సుదర్శన్ ఎడ్లు, రుద్రవరం గ్రామానికి చెందిన షేక్ అల్లాభక్షు ఎడ్లు 4400 సమాన దూరం లాగగా తృతీయ బహుమతి 20వేలు అందజేశారు. కడప జిల్లా కలసపాడు మండలం చెన్నారెడ్డిపల్లెకు చెందిన వై.రంగలక్ష్మమ్మ ఎడ్లు, కంభం మండలం ఔరంగబాద్ గ్రామానికి చెందిన అంబారపు రామోజీ ఎడ్లు 4232 అడుగుల దూరం లాగి నాల్గవ బహుమతి 10వేలు, కడప జిల్లా కలసపాడు మండలానికి చెందిన వెంకటయ్య ఎడ్లు 4173 అడుగుల దూరం బండను లాగి ఐదవ బహుమతి 5వేలు గెలుచుకున్నాయి.

తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు

గిద్దలూరు, ఏప్రిల్ 18 : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. తొలిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ తరపున ఈఎల్‌వీ.సురేష్‌బాబు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి నాగజ్యోతికి అందజేశారు. బేస్తవారపేట మండలం కోనపల్లి గ్రామానికి చెందిన సురేష్‌బాబు ప్రస్తుతం కడప జిల్లా పొద్దుటూరులో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నారు.

నేడు ఎరిక్షన్‌బాబు నామినేషన్



పుల్లలచెరువు, ఏప్రిల్ 18: వై.పాలెం టీడీపీ కూటమి అభ్యర్థిగా నేడు ఎర్రగొండపాలెంలో గూడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు టీడీపీ కార్యాలయం నుంచి పట్టణంలో భారీ ర్యాలీతో నామినేషన్ చేయనున్నారు. కార్యక్రమానికి ఒంగోలు టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, డాక్టరు మన్నె రవీంద్ర పాల్గొననున్నారు. అనంతరం ఎన్టీఆర్ కూడలిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైపాలెం టీడీపీ కూటమి అభ్యర్థి గుదూరి ఎరిక్షన్‌బాబు ఒక ప్రకటనలో కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కంభం (అర్ధవీడు), ఏప్రిల్ 18 : అర్ధవీడు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న శనివారం మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధవీడు ఎంపీపీ నేదూరి వెంకటరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలోని సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

గిద్దలూరు, ఏప్రిల్ 18 : పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ రాఘవరావు, ధ్యానమండలి అధ్యక్షులు బచ్చు వెంకటేశ్వర్లు, గురువులు సుబ్బారావు, పుల్లయ్య, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్క్రో ద్వారా వేతనాలు చెల్లించాలి

● ప్రభుత్వానికి మీటర్ రీడర్ల వినతి



వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడర్లు

మార్కాపురం వన్‌టౌన్ 18 : విద్యుత్ సంస్థలో ఇరవై ఏళ్లగా పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఎస్క్రో ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య కాశీంలు డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక విద్యుత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 ప్లస్ రెండు పనిదినాలను పెంచాలన్నారు. సీఎండీ ఇచ్చిన మినిట్స్ కాపీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొప్పరాజు నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ భాష, తంగిరాల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ 18 : స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఇంటర్ నేషనల్ టాలెంట్‌సెర్చ్ ఒలంపియాడ్స్ ఆధ్వర్యంలో రెండవ దశలో జరిగిన ప్రతిభ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఏజీఎం అంజయ్య విద్యార్థులను అభినందించి మాట్లాడారు. వివిధ విభాగాల్లో విద్యార్థులు కే.వెంకటసూరిష, వైవీఎస్ దత్తానంద, లక్ష్మీచందన, అశ్విన్, కల్యాణ్, కీర్తన్‌రెడ్డి, కళ్యాణ్ సంజయ్, లోకేష్ రెడ్డి, సాయిశ్రీవాణిరెడ్డి, సోహెల్‌లు బహుమతులు సాధించారని తెలిపారు. వీరిని ఆర్ఐ సురేంద్ర, కో-ఆర్డినేటర్ మల్లికార్జున శ్రీనివాసులు, ఏవో కృష్ణారెడ్డిలు అభినందించారు.

22 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కంభం, ఏప్రిల్ 18 : కంభం కాపు వీధిలో పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 22 నుంచి మే 2వ తేదీ వరకు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలియజేసింది. 22వ తేదీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, పుష్పయాగం, 23న ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనం, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, 24న రాత్రి 7 గంటలకు సింహవాహనం, 25న రాత్రి 7 గంటలకు శేషవాహనంపై, 26న రాత్రి 7గంటలకు కల్పవృక్ష వాహనంపై, 27న రాత్రి 7 గంటలకు హనుమంత వాహనంపై, 28వ తేది ఆదివారం రాత్రి 7గంటలకు గరువ వాహనంపై, 29వ తేది సోమవారం రాత్రి 7గంటలకు గజవాహనంపై, 30న మంగళవారం రాత్రి 6గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 1న బుధవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం, రాత్రి 7గంటలకు అశ్వవాహనంపై ఊరేగింపు, 2వ తేది గురువారం ఉదయం 6గంటలకు చక్రస్నానం, ఉదయం 8గంటలకు వసంతోత్సవం, రాత్రి 7గంటలకు ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

దర్శిలో ఆరు నామినేషన్లు దాఖలు

దర్శి, ఏప్రిల్ 18: దర్శి అసెంబ్లీకి గురువారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన సతీమణి నందిని మరో రెండుసెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అనుచరులతో ర్యాలీగా వచ్చి నామినేషన్లు వేశారు. అంతకుముందు కాంగ్రెస్ అభ్యర్థి పి.కొండారెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా మంచా మీనా నామినేషన్‌లు దాఖలు చేశారు. మొత్తం నలుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనిగిరిలో ఒక నామినేషన్..

కనిగిరి, ఏప్రిల్ 18: ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. తొలి రోజు కనిగిరిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈమేరకు స్థానిక రిటర్నింగ్ ఆఫీసర్ జాన్‌ఇర్విన్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

టీడీపీతోనే అభివృద్ధి

పామూరు, ఏప్రిల్ 18: వైసీపీ పాలనలో అభివృద్ధి లేక వెనుకబడిన కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి టీడీపీ తోనే సాధ్యమవుతుందని ముదిరాజుల సంఘం నాయకుడు, పామూరు మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య తెలిపారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉగ్రనరసింహారెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం మండలంలోని మాలకొండాపురం, తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో చేకూరే లబ్ధి గురించి వివరిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో కొంగల ప్రసాద్, ఈర్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

భానుడు ప్రతాపం



దొనకొండలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

దొనకొండ, ఏప్రిల్ 18: రోజురోజుకు భానుడు ప్రతాపం చూపుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఉక్కపోతతో తల్లడిల్లుతున్నారు. ఎండలకు బయటకు అడుగుపెట్టలేకపోతున్నారు. మధ్యాహ్నం వేళల్లో భగభగ మండుతున్న ఎండల్ని చూసి ప్రజలు ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో సాయంత్రం 5 గంటల వరకు దొనకొండలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి నిర్మానుష్యంగా దర్శనమిస్తుంది. అత్యవసరంగా ప్రయాణం చేస్తున్నవారు ఎండతీవ్రతకు అల్లాడిపోతున్నారు. మే నెలలో ఇంకెంత వేడిమి భరించాల్సి ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం

పామూరు, ఏప్రిల్ 18: టీడీపీ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని అంకాలమ్మవీధి, ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీతో చేకూరే ప్రయోజనాల గురించి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్ బాబు, ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఆర్ రఫి, బి.నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ర్యాలీలో పాల్గొన్న వలంటీర్



వైసీపీ ర్యాలీలో పాల్గొన్న వలంటీర్ రాజారెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 18: ఎన్నికల కార్యక్రమాల్లో వలంటీర్‌లు పాల్గొనవద్దని ఎన్నికల సంఘంఆదేశించినా కొందరు పెడచెవిన పెడుతున్నారు. వైసీపీ నేతల అండదండలు ఉన్నందున తమకేమి కాదన్న ధీమాతో ముందుకు సాగుతున్నారు. ఈక్రమంలో గురువారం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా బొద్దికూరపాడుకు చెందిన వలంటీర్ కె.రాజారెడ్డి గ్రామ వైసీపీ నేతలు నిర్వహించిన ర్యాలీ పాల్గొని దర్శికి వెళ్లారు.

సమస్యాత్మక గ్రామాలో పోలీసుల కవాతు

తాళ్లూరు, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్ని కల్లో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వకుండా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఎస్పీ గరు డ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు స మస్యాత్మక గ్రామాల్లో గురువారం పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. మండలంలోని సోమవరప్పాడు, దారంవారిపాలెం, శివరాంపురం, లక్క వరం, బొద్దికూరపాడు గ్రామాల్లో వీధుల్లో తిరుగుతూ ప్రజలకు రక్షణగా ఉంటామని భరోసా ఇస్తూ కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై వైపీ రమణయ్య, ఏఎస్సై మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

పీసీపల్లి, ఏప్రిల్ 18: టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య అన్నారు. గురువారం రాత్రి మండలంలోని వేపగుంపల్లి, ముద్దపాడు, మారెళ్ల గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా బాలసుబ్బయ్య మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిని విస్మరించారని అన్నారు. కార్యక్రమంలో వీరపనేని పెద్దన్న, పువ్వాడి నాగరాజు, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మూలె బ్రహ్మారెడ్డి, నెలకుర్తి మాల్యాద్రి, గడ్డం విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో దొనకొండ వాసి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 18: తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టిపల్లి గ్రామశివారులో కాకతీయ కాల్వ వద్ద బుధవారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గురువారం లభ్యమైంది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమనపల్లికి చెందిన మురికిపూడి చెన్నయ్య (36) అనే వ్యక్తి మేస్త్రీ పనినిమిత్తం శ్రీను అనే కాంట్రాక్టర్ వద్దకు కరీంనగర్ వచ్చాడు. మద్యానికి బానిసైన చెన్నయ్య ఈ నెల 14నుంచి పనికి వెళ్లలేదు. బుధవారం మండలంలోని కాకతీయ కాల్వ వద్ద స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

గురువారం చెన్నయ్య కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చెన్నయ్య వడదెబ్బతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

రాక్షసపాలనకు చరమగీతం పాడాలి



వైసీపీ వీడి జనసేలో చేరిన వారితో కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, జనసేన రాష్ట్ర అధికారప్రతినిధి రాయపాటి అరుణ, మాజీ ఎమ్మెల్యే పాపారావు

- కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- 500 కుటుంబాలు జనసేనలో చేరిక

తాళ్లూరు, ఏప్రిల్ 18: రాష్ట్రంలో రాక్షసపాలనకు చరమగీతం పాడాలని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలో పలుగ్రామాలకు చెందిన 500 కాపు సామాజిక కుటుంబాలు వైసీపీని వీడి జనసేనలో చేరారు. జనసేన అధికార ప్రతినిధి రాయపాటిఅరుణ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిల సమక్షంలో గురువారం సాయంత్రం గుంటిగంగలోని కాపు సత్రంలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

మండలంలోని వైసీపీలో ఉన్న కాపు సామాజిక వర్గం పెద్దలు రోజుల క్రితం గుంటిగంగ వద్ద సమావేశమయ్యారు. ఈపర్యాయం కాపులమంతా ఐకమత్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. ఈమేరకు మండలంలోని పలుగ్రామాలకు చెందిన 500 కాపు సామాజిక కుటుంబాలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని తమ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా అభ్యర్థి డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను సాగనంపేందుకు కాపు సామాజికవర్గ శ్రేణులు వైసీపీని వీడి జనసేనలో చేరి కూటమ అభ్యర్థులకు మద్దతు తెలపడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగరపంచాయతీ చైర్మన్ పిచ్చయ్య మండల కాపునేతలు మారిశెట్టి హనుమంతరావు, గాజుల కోటేశ్వరరావు, చిరంజీవి, కూటాల ప్రసాద్, వీరమహిళ మారాబత్తుల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు అభివృద్ధికి పాటుపడతా!



కురిచేడులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, ఏప్రిల్ 18: కురిచేడు అభివృద్ధికి కృషిచేస్తానని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం కురిచేడు గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా దర్శి రోడ్డులోని బ్రహ్మంగారి దేవాలయం, అయ్యప్పస్వామి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. నుసుం బజారులో మాజీ సొసైటీ అధ్యక్షుడు కమతం నాగిరెడ్డి భార్య రమాదేవి గుమ్మడికాయతో దిష్టితీసి ప్రచారాన్ని ప్రారంభింపచేశారు. అక్కడినుంచి వాసవి ఆలయం వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వాసవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన కూడలిలో ప్రజలతో మాట్లాడారు.

కురిచేడు మండలానికి శాశ్వత మంచినీటి పథకం తెచ్చే బాధ్యత తనదేనని లక్ష్మి చెప్పారు. మీ ఇంటి ఆడపడచుగా ఆదరిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. దర్శిని వీడివెళ్ళేది లేదని, ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం వినుకొండ రోడ్డులో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలకు దగ్గరగా తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ మండల అధ్యక్షుడు నెమిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 20 కుటుంబాలు.. కురిచేడు, ఏప్రిల్ 18: కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ ప్రతిజ్ఞాపురి కాలనీకి చెందిన 20 కుటుంబాలు గురువారం కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్ సాగర్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కిలారి కొండయ్య, పిడతల నెమిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీని అభివృద్ధి చేస్తాం!

- కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- వైసీపీని వీడి ఎంపీటీసీ, 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

వెలిగండ్ల, ఏప్రిల్ 18: టీడీపీ అధికారంలోకి రాగానే నియోజవర్గంలోని ప్రతి పంచాయతీ అభివృద్ధి బాధ్యత నాదని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని హుస్సేన్‌పురం పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు, ఎంపీటీసీ దెవిరెడ్డి జనార్దన్‌రెడ్డి వైసీపీని వీడి గురువారం డా.ఉగ్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు

ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ పద్మాపురం, హుస్సేన్‌పురం బల్లవరం గ్రామాలకు టీడీపీ అధికారంలోకి రాగానే ముందుగా రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో వెలిగండ్ల మండలం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో శ్యామల కాశీరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, గవదకట్ల హరి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన తూర్పుకోడిగుడ్లపాడు సర్పంచ్

పామూరు, ఏప్రిల్ 18: మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు సర్పంచ్ దారపనేని కొండబాబు, అతని తండ్రి మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తూర్పుకోడిగుడ్లపాడులోని సర్పంచ్ నివాసంలో గురువారం కూటమి అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి చర్చలు జరిపారు. పార్టీలో చేరిన వారందరికి సముచిత స్థానం ఉంటుందని, సార్వత్రిక ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఉగ్ర ఇచ్చిన భరోసాతో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు కొండబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా కొండబాబు, రాజేశ్వరరావుతో పాటు 28 కుటుంబాలవారికి ఉగ్ర పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు నరసింహారావు, తిరివీధి వెంకటస్వామి, అద్దంకి నాగేశ్వరరావుతో పాటు 28 కుటుంబాలు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, పువ్వాడి వెంకటేశ్వర్లు, గ్రామ అధ్యక్షుడు దారపనేని మాదవరావు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, యారవ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పామూరు:: సర్పంచ్ కొండబాబు మెడలో టీడీపీ కండువా వేస్తున్న ఉగ్ర

టీడీపీ హయాంలోనే మాదిగలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజుమాదిగ

దర్శి, ఏప్రిల్ 18: టీడీపీ హయాంలోనే మాదిగలకు న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజుమాదిగ తెలిపారు. ఎన్డీఏ కూటమి విజయాన్ని ఆకాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల హక్కుల పరిరక్షణకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కట్టుబడి ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పడిన తరువాత ఎస్సీ వర్గీకరణ ప్రవేశపెడతామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మాదిగల అభ్యున్నతి కోసం కట్టుబడి ఉన్న కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. దర్శి అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థులు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు టి.ఆనంద మాదిగ, జిల్లా కార్యదర్శి బి.వెంకట్రావు మాదిగ, గోళ్లపాటి మార్కు, యోగయ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

200 మంది టీడీపీలో చేరిక

దర్శి, ఏప్రిల్ 18: కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు, 200 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. దర్శి పట్టణంలోని సందువారిపాలెంలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలితసాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు సమక్షంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కర్నా శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు గోపు యర్రయ్య, సందు ఏడుకొండలు, సందు పెద్దన్న, ఉప్పు పిచ్చయ్యతో పాటు 200 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సందువారిపాలెంలోని సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాడగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పామూరును వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

- విస్తరణకు నోచుకోని రహదారులు
- మార్జిన్‌ల ఆక్రమణ
- అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత
- నరకప్రాయంగా ప్రయాణం

పామూరు, ఏప్రిల్ 18: పామూరు పట్టణాన్ని ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు వసతుల కల్పనలేదు. దశాబ్దాలుగా రహదారుల విస్తరణ చేపట్టలేదు. పట్టణం విస్తీర్ణం పెరుగుతున్నది. ఇరుకుగా మారిన దారులు.. ఆపై ఇష్టాసారంగా ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకొనేవారేలేరు. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో దుకాణాల ముందు, నడిరోడ్డుపైనే అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతిరోజు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పామూరుకు వస్తుంటారు. పట్టణంలో ముఖ్యంగా మమ్మిడాడి సెంటర్, సీఎస్‌పురం బస్టాండ్ సెంటర్, పూలకొట్ల సెంటర్ ప్రాంతాల్లో నిత్యం విపరీతమైన రద్దీ ఉంటుంది. ఒక్కోసారి గంటలకొద్దీ వాహనాలు స్తంభించిపోతున్నాయి. కొంతమంది దుకాణాదారులు రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి అద్దెలకు ఇస్తున్నారు. దీంతో రోడ్లు కుంచించుకుపోతున్నాయి. పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పట్టణంలోని మమ్మిడాడి సెంటర్‌లో దిచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. ఒకవైపు విస్తరణకు నోచుకొని రహదారులు, మరోవైపు బహుళ అంతస్తుల దుకాణ ల సముదాయానికి తగ్గ పార్కింగ్ లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉదయం, సాయంత్రం పూట ముఖ్య కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తద్వార ట్రాఫిక్ క్రమబద్ధీకరణ జరుగుతుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పూలకొట్ల వద్ద నిలిచిపోయిన వాహనాలు



మమ్మీ డాడీ సెంటర్‌లో అడ్డదిడ్డంగా వాహనాలు

వైసీపీ అభ్యర్థి ‘దద్దాల’పై పలు కేసులు

- తొలి నామినేషన్‌లో ఇవి ఉన్నట్టు ఆధారాలు

కనిగిరి, ఏప్రిల్ 18: కనిగిరిలో నామినేషన్‌ల ప్రక్రియ గురువారంతో ప్రారంభమైంది. తొలి రోజు ఒకే నామినేషన్ దాఖలైంది. వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ తొలి నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాల్లో పొందుపరచిన ఆధారాల్లో ఆయనపై కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో 2022లో సీఆర్ 17 ఎఫ్‌ఐఆర్ నమోదు కాగా, సీసీ నెంబర్ 219/2022 కింద సెక్షన్ 420 (ఛీటింగ్) సెక్షన్ 506 (బెదిరించటం) కింద చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులు రుజువైతే ఏడేళ్ళు ఆరు నెలలు శిక్ష పడే అవకాశం ఉందని న్యాయవాదులు చెప్తున్నారు. అదేవిధంగా సీఆర్ నెం 23/2022లో మరో కేసులో సెక్షన్ 341 (ఆస్తులకు సంబందించిన వ్యక్తులను వారి ఆస్తుల్లోకి వెళ్ళకుండా అడ్డగించటం) ఈ సెక్షన్‌కు మూడేళ్ళ శిక్ష పడే అవకాశం ఉంది. ఈకేసులో సెక్షన్ 447 (వేరొకరి ఆస్తులలోకి దౌర్జన్యంగా చొరబడటం), సెక్షన్ 427, 506 కింద కేసు చార్జ్‌షీట్ దాఖలైంది. మరో కేసులో సీఆర్ నెం 51/2022లో సెక్షన్ 341, 353, 506, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదైంది. ఈ కేసుపై చార్జ్ షీట్ ఇంకా ఫైల్ కాలేదు.

తూర్పుగంగవరంలో టీడీపీని వీడారనటంలో వాస్తవంలేదు!

తాళ్లూరు, ఏప్రిల్ 18: తూర్పుగంగవరం గ్రామంలో 30కుటుంబాలు టీడీపీని వీడారనటంలో వాస్తలేదని ఆగ్రామ టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య గురువారం తెలిపారు. తమ పార్టీనుంచి ఒకేఒక కుటుంబం మాత్రమే వైసీపీలో చేరారని పేర్కొన్నారు. మిగిలిన వారంతా వైసీపీ వార్డు సభ్యులు, మద్దతుదారులు, సానుభూతి పరులేనని చెప్పారు. వైసీపీకి చెందిన వారికే ఆపార్టీ కండువాలు కప్పి టీడీపీ నుంచి 30 కుటుంబాలు వీడారని చెప్పటం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని చెప్పారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

దర్శి, ఏప్రిల్ 18: మండలంలోని రాజంపల్లి పంచాయతీ ముసినదితీరాన నెలకొన్న శ్రీసువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల గురువారం అత్యంత వైభంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామి వారికి అభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు పెట్టి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం రాత్రి పౌరాణిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు



నామినేషన్ల సందర్భంగా కార్యాలయ ఆవరణ పరిసరాలను పరిశీలిస్తున్న దర్శి ఈఆర్వో లోకేశ్వరరావు, సీఐ షమీముల్లా తదితరులు

దర్శి, ఏప్రిల్ 18: నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లుచేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు చెప్పారు. గురువారం నామినేషన్ల దాఖలు కార్యక్రమం ప్రారంభమైంది. ఈనేపథ్యంలో ఆయన ఈఆర్వో కార్యాలయ పరిసరాలను పోలీసు అధికారులతో పరిశీలించారు. లోకేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నడుచుకోవాలని సూచించారు. నామినేషన్ల సందర్భంగా కార్యాలయంలోకి అభ్యర్థి, మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కార్యక్రమంలో సీఐ షేక్ షమీముల్లా, ఎస్సై సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించం

కనిగిరి, ఏప్రిల్ 18: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేదిలేదని డీఎస్పీ రామరాజు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభమైన ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు.. ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. ట్రాఫిక్ మళ్ళింపు ప్రక్రియలో భాగంగా కందుకూరు రోడ్డులోని కనిగిరి శివారు నుంచి పామూరు రోడ్డులోకి, పామూరు రోడ్డు నుంచి పొదిలి రోడ్డు చెక్‌పోస్టు వైపుకు వాహన రాకపోకలను మళ్ళించినట్లు తెలిపారు. అత్యవసర విభాగానికి చెందిన వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు.



కనిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద విధులు నిర్వర్తిస్తున్న డీఎస్పీ, ఎస్ఐలు





దేవుళ్లకూ.. నైవేద్యం


పెనుమాక చెన్నకేశవస్వామి ఆలయం

- ఆలయాలను కరుణించని సీఆర్‌డీఏ
- కౌలు జాప్యంతో నిర్వహణ అస్తవ్యస్తం
- పస్తులుంటున్న పూజారుల కుటుంబాలు
- కౌలుతోనే మనుగడ.. పట్టించుకోని ప్రభుత్వం
- వచ్చే జూన్‌కు ఆలయాలకు కౌలు రాక రెండేళ్లు

మంగళగిరి, ఏప్రిల్ 18: రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులే కాదు.. భూములిచ్చిన పాపానికి దేవుళ్లను కూడా వైసీపీ ప్రభుత్వం శిక్షిస్తుంది. రాజధానికి భూములిచ్చిన రైతులు సకాలంలో కౌలు అందక అల్లాడుతున్నారు. కౌలు అందక అమరావతి ప్రాంతంలోని చిన్నాచితకా దేవాలయాల తాలూకు దేవుళ్లు కూడా రోజువారీ నైవేద్యానికి నోచుకోలేకపోతున్నారు. ఇక ఆ దేవాయాలపైనే ఆధారపడి జీవిస్తున్న పూజారులు కూడా జీవనానికి అల్లాడిపోతున్నారు. రాజధాని భూముల

2019 నుంచి చెల్లింపులకు బ్రేకులు

టీడీపీ హయాంలో 2016 నుంచి వరుసగా మూడేళ్లపాటు ఈ కౌలు ఆదాయాలు నిర్ణీతకాలానికి సంబంధిత రైతులు లేదా ఆలయాల తాలూకు దేవదాయశాఖ ఖాతాలకు జమవుతూ వచ్చినప్పటికీ 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కౌలు చెల్లింపులకు బ్రేకులు పడుతూ వచ్చాయి. దీంతో రైతులు ప్రతి ఏటా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి కౌలు కోసం సీఆర్‌డీఏపై ఒత్తిడి తేవాల్సివస్తుంది. అయితే గత ఏడాది తాలూకు కౌలు ఆదాయాలు ఇంతవరకు ఆలయాల తాలూకు ఖాతాలకు జమ కాలేదు. దీంతో రాజధాని ప్రాంతంలోని ఆలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి పుష్కలంగా ఆదాయం ఉండడంతో కౌలు ఆలస్యమైనా ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ చిన్నచిన్న ఆలయాలకు ఇతరాత్ర ఆస్తులు, ఆదాయ వనరులు లేని ఆలయాల పరిస్థితి, అక్కడ పని చేసే అర్చకుల పరిస్థితి దారుణంగా ఉంది. పండుగలు, ఉత్సవాల సంగతెలా ఉన్నా.. ఆయా దేవుళ్లకు రోజువారీ నైవేద్యానికి కూడా ఇబ్బందులు పడాల్సివస్తుందని పూజారులు వాపోతున్నారు. నైవేద్యంతో పాటుగా ఆలయాల పూజారుల జీతాలు ఆలయాల నిర్వహణ చూసే దేవదాయశాఖ సిబ్బంది జీతాలు సైతం నెలలతరబడినిలిచిపోయాయి. దీంతో పూజారులు, దేవదాయశాఖ సిబ్బందితోపాటు దేవుళ్ల సైతం సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలుకోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందైనా ప్రభుత్వం తమపై కరుణచూపి కౌలు విడుదల చేయకపోతుందా అంటూ రాజధాని ప్రాంత రైతులతో పాటు దేవుళ్ల కూడా ఆశిస్తున్నారు.

కు ఇవ్వాల్సిన కౌలు సొమ్ములను ఏపీ సీఆర్‌డీఏ చెల్లించకుండా తాత్సారం చేస్తున్నది. కౌలు సొమ్ములపైనే ఆధారపడి కొనసాగుతున్న రాజధాని అమరావతిలోని ఆలయాల మనుగడ కష్టంగా మారింది. రేపు జూన్ నాటికి సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలు రెండేళ్లకు చేరుతుంది.

దేవుడి భూములు 1100 ఎకరాలు


జీతాలు అందక ఆస్పత్రిలో చేరిన పెనుమాక చెన్నకేశవ స్వామి ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు

ప్రస్తుత రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో తొంభైతొమ్మిది శాతం ఆలయాలు దాతలు దానంగా రాసిచ్చిన మాన్యాలపైనే ఆధారపడి కొనసాగేవి. అయితే ఈ గ్రామాల్లోని రైతులతో పాటు ఆలయాల కింద ఉన్న సుమారు 1100 ఎకరాల దేవుడి మాన్యాలను కూడా దేవదాయశాఖ భూసమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇచ్చేసింది. ఇందులో ఒక్క మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం తాలూకు భూములే 88 ఎకరాల వరకు ఉన్నాయి. మందడం గ్రూపులోని 30 ఆలయాల కింద ఉన్న 431.17 ఎకరాలను భూసమీకరణలో భాగంగా సీఆర్‌డీఏకి ఇచ్చారు. పెనుమాకలోని చెన్నకేశవస్వామి దేవస్థానం 12.41 ఎకరాలు సీఆర్‌డీఏకి ఇచ్చింది. మంగళగిరి దేవస్థానాల కింద 32 ఎకరాలు, కాజ గ్రూపు దేవస్థానాల కింద 47 ఎకరాలు ఇచ్చారు. మిగతా ఆలయాల విషయానికొస్తే నాలుగైదు ఎకరాల వంతున ఉంటాయి. ఈ భూములకు కౌలు కింద ఏటా సాధారణ భూములకు రూ.30 వేలు, జరీబు భూములైతే రూ.50 వేల వంతున చెల్లిస్తున్నారు. ఈ కౌలును ఏటా పదిశాతం వంతున హెచ్చించి చెల్లించేలా సీఆర్‌డీఏ ఒప్పందాలు చేసుకుంది.

విలీనం.. వంచన



ఆశ.. నిరాశ

తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్లుగా ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది కార్మికుల కల. ప్రభుత్వంలో విలీనమైతే తమకున్న కష్టాలన్నీ తీరిపోతాయని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ప్రయోజనాలు అందుతాయని ఆశ పడ్డారు. అందుకోసం విలీనం చేయాలని ఉద్యమాలు కూడా చేశారు. అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ వైసీపీ పాలకుల నిర్ణయంతో ఉద్యోగులంతా సంబరాలు చేసుకున్నారు. ఆ సంబరాలు, వారి ఆనందం ఎంతోకాలం నిలవలేదు. విలీనం కోరుకుని ఎంత పెద్ద తప్పు చేశారో తెలియడానికి వారికి అట్టే సమయం పట్టలేదు. విలీనం వల్ల తమకు వీసమెత్తు ప్రయోజనం కలగకపోగా, అప్పటికే ఉన్న అన్ని ప్రయోజనాలు కోల్పోయారు.

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు కోరినట్లుగా ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రకటించారు. దీంతో ఆర్టీసీ కార్మికులు జగన్‌కు క్షీరాభిషేకాలు చేశారు. విలీనంతో తమ జీవితాలు బాగవుతాయని ఆర్టీసీ కార్మికులు భావించారు. అయితే విలీనం పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని తొలుత వారు భావించలేదు. రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వం విలీనం చేయడం వెనుక కంటికి కనపడని వంచన ఉందని ఉద్యోగులు లేటుగా తెలుసుకున్నారు. విలీనమైన తర్వాత ఒక్కో ప్రయోజనం కోల్పోవాల్సి వచ్చింది. ఒక పీఆర్సీని కోల్పోవడమే కాకుండా, పాత జీతాలతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. దానికి తోడు అప్పటి వరకూ వారికి వర్తించిన కార్మిక చట్టాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు, సంక్షేమ పథకాలు అన్నీ రద్దయిపోయాయి. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వేతన సవరణ (పీఆర్సీ) అమలు జరుగుతుంది. 2017లో వారికి వేతన సవరణ జరగ్గా 2020-21లో మరోమారు సవరణ జరగాలి. అయితే విలీనంతో ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు కాబట్టి వారికి ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అమలవుతుందని చెప్పి ఆర్టీసీలో జరగాల్సిన పీఆర్సీని ఎగవేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అనగానే 19 శాతం తక్కువగా ఉన్న తమ వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెరుగుతాయని ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం వారికి టోకరా ఇచ్చింది. ఉద్యోగులకు ఆర్టీసీలోని ఉద్యోగ హోదాతో సమానంగా ప్రభుత్వ ఉద్యోగుల పే స్కేలు ఇవ్వకుండా, వారికన్నా తక్కువ హోదాలో ఉండి వారితో సమానంగా వేతనం పొందే ఉద్యోగుల పే స్కేలుతో సమానం చేసింది. దీంతో తక్కువ హోదా వున్న ఉద్యోగుల జీతాలతో వారు సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2019 నాటి వేతనాలతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

పేరుకే ఉద్యోగులు.. సెలవులు లేవు

ఆర్టీసీ ఉద్యోగులను పేరుకే ఉద్యోగులుగా చెబుతున్న ప్రభుత్వం వారిని విధుల్లో మాత్రం కార్మికులుగానే చూస్తోంది. వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సెలవులు ఇవ్వకుండా కంపెనీల చట్టం కింద వారికి ఐదు సెలవులే వర్తిస్తాయని సెలవులు ఎగ్గొట్టారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు అయ్యారనే నెపంతో కార్మిక చట్టాలు, సమ్మె హక్కులు వర్తించవంటూ కార్మికుల హక్కులను కాజేశారు. దీంతో వారు తమ సమస్యలపై ఆందోళన చేసే హక్కును కూడా కోల్పోవాల్సి వచ్చింది.

ఆర్టీసీ కార్మికులు.. విలీనంతో ఉద్యోగులయ్యారు. ప్రభుత్వంలో విలీనమైతే ఎంతో మేలు జరుగుతుంది.. తమ జీవితాలు బాగుపడతాయి.. ఆర్టీసీ కార్మికులుగా అనుభవించిన కష్టాలన్నీ దూరమవుతాయని భావించారు. అయితే మేలు కంటే కష్టాలు.. నష్టాలు ఎక్కువగా ఉండటంతో విలీనం పేరుతో తమను ప్రభుత్వం వంచించిందని వాపోతున్నారు. విలీనంతో గతంలో ఆర్టీసీ కార్మికులుగా దక్కించుకున్న కార్మిక చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలన్నింటినీ కోల్పోయారు. సరే జీతాలన్నా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉంటున్నాయా అంటే అదీ లేదు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలోకి పడిన చందంగా మారింది. కార్మికులు తల చింది ఒకటికాగా విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసింది మరొకటి. దీంతో ఉద్యోగులుగా మారిన కార్మికులు విలవిలలాడిపోతున్నారు. విలీనం పేరుతో ప్రభుత్వం ఆడిన నాటకంలో తాము బలిపశువులుగా మారిపోయామని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు.

మేలు కంటే కష్టాలే అధికం

- హక్కులు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు
- పెనం మీద నుంచి పొయ్యిలోకి ఉద్యోగులు
- గత ప్రయోజనాలతో పాటు ఓ పీఆర్సీ నష్టం
- కార్పొరేషన్లో ఉన్న హక్కులు, స్కీములన్నీ రద్దు
- హెల్త్ స్కీము రద్దుతో తీవ్ర ఇబ్బందుల్లో కార్మికులు
- పాత జీతాలతోనే పీఆర్సీ కలరింగ్.. నేటికీ వేతన వ్యత్యాసం

పాత స్కీములన్నీ రద్దు..

ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగులకు హెల్త్ స్కీము అమలు జరిగేది. ఈ స్కీము కింద ఎంత తీవ్రమైన అనారోగ్యం వచ్చినా ఉద్యోగులకు ఉచితంగా వైద్యం లభించేంది. దాదాపు 30 లక్షల రూపాయల వరకూ విలువైన వైద్యం కూడా ఉద్యోగులు పొందిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఉద్యోగులు ప్రతి నెలా రూ.225 చెల్లించి ఈహెచ్ఎస్ కార్డు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. వైద్య పరీక్షలన్నీ సొంతంగానే చేయించుకోవాల్సి వస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎస్సార్బీసీ కింద ప్రతి నెలా ఉద్యోగుల రూ.300 పొదుపు చేసుకుని దాని ద్వారా పిల్లల చదువులకు రుణాలు తీసుకునేవారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ కల్పించేవారు. ఇప్పుడు ఈ పథకాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో విశ్రాంత ఉద్యోగులకు గతంలో వచ్చే పెన్షన్ కూడా దక్కకుండా పోయింది. విరమణ అనంతరం వారు ఒట్టి చేతులతోనే ఇళ్లకు పోవాల్సిన దుస్థితి నెలకొంది.



ఆందోళనలో ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పీఆర్సీ ఉంటుంది. విలీనంతో ఈ పీఆర్సీ ఐదేళ్లకు పెరిగింది. పదేళ్లకు మారే అవకాశం ఉందని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే డీఏ 8 శాతం వీరికి తక్కువగా ఉంది. ప్రభుత్వ వంచనతో ఉద్యోగులు అది కూడా కోల్పోయామని వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2018 జనవరి 1 నుంచి వేతన స్కేలు అమలు చేయగా, ఆర్టీసీ ఉద్యోగులకు 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. ఈ మధ్యకాలంలో కార్మికులకు రావాల్సిన డీఏలన్నీ ఇవ్వకుండా ఎగవేసిందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన కారణంగా గృహ అలవెన్స్(హెచ్ఆర్ఏ) 4 శాతం వరకూ తగ్గిందని ఉద్యోగులు వాపోతున్నారు. నగరాల్లో హెచ్ఆర్ఏ 16 నుంచి 12 శాతానికి, గ్రేడ్ 1 మున్సిపాలిటీల్లో 14.5 శాతం నుంచి 12 శాతానికి తగ్గిందని ఆవేదన చెందుతున్నారు. కార్పొరేషన్లో ఉండగా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు వచ్చేవని, పండుగ సమయాల్లో ఐదారు రోజులు ముందు గానే వేతనాలు పడేవని, ఇప్పుడవన్నీ కలగా మారిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వంలో విలీనం కాకుండా ఉంటే 2020-21లో మరో పీఆర్సీ అమలు జరిగేదని, దానివల్ల ఇంతకంటే మెరుగైన వేతనాలు అమలు జరిగేవని చెబుతున్నారు.

ఆర్థికంగా నష్టపోయాం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాం. వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానం కాకపోగా, కార్పొరేషన్ ద్వారా వచ్చే అనేక ప్రయోజనాలు కోల్పోయాం. ఈహెచ్ఎస్ హెల్త్‌కార్డు ఎందుకూ పనికిరావడం లేదు. విలీనం వల్ల ఘోరంగా నష్టపోయాం.

- ఓ కార్మిక సంఘం నేత గుంటూరు

ఆర్‌వో కార్యాలయాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్

బాపట్ల, ఏప్రిల్ 18: జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ 25 వరకు జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయవచ్చని చెప్పారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుసరించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు పనిచేస్తాయన్నారు. జిల్లాలో 1510 పోలింగ్ కేంద్రాలు ఉండగా సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిఘా ఉంచుతామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా 374 ఫిర్యాదులు రాగా 43 నిమిషాల్లోనే పరిష్కరించినట్లు తెలిపారు. హోమ్ ఓటింగ్ కొరకు దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారి ఇంటికెళ్లి దరఖాస్తులను పంపిణీ చేశామని తెలిపారు. 22లోగా ఆయా దరఖాస్తులను ఆర్‌వోలకు అందిస్తే మే నెల 3 నుంచి 10వ తేదీలోగా హోమ్ ఓటింగ్‌కి చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటింటికి ఓటర్ స్లిప్‌లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

జిల్లా పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయా గ్రామాల్లో బీఎస్ఎఫ్ దళాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. పాతనేరస్థులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాల్లో పాల్గొనకుండా వివిధ రాజకీయపార్టీలకు చెందిన 8,819 మందిని బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 137 లైసెన్స్ కలిగిన తుపాకులు ఉండగా వాటిలో 98 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలినవి బ్యాంకింగ్ సెక్యూరిటీ సిబ్బంది వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలు వాహన తనిఖీలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి రూ.3.17 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులన్నీ.. పెండింగే


అడుగు ముందుకు పడని ఫిషింగ్ హార్బర్ నిర్మాణం


ఫైర్ ఆఫీస్ సమీపంలోని రైల్వేగేటు పడటంతో ఆగి ఉన్న వాహన చోదకులు

- జగన్ హామీలకు దిక్కేలేదు
- శంకుస్థాపన దశ దాటని ఫిషింగ్ హార్బర్
- నత్తతో పోటీ పడుతున్న కుందేరు పనులు
- ప్రతిపాదనల్లోనే చీరాల ఆర్‌వోబీ నిర్మాణం

చీరాల, ఏప్రిల్ 18: వైసీపీ పాలనలో చీరాల నియోజకవర్గ పరిధిలో మెగా ప్రాజెక్టులు ఒక్కటి కూడా మొదలు కాలేదు. సుమారు రూ.700 కోట్లకు పైబడి పనులు జరాగాల్సి ఉండగా అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. శంకుస్థాపనతోనే ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని సరిపెట్టగా, కుందేరు పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. చీరాల మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారం రెండో ఎస్.ఎస్ (సమ్మర్ స్టోరేజీ) ట్యాంక్ నిర్మాణం స్థలం పరిశీలనకే పరిమితం అయింది. కోట్లు వెచ్చించి నిర్మించిన హ్యాండ్లూమ్ క్లస్టర్లు, శిక్షణ కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. దశాబ్దాలుగా ఆటోనగర్ ఊరిస్తూనే ఉంది.

- వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఇదిగో అదిగో అంటూ ఊరిస్తున్నారు. గత ఏడాది జగన్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.451 కోట్లతో డీపీఆర్ తయారు చేశారు. టెండర్లు పూర్తయ్యాయి. అందులో కేంద్రం వాటా 70 శాతం, రాష్ట్రం వాటా 30 శాతం. వాడరేవులో నిర్మాణ ప్రదేశ స్థలానికి సంబంధించిన అంశం కొంత కోర్టులో నడుస్తోంది. అది పరిష్కారమైతే పనులు ప్రారంభిస్తామని పాలకులు ఊరిస్తున్నారు.
- చీరాలలోని ఫైర్ ఆఫీస్ సమీపంలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్వోబీ నిర్మాణ హామీ అమలుకు నోచుకోలేదు. తొలుత రూ.63 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం పెరిగిన ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం రివైజ్డ్ బడ్జెట్ రూ.100 కోట్లకు పైబడి ఉంటుందని సమాచారం. కేంద్ర ప్రభుత్వ నిధులు సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ నిధుల కొరతతో అది ఆగిందని కొందరు అంటున్నారు.

- కాలుష్య కాసారానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండే కుందేరు అభివృద్ధికి సుమారు రూ.73 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఆ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. నిధుల కొరతతో ఆ పనులు కుంటుపడుతున్నాయని సమాచారం.

- చీరాలలో చేనేత వృత్తిపై జీవించేవారు ఎక్కువ. మగ్గం పని వారికి ఆధారం. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన క్లస్టర్లు, శిక్షణ కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. దీంతో నేతన్నలకు సరైన శిక్షణ లేక ఎప్పటికప్పుడు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా వినియోగదారులను మెప్పించే రీతిలో వస్త్రోత్పత్తి చేయలేక నష్టపోతున్నారు. దీంతో మగ్గం పనే జీవనాధారంగా ఉన్నవారు మూడు పూటలా తిండికి సంపాదన సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చేనేత పార్కు కోసం కేటాయించిన 50 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు ఆగడం, అప్పట్లో హ్యాండ్లూమ్ ఏడీగా పనిచేసిన సత్యనారాయణరాజు సుమారు రూ.3 కోట్ల మేర చేసిన అవినీతి వెరసి అన్నీ తమకు శాపాలుగా మారాయని వారు వాపోతున్నారు.


క్లస్టర్‌లో నామ్‌కే వాస్తేగా ఏర్పాటు చేసిన మగ్గాలు

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన హామీల్లో కొన్నే పూర్తయ్యాయి. చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలో ఆటోనగర్ పనుల్లో అంతర్గత రోడ్లు వేయడంతో చిన్నపాటి కదలిక వచ్చినా తర్వాత ఆ పనులూ ఆగిపోయాయి.

తొలిరోజు పదకొండు నామినేషన్లు

- అసెంబ్లీకి 9, లోక్‌సభ స్థానాలకు రెండు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ఘట్టానికి తొలిరోజైన గురువారం పదకొండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అసెంబ్లీకి 9, లోక్‌సభ స్థానానికి రెండు నామినేషన్లు ఉన్నాయి. బాపట్ల అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ వేయగా, ఇందులో ఒకరు రెండు సెట్లు దాఖలు చేశారు. వైసీపీ తరపున ఎమ్మెల్యే కోన రఘుపతితో పాటు ఆయన సతీమణి రమాదేవి కూడా నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కటికల శివభాగ్యారావు, దోనేపాటి షాలిని, పిరమిడ్ పార్టీ తరపున దేవరకొండ రాజేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ తరపున గుదె రాజారావు రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. చీరాల, పర్చూరు అసెంబ్లీ స్థానాలకు ఒక్కో నామినేషన్ దాఖలైంది.

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే

12 నెలలుగా వేతనాలు పెండింగ్ • పనులు నిలిపేసిన స్వచ్ఛభారత్ కార్మికులు

రేపల్లె, ఏప్రిల్ 18: గ్రామాల్లో ఎక్కడెక్కడ చెత్త అక్కడే ఉంది. ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోయింది. అపరిశుభ్రతతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్మికులకు 12 నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. దీంతో వారు పారిశుధ్య విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో రోడ్లపైన, ఇళ్లల్లోనూ చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల నియోజకవర్గాల్లో 1800 చెత్త సేకరించే పారిశుధ్య వాహనాలు మూలకు చేరాయి. ఒక్కొక్క వాహనానికి ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు స్వీపర్లు ఉన్నారు. వీరికి మేజర్ పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.10 వేలు, స్వీపర్లకు రూ.6 వేలు, చిన్న పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.8 వేలు, స్వీపర్లకు రూ.6 వేలు ఇవ్వాలి. అయితే కొన్ని నెలలుగా డ్రైవర్లు, స్వీపర్లకు జీతాలు ఇవ్వడంలేదు. దీంతో తాము పనులు చేయలేమంటూ జిల్లా వ్యాప్తంగా కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నారు. ఇంటింటికి రూ.100 చొప్పున పన్ను కట్టించుకుంటున్నా చెత్త తొలగించడంలేదని గ్రామీణులు మండిపడుతున్నారు. గతంలో పంచాయతీలకు స్వచ్ఛభారత్ నిధులు మంజూరయ్యేవని ఆరునెలలుగా నిలిచిపోయాయని కార్యదర్శులు తెలిపారు.


గుళ్ళపల్లిలో మూలనపడిన చెత్త తరలించే వాహనాలు

జన చేతనం

ప్రకాశం జిల్లా వార్తలు

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

మాగుంట సెంటిమెంట్

కొత్తపట్నం మండలం అల్లూరు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం

- అనంతరం మార్కాపురం సెగ్మెంట్లో
- నేడు వైపాలెంలో ఎరిక్షన్‌బాబు నామినేషన్ కార్యక్రమానికి హాజరు



అల్లూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి

కొత్తపట్నం(ఒంగోలు నగరం), ఏప్రిల్ 18 : మాగుంట కుటుంబీకులు రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేసి మొదటిసారి నుంచి వారికి ఒక సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి మొదటిసారి ఎన్నికల్లో ఒంగోలు నుంచి పోటీ చేసి అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న కొత్తపట్నం మండలంలోని అల్లూరులో తొలి ఎన్నికల సభ నిర్వహించి ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి ఆ కుటుంబానికి అల్లూరు గ్రామం ఎన్నికల ప్రచారానికి సెంటిమెంటుగా మారింది. మాగుంట సుబ్బరామిరెడ్డి మరణానంతరం జరిగిన ఉపఎన్నికల్లో పోటీ చేసిన మాగుంట పార్వతమ్మ గాని, ప్రస్తుత ఎంపీ శ్రీనివాసులరెడ్డి గాని పోటీ చేసిన ప్రతిసారీ ఇదే గ్రామంలో మొదట ఎన్నికల సభ నిర్వహించి ప్రచారం ప్రారంభిస్తారు. ఇలా చేయటం వలన విజయం తమ సొంతం అవుతుందని వారికి గట్టి నమ్మకం. ఈ నమ్మకానికి మరింత బలం చేకూర్చుతూ ఎన్నికల్లో పోటీ చేసిన ఎక్కువ సార్లు విజయం సాధించారు. 1991లో ఉప ఎన్నికలతో మొదలైన సెంటిమెంట్‌ను ఇప్పటికీ మాగుంట కుటుంబం కొనసాగిస్తూనే ఉంది. ఏ పార్టీ తరపున పోటీ చేసినా అల్లూరు నుంచే ఆ కుటుంబం ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెడుతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ నుంచి పార్లమెంటుకు పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసులరెడ్డి గురువారం తన నామినేషన్‌ను దాఖలు చేసి అల్లూరు వెళ్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు.

రాజాజీ వీధిలోని సొంతింట్లో నిద్ర కూడా సెంటిమెంటే...

మాగుంట కుటుంబీకులు రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రెండు రకాల సెంటిమెంట్లను తూచ తప్పకుండా పాటిస్తున్నారు. అందులో ఒకటి అల్లూరు గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించటం కాగా, రెండోది నెల్లూరులో వారి సొంత ఇళ్లు ఇంకో సెంటిమెంటు. ఏ ఎన్నికల్లో అయినా ఆ కుటుంబంలోని ఎవరు పోటీ చేయాలన్నా నామినేషన్ వేయబోయే ముందు రోజు రాత్రి నెల్లూరులోని రాజాజీ వీధిలో ఉన్న మాగుంట కుటుంబానికి చెందిన పాత ఇంటిలో నిద్ర చేయటం కూడా వారికి సెంటిమెంటుగా మారింది. తాతాల నాటి నుంచి వస్తున్న ఆ ఇంటిలో నిద్ర చేసి మరుసటి రోజున నామినేషన్ వేస్తే విజయం తమ సొంతం అవుతుందనేనిది కూడా ఆ కుటుంబానికి గట్టి నమ్మకం. ఇదే నమ్మకాన్ని పాటిస్తూ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం రాత్రి నెల్లూరులోని రాజాజీ వీధిలోని తన ఇంటిలో నిద్ర చేసి గురువారం ఒంగోలు వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.

పర్యటన సాగిందిలా...

తొలుత సెంట్‌మెంట్ ప్రకారం ఎంపీ మాగుంట అల్లూరు గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ఒక వీధిలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రత్యేకించి టీడీపీ, జనసేన కార్యకర్తలు మాగుంటకు సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి బయలుదేరి మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని పొదిలి మండలం ఉప్పలపాడులో ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. మాగుంట కుటుంబం సేవా కార్యక్రమాలు, రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు లాంటి నేత సీఎం కావాల్సిన అవసరం వంటి అంశాలను మాగుంట ప్రస్తావించారు. కాగా గురువారం రాత్రి మార్కాపురంలో బస చేసిన మాగుంట శుక్రవారం ఎర్రగొండపాలెంలో అక్కడి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ కార్యక్రమం, ఆ సందర్భంగా నిర్వహించే ర్యాలీ, సభల్లో పాల్గొంటారు. సాయంత్రం మార్కాపురంలో జరిగే టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ఆత్మీయ సమావేశంలోనూ, అలాగే 20వతేదీ మార్కాపురం, తర్లుబాడు మండలాల్లో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. గురువారం ఉదయం ఎంపీ మాగుంట నామినేషన్ కార్యక్రమంలో, పొదిలి మండలంలో ప్రచారంలో ఆయన తనయుడు రాఘవరెడ్డి పాల్గొన్నారు. అలాగే శుక్రవారం కొండపిలో డాక్టర్ స్వామి నామినేషన్ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొననున్నారు.

తలనొప్పులు

అద్దంకి, పర్చూరు, చీరాల్లో వైసీపీ విలవిల

వలసలు.. అలకలు.. తిరుగుబాటులు



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటు వలసలు, అటు అలకలు.. మరో వైపు తిరుగుబాట్ల సమస్యలతో వైసీపీ అభ్యర్థులకు తలబొప్పికడుతోంది. మరోవైపు ప్రచార రంగంలో చొచ్చుకుపోతూ వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్న టీడీపీ అభ్యర్థుల దూకుడుతో అధికార వైసీపీ విలవిలలాడుతోందంటే అతిశయోక్తి కాదు. బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పర్చూరు, అద్దంకి, చీరాల్లో ప్రధానంగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైనా కూడా మూడు నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితులు చక్కబడకపోగా సమస్యలకు పరిష్కారం లభించక ఆ పార్టీ అభ్యర్థులు విలవిలలాడుతున్నారు.

అద్దంకిలో : అద్దంకి నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలుపొందిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను తిరిగి టీడీపీ రంగంలో దింపింది. నియోజక వర్గంలో ఊరూవాడా ప్రజలందరితో అపారమైన పరిచయాలు కల్గిఉండటం ఆయన ప్రత్యేకత. పైగా వైసీపీ ప్రభుత్వం రవికుమార్‌పై కక్ష కట్టి వేధింపులకు గురిచేసింది. ఆర్థిక వనరులను దెబ్బతీసింది. రవికుమార్‌వాటన్నింటినీ ఎదుర్కొని ఈ ఐదేళ్ల కాలంలో ఏనాడు ప్రజలను వీడకుండా ముందడుగు వేశారు. వైసీపీ తరపున నాలుగేళ్లుగా ఇన్‌చార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్యను ఆ పార్టీ కాదు పొమ్మంది. ఆ నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కృష్ణచైతన్య తండ్రి మాజీ ఎమ్మెల్యే గరటయ్యకు ఉన్న పలుకుబడిని కూడా వైసీపీ తోసిపుచ్చింది. కష్టకాలంలో అండగా ఉన్న వారిని కాదనటంతో తండ్రీ కొడుకులు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. అదే సమయంలో వైసీపీ అధిష్ఠానం జిల్లాయేతర వ్యక్తి హనిమిరెడ్డిని రంగంలో పెట్టి మరో తప్పటడుగు వేసింది. ఈ నేపథ్యంలో తిరిగి రవికుమార్ గెలుపు బావుటాగా పయనిస్తున్న తీరు ఆయనపై వ్యక్తిగత సంబంధాలను దృష్టిలో పెట్టుకొని వైసీపీ శ్రేణులు మూకుమ్మడిగా టీడీపీలో చేరటం ప్రారంభించారు. వార్డు, గ్రామ, మండలస్థాయిలో పదవులతో పాటు వైసీపీలో పదవులున్న అనేక మంది టీడీపీలో చేరటం విశేషం. చేరికలు అన్ని సామాజిక వర్గాల నుంచి జరుగుతున్నాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం ఓట్లు దృష్టిలో పెట్టుకొని వైసీపీ హనిమిరెడ్డిని రంగంలో తీసుకు రాగా ఆ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు ముందుగా శ్రీకారం పలకటం విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ వలసల నివారణకు వైసీపీ చేసిన ఎత్తుగడలు ఫలించలేదు. దీంతో దొంగోట్లు చేర్చుకునేందుకు అందునా పక్క జిల్లా వ్యక్తులను అద్దంకి ఓటర్లుగా చేర్చే ప్రయత్నాలు చేశారు. ఎన్నికల నిర్వాహణలో అపారమైన అనుభవంతో పాటు అనునిత్యం పరిస్థితులను సమన్వయం చేసుకునే సమర్థత ఉన్న రవికుమార్ ఆ ప్రయత్నాలకు కొంత బ్రేక్ వేశారు. దీంతో పోలీస్ యంత్రాంగంతో బెదిరింపు ధోరణులకు శ్రీకారం పలికారు. బల్లికురవ ఎస్సై చేసిన కొన్ని దూకుడు చర్యలు, మేదరమెట్లలో చీరాల డీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన దాడులను అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అయినా టీడీపీ కార్యకర్తలు బెదకపోగా చట్టపరమైన చర్యలకు పూనుకున్నారు. ఎన్నికల సమయం కావటంతో స్థానిక పోలీసులకు ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణమైన హెచ్చరికలు జారీ కావటంతో వెనుకడుగు వేయక తప్పలేదు. కలిసిరాని పరిస్థితులతో ఎదురేగుతూ వలసల నివారణకే వైసీపీ అభ్యర్థి నాయకత్వం ప్రాధాన్యత ఇస్తుంది. అందుకు అనుగుణంగా డబ్బే ఆయుధంగా చేసుకొని నివారణకు దిగగా అక్కడ సానుకూలత లభించలేదు. మాటలు కోటలు దాటినా డబ్బులపై పెట్టిన ఆశలు చేతల రూపంలో కనిపించక ఎదురుదాడి ప్రారంభమైంది. దిక్కుతోచని పరిస్థితిలో వైసీపీ అభ్యర్థి కొట్టుమిట్టాడుతుండగా టీడీపీ అభ్యర్థి రవికుమార్ చాపకింద నీరులా ప్రచార రంగంలో దూసుకుపోతున్నారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో కూడా తనకున్న అనుభవాన్ని రంగరించుకొని రవికుమార్ ముందడుగు వేస్తున్నాడు.

చీరాలలో : చీరాలలో ఎమ్మెల్యే బలరాం కుమారుడిని వైసీపీ రంగంలో దించగా ఆ నియోజకవర్గ సామాజిక పరిస్థితులకు అనుగుణంగా టీడీపీ బలహీన వర్గాలకు చెందిన కొండయ్యయాదవ్‌ను రంగంలో దించింది. దీంతో ఆయా సామాజిక వర్గాల ప్రజల ఆలోచన ధోరణి టీడీపీ వైపు మారుతున్న తీరు ప్రస్ఫుటం అవుతోంది. దీనికి తోడు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ పక్షాల రంగంలోకి వచ్చేందుకు సిద్ధమై ప్రచారం ప్రారంభించారు. వైసీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే బలరాంను కట్టడి చేయటమే ఆమంచి వ్యూహంగా కనిపిస్తుంది. ఈ నాలుగేళ్లల్లో ఆయన చేసిన వివిధ రకాల కార్యక్రమాలు, వాక్యాలు ప్రసుత్తం తమ మద్దతుదారులకు చెబుతున్న విషయాలు ఆయన విధానాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. అపారమైన రాజకీయ అనుభవంతో వైసీపీ అభ్యర్థి వెంకటేష్ పక్షాన ప్రచార పర్వం ప్రారంభమైనప్పటికీ ఆమంచి రూపంలో ఎదురవుతున్న సమస్య ఏరూపంలో ఎంతమేరకు దెబ్బ తీస్తుందనేది సమస్యగా మారింది. ఆ ఇద్దరి మధ్య టీడీపీ అభ్యర్థి తెలుగుదేశం కూటమి బలానికి తోడు బలహీన వర్గాల తరఫున సౌమ్యుడిగా ఎలా ముందుకు పోగలనో చెప్పుకుంటూ ప్రచార రంగంలో దూసుకుపోతున్నారు.

ఈ మూడు నియోజకవర్గాల్లో ఉన్న తాజా పరిస్థితులతో వైసీపీ విలవిలలాడుతోంది. పరిస్థితులను సవరించేందుకు కొన్నిచోట్ల వైసీపీకి చెందిన అధినాయకుల జోక్యం చేసుకున్నా సానుకూల మార్పులు కనిపించలేదు. దీంతో రానున్న రోజుల్లో వైసీపీ పరిస్థితి మరింత దిగజారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఏలూరి వ్యూహాత్మక అడుగులతో వైసీపీ బెంబేలు

పర్చూరులో కూడా వరుసగా రెండుసార్లు జయకేతనం ఎగురవేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును తిరిగి టీడీపీ రంగంలో దింపింది. గత ఎన్నికల్లో విజయం సాధించిన ఏలూరికి నియోజకవర్గంలో అణువణువూ ఉన్న పట్టు, పరిచయాలు కలిసివస్తున్నాయి. ఆరంభంలోనే పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలను అధ్యయనం చేసిన ఏలూరి గత 15 ఏళ్లుగా ప్రజాసంబంధాలను వీడకుండా ముందుకు సాగుతున్నారు. పార్టీ అధికారంలో లేకున్నా తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా ముమ్మరంగా వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యకర్త నుంచి సాధారణ ప్రజల వరకు తాను ఇబ్బందుల్లో ఉన్నానని ఎవరు అన్నా నేనున్నానంటూ చేయూతనిచ్చారు. అదే ప్రజాబలంతో ఆయన రంగంలో రాగా వైసీపీ దీటైన అభ్యర్థి కోసం అంటూ గాలింపుతో అనేక ప్రయోగాలు చేసింది. పోటీకి ముందుకు వచ్చిన ఆమంచి పరిస్థితులను గమనించి చివరకు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఎక్కడెక్కడ నుంచో ఆర్థికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి తేవాలని వైసీపీ ప్రయత్నించినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వైసీపీని ఛీకొట్టి జగన్‌ను నమ్మకూడదని ప్రకటించి గత ఎన్నికల్లో వైసీపీకి దూరమైన చీరాలకు చెందిన యడం బాలాజీని రంగంలో దించింది. అందునా ఎక్కడో అమెరికాలో ఉన్న ఆయన్ను హడావుడిగా పిలిపించి పోటీకి పంపారు. అప్పటికే గ్రూపుగా విడిపోయిన వైసీపీ నాయకత్వం అధిష్ఠానం నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోయింది. స్థానిక పరిస్థితులు ఏలూరి రూపంలో ఉన్న బలమైన నాయకత్వం గెలుపు వైపు పయనిస్తున్న టీడీపీని గమనించిన వైసీపీ నేతలు పోలోమని టీడీపీలో చేరటం ప్రారంభించారు. వైసీపీ ఎత్తుగడ విఫలమై కాపు వర్గానికి చెందిన ఆ పార్టీ శ్రేణులు పోటీపడి మరీ టీడీపీలో చేరారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన చిన్నగంజాం మండలంలోని ఆ పార్టీ నాయకత్వం మొత్తం సైకిలెక్కింది. మార్టూరులో ముస్లిం మైనార్టీలు, యద్దనపూడి, పర్చూరులో దళిత సామాజిక వర్గాల వారు, కోనంకి, రాజుపాలెం మొదలుకొని ఇంకొల్లు, కారంచేడు మండలాల్లో బలహీన వర్గాలు, కమ్మసామాజిక వర్గం వారు చిన్నగంజాం మండలంలో బలహీన వర్గాలకు చెందిన దళిత సామాజిక వర్గం వారు ఇలా అన్నీ వర్గాల్లోని ఆ పార్టీ శ్రేణులు టీడీపీలో చేరిపోయారు. వ్యూహాత్మంగా పయనిస్తున్న ఏలూరి పాత, కొత్త వారిని సమన్వయం చేసుకోవటంలో సఫలీకృతులయ్యారు. అందుకు మచ్చుతునకగా చిన్నగంజాం, మార్టూరు మండలాల్లో జరిగిన చేరికలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇంకొల్లు మండలంలో టీడీపీ నాయకుల మధ్య ఉన్న స్వల్ప విభేదాలను దృష్టిలో ఉంచుకొని ఒక వర్గాన్ని దరి చేర్చుకునేందుకు వైసీపీ కుటిల ప్రయత్నాలు చేసింది కానీ ఏలూరి వ్యూహం ఆ పార్టీ నాయకులు, శ్రేణుల్లో ఉన్న టీడీపీ పట్ల అభిమానంతో వైసీపీ ప్రయత్నాలు విఫలమయ్యాయి. వలసల నివారణ ప్రయత్నం విఫలం కావటంతో అలకబూనిన వైసీపీ నాయకులను దరిచేర్చుకునేందుకు వైసీపీ దిగింది. ఇంకొల్లు మండలంలో ఆ పార్టీ నాయకుడిపై ఉన్న పార్టీ సస్పెన్షన్ ఎత్తి వేయించారు. కాని కిందిస్థాయి సమస్యలకు పరిష్కారం చూపలేకపోవటంతో ఫలించలేదు. కారంచేడు మండలంలో ప్రలోభాలే ఆయుధంగా అలకబూనిన నాయకులను దరిచేర్చుకునే ప్రయత్నంలో వైసీపీ నేతలు మునిగిపోయారు. వైసీపీ అభ్యర్థి బాలాజీ ఒంటెత్తు పోకడ విధానాలు వారి ప్రయత్నాలను బెడసికొడుతున్నాయి. ఇప్పటికీ వైసీపీ అభ్యర్థి ప్రచారం కన్నా వలసలు, అలకల నివారణ జరక్క ప్రచారం వైపు కూడా దృష్టి పెట్టలేకపోతున్నారు. ఇటు చూస్తే టీడీపీ అభ్యర్థి ప్రచార కార్యక్రమం ఊరూవాడా మారుమోగుతోంది. పోలింగ్ కేంద్రాల వారీ పోలింగ్ మేనేజ్‌మెంట్‌ను ఆయన చక్కబెట్టుకొని సమరానికి సిద్ధమై సోమవారం నామినేషన్ వేస్తున్నారు.

లోకేష్‌ను కలిసిన బాచిన



హైదరాబాద్‌లో నారా లోకేష్‌ను కలిసిన బాచిన కృష్ణ చైతన్య, ఆయన తండ్రి చెంచు గరటయ్య

బాపట్ల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ఆయన కుమారుడు కృష్ణ చైతన్యలు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఇటీవల వరకు పనిచేసిన కృష్ణచైతన్య ఇటీవలే టీడీపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. గురువారం వారి అనుచరులతో కలిసి లోకేష్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ అధికారంలోకి రాగానే సముచిత ప్రాధాన్యం దక్కుతుందని లోకేష్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎవరికీ అన్యాయం జరగదని, పార్టీ గెలుపుకోసం సమష్టిగా పనిచేయాలని న్యాయం చేసే బాధ్యత తాను తీసుకుంటానని లోకేష్ స్పష్టం చేసినట్లు సమాచారం



వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు

- 85 ఏళ్లు పైబడిన వృద్ధులు దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దకే ఓటు
- వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్
- ఈనెల 22లోపు దరఖాస్తుకు అవకాశం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం ఉన్న దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఎన్నికల కషన్ అవకాశం కల్పించింది. అందుకోసం జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కును పొందేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫారం-12డి దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల కమిషన్ నిర్దేశించిన తేదీల్లో వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించుకోనున్నారు. అందుకోసం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేయడంతో తదనుగుణ చర్యలు చేపట్టారు. ఉద్యోగులు ఏ విధంగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటారో అదే విధంగా వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. ఆ దరఖాస్తుతోపాటు ఓటరు కార్డు జెరాక్స్‌ను కూడా జత చేసి సమర్పించాలి. జిల్లా వ్యాప్తంగా 85 ఏళ్లు పైబడిన వృద్ధులు సుమారు 7వేల మందికి పైగా ఉన్నట్లు సమాచారం. 40శాతానికి పైగా ఉన్న దివ్యాంగులు మరో 15వేల మంది వరకు ఉన్నట్లు సమాచారం. వారంతా ఆ నియోజకవర్గ పరిధిలోని ఆర్వోల వద్ద దరఖాస్తు చేసుకుంటే వచ్చేనెల 5వ తేదీ నుంచి 7వ తేదీలోపు వారి ఇంటి వద్దకే వచ్చి ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. అందుకోసం ఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈ అవకాశాన్ని కల్పించింది.

ప్రజల నాడి పట్టిన డాక్టర్ లక్ష్మి

» ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ కూటమి అభ్యర్థి » ఆప్యాయ పలకరింపులతో ప్రజల్లోకి.. విశేష స్పందన



ప్రజల్లో ఒదిగిపోతూ ప్రచారం చేస్తున్న లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 18 : దర్శి నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రజల నాడి పట్టుకున్నారు. నిన్న మొన్నటి వరకు ప్రజల నాడి పట్టుకొని వైద్య సేవలు అందించి మంచి డాక్టర్‌గా గుర్తింపు పొందిన లక్ష్మి నేడు రాజకీయ రంగంలో ప్రజల సమస్యలను సావదానంగా వింటూ, పరిష్కారం కోసం మార్గాలను చూపుతూ ముందుకు సాగుతున్నారు. మూలనున్న పండుముదుసలి నుంచి చంకలో ఉన్న చిన్న పిల్లోడి వరకు అందరితో ఆప్యాయంగా మాట్లాడుతూ.. వారిలో ఒకరిగా వదిగిపోతూ సాంత్వన చేకూరుస్తున్నారు. కొన్ని అంశాల్లో ముక్కుసూటిగా మాట్లాడుతూ స్పష్టమైన హామీలు ఇస్తున్నారు. ఆమె ప్రచార తీరుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా వ్యవహరిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులందరితో కలిసికట్టుగా ప్రచారం చేస్తున్నారు. వీరికితోడు ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అపార అనుభవం, ఆయన కుమారుడు రాఘవరెడ్డి చొరవతో టీడీపీ ప్రచారంలో దూసుకెళ్తుంది. అదే క్రమంలో టీడీపీలోకి వైసీపీ నుంచి భారీగా చేరికలు జరుగుతున్నాయి.

వైసీపీ నుంచి భారీ చేరికలు

వైసీపీ నుంచి ముఖ్య నాయకులతో పాటు వందలాది కుటుంబాలు ఇప్పటికే టీడీపీలో చేరాయి. ముండ్లమూరు, దొనకొండ మండలాల వైసీపీ కన్వీనర్లు బిజ్జం సుబ్బారెడ్డి, కందుల నారపురెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, దొనకొండ జడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీలు మిట్టా కోటిరెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, దర్శి నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డి తదితర ముఖ్య నాయకులతో పాటు అనేకమంది ముఖ్య కార్యకర్తలు కూడా టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి వచ్చిన నాయకులు తన అనుచరులను ముమ్మరంగా టీడీపీలో చేర్పిస్తున్నారు. దర్శి, దొనకొండ, ముండ్లమూరు మండలాల్లో వందలాది కుటుంబాలు టీడీపీలో చేరి పార్టీ గెలుపుపై మరింత నమ్మకాన్ని పెంచాయి.

గొట్టిపాటి కుటుంబంపై తరగని నమ్మకం

టీడీపీ పట్ల ఆదరణ పెరుగుతుండడంతోపాటు అసెంబ్లీ అభ్యర్థి లక్ష్మి పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఆమె మహిళల వద్దకు వెళ్లి వారితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆమె ప్రసంగాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి.. ఆలోచింపజేస్తున్నాయి. నియోజకవర్గ సమస్యలను వివరిస్తూ శాశ్వత పరిష్కారం చేయిస్తానని స్పష్టమైన హామీ ఇస్తుండటంతో ప్రజల్లో విపరీతమైన స్పందన లభిస్తోంది. ఆమె కుటుంబ నేపథ్యం కూడా ఆమెపై నమ్మకాన్ని పెంచుతుంది. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనమరాలిగా, దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య కుమార్తెగా ఆమె పరిచయం చేసుకుంటున్నారు. గత 40 ఏళ్లుగా వారి కుటుంబం అందించిన సేవలను మచ్చలేని రాజకీయ జీవితాన్ని గుర్తుచేస్తున్నారు. వారి వారసురాలిగా దర్శి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ఇచ్చిన హామీలు తుచ తప్పకుండా అమలు చేస్తానని భరోసా ఇస్తున్నారు.

మద్దతు ప్రకటించిన అన్ని వర్గాల వారు

టీడీపీకి అన్ని వర్గాలు, విభాగాల వారు మద్దతు ప్రకటించారు. టీడీపీకి కాపు జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు దర్శిలో పర్యటించి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదేవిధంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఐటీ ఉద్యోగులు ఆత్మీయ సమావేశాలు నిర్వహించి సంపూర్ణ మద్దతు తెలిపారు. అన్నివర్గాల మద్దతు లభిస్తుండటంతో విజయం తథ్యమని టీడీపీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.

వంద పడకల ఆస్పత్రి, వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటు

టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సేవలందించటమే కాక సొంత నిధులతో దర్శిలో మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ నిర్మించి తమ కుటుంబం సేవలందిస్తుందని భరోసా ఇస్తున్నారు. ఎన్ఆర్‌ఐల సహకారంతో నియోజకవర్గంలో వంద వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దొనకొండలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చేస్తామని, ఎన్ఆర్‌ఐల సహకారంతో పరిశ్రమల ఏర్పాటు చేస్తామని చెప్పటంతో నిరుద్యోగ యువత కూడా సానుకూలంగా స్పందిస్తోంది. అన్నివర్గాల ప్రజల సమస్యలు గుర్తించి అందరికీ న్యాయం చేస్తానని వినమ్రంగా తెలియజేస్తున్నారు.

సైకిల్ ఎక్కిన వైసీపీ నేత



నామినేషన్ల ప్రారంభం రోజునే ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ నియోజకవర్గంలో ముఖ్యనేతగా ఉన్న దివి పున్నారావు తెలుగుదేశం పార్టీలో చేరారు. తన స్వగ్రామమైన ఎన్‌జీపాడు మండలం పోతవరంలో అనుచరులతో కలిసి టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే ఆయన పార్టీలో చేరిన ఆనందంలో ఆయన అనుచరులు, టీడీపీ శ్రేణులు వెంటనే ఓ సైకిల్ తెప్పించి ఆయనను దానిపై కూర్చోబెట్టి నినాదాలు చేశారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా దివి క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలో, తర్వాత ఆవిర్భావం నుంచి వైసీపీలో ముఖ్యనేతగా ఉంటున్నారు. ఎన్‌జీపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా సుదీర్ఘ కాలం పనిచేసిన పున్నారావు, వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ మండల అధ్యక్షుడుగా పనిచేశారు. పోతవరం సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యునిగా పున్నారావు పనిచేయగా ఆయన సతీమణి దివి రంగవల్లి ఎన్‌జీపాడు ఎంపీపీగాను గతంలో పనిచేశారు.

-ఒంగోలు, ఆంధ్రజ్యోతి

కఠిన నిబంధనలతో ఇబ్బందులు



బస్సులు, ఆటోలు గ్రామం వెలుపల ఆపడంతో కాలిమార్గంలో నడిచివెళుతున్న ప్రయాణికులు

కొండపి, ఏప్రిల్ 18 : నామినేషన్ల సందర్భంగా కఠిన ఆంక్షలు విధించడంతో ప్రజలు గురువారం నానా ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్లు వరకు బారికేడ్లు కట్టి వాహన రాకపోకలపై, నడిచివెళ్లే ప్రయాణికులపై సైతం ఆంక్షలు విధించారు. వంద మీటర్లు లోపల దుకాణాలను పోలీసులు మూయించారు. ఉదయం పది గంటల వరకు ఆర్టీసీ డిపో వరకు టంగుటూరు రోడ్డులోని బస్సులను అనుమతించిన పోలీసులు పది గంటల తర్వాత నుంచి ఆంక్షలు విధించారు. అదేవిధంగా ఆటోలు, ఇతర వాహనాలు కూడా రాకుండా నిరోధించారు. టంగుటూరు రోడ్డులో కొండపి గ్రామం వెలుపలే బస్సులను, ఆటోలను ఆపివేయడంతో ప్రయాణికులు నడిచి వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రతలో వృద్ధులు నడవలేక అవస్థలు పడ్డారు. కొంత మంది పొలాలకు అడ్డంగా నడుచుకుంటూ దగ్గరి దారులు ద్వారా నడిచివెళ్లారు. మీడియా కూడా తహసీల్దార్ కార్యాలయం వెలుపల వేచి ఉండగా, ఆర్వోతో మాట్లాడిన సింగరాయకొండ సీఐ రంగనాథ్ 100 మీటర్ల వెలుపల మీడియా వేచి ఉండాలని సూచించారు. ఈఆర్వో కూడా తాను డీఆర్వోతో మాట్లాడానని వంద మీటర్లు దూరంలో మీడియా పాయింట్ ఏర్పాటు చేశామని అక్కడే మీడియా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. భద్రతను కొండపి సీఐ పాండురంగారావు, ఎస్సై కృష్ణబాజీబాబు, పొన్నలూరు ఎస్సై రాజేష్‌లు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి టీవీ సునీల్



సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తొలిరోజు నామినేషన్లు నిల్

- హడావుడిగా సీసీ కెమెరాల మరమ్మతులు
- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అద్దంకి నియోజవర్గంలోని నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం అ యింది. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీవీ సునీల్ నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. 18 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సెలవు రోజులు మినహాయించి నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. 26న పరిశీలన, 29న ఉపసంహరణ అదేరోజు సాయంత్రానికి పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియలో సందేహాలుంటే తహసీల్దార్ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ ద్వారా తెలుసుకోవచ్చని రిటర్నింగ్ అధికారి సునీల్ తెలిపారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం రోజు తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాట్లను హడావుడిగా చేశారు. ఇప్పటికే ఆ పని పూర్తి చేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా గురువారం మరమ్మతులు చేయించి ఏర్పాటు చేయించారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు తహసీల్ధార్ కార్యాలయం లోకి అనుమతించబోమని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ఈమేరకు మెయిన్ గేటు వద్ద నిల్చుని ఎవరినీ లోనికి పంపలేదు. ఎన్నికల విధులు కేటాయింపులో భాగంగా ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు వారి అనుమతి పత్రాలను అధికారులకు ఇచ్చేందుకు కూడా లోపలకు అనుమతించలేదు. దీంతో మహిళా ఉద్యోగులు, ఇతర శాఖల ఉద్యోగులు గేటు వద్ద పడిగాపులు కాలయాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు వెనుదిరిగి వెళ్లారు.



బల్లికురవ మండల కేంద్రంలో కూల్ డ్రింక్స్ బాటిళ్లను తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మితే చర్యలు

- రెండు దుకాణాలపై కేసు

బల్లికురవ, ఏప్రిల్ 18 : కంపెనీలు ముద్రించిన ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా అమ్మకాలు జరిపితే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం బల్లికురవ మండల కేంద్రంలో పలు దుకాణాలను తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఇటీవల బల్లికురవ గ్రామానికి చెందిన వ్యక్తి కూల్‌డ్రింక్ బాటిల్‌పై ఉన్న ధర కంటే అధికంగా విక్రయాలు చేస్తున్నారని ఆన్‌లైన్‌లో లీగల్ మెటరాలజీ శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు కూల్‌డ్రింక్ దుకాణాలను తనిఖీలు చేయగా రెండు దుకాణాలలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. మనగ్రోమోర్ కేంద్రంలో ఉన్న పురుగు మందు బాటిళ్లపై ఎమ్మార్పీ లేకపోవడంతో వారిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యాపారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. దుకాణాలలో ఉన్న కొలతల కాటాలను ముద్రలు వేయించుకోవాలన్నారు. కొలతలలో తేడాలు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమని, అందరూ సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న హేమంత్‌నాగరాజు

మద్యం ప్రభావం ఎన్నికలపై పడకుండా చర్యలు

- ఎస్ఈబీ నెల్లూరు నోడల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : మేలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎక్కడా మద్యం ప్రభావం ఎన్నికల మీద పడకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికల కోసం ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నెల్లూరు నోడల్ డిప్యూటీ కమిషనర్ కే హేమంత్‌నాగరాజు ఆదేశించారు. గురువారం అద్దంకి ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి పనితీరును సమీక్షించారు. ఎస్ఈబీ పరిధిలోని గ్రామాలు, అనుమానిత ప్రదేశాల్లో ఇప్పటివరకు జరిగిన దాడుల వివరాలను తెలుసుకున్నారు. వాటిపై తీసుకోవల్సిన చర్యలను సూచించారు. నాన్ డ్యూటిపైడ్ లిక్కర్, అనాధికార మద్యం అమ్మకాలు, అక్రమ మద్యం నిల్వల గోడౌన్ల సమాచారాలను తెలుసుకుని దాడులు నిర్వహించాలన్నారు. పాత ముద్దాలను బైండోవర్ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎస్ఈబీ ఎస్ఐ వీ సైమాన్, సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలు నగరంలో నిర్మానుష్యంగా మారిన చర్చిసెంటర్

సూర్యప్రతాపం

- పశ్చిమప్రాంతంలో 42 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు
- మార్కాపురంలో అత్యధికంగా 45 డిగ్రీలు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18 : జిల్లాపై సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. ఎండతీవ్రతకు తోడు ఉక్కపోత అధికంగా ఉంటుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. గురువారం పశ్చిమప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. ఎక్కువచోట్ల 42 డిగ్రీలకుపైనే గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మార్కాపురం మరింత మండింది. అక్కడ అత్యధికంగా 45.3 డిగ్రీల ఎండ కాచింది. అర్ధవీడు మండలంలో 44.1, కంభంలో 44.1, దొనకొండలో 44.0, దోర్నాలలో 43.8, హనుమంతునిపాడులో 43.3, కనిగిరిలో 43.8, కొనకనమిట్లలో 43.6, చీమకుర్తిలో 43.2, దర్శిలో 42.8, సీఎస్‌పురంలో 42.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అది జిల్లాకేంద్రమైన ఒంగోలులో 39 డిగ్రీలుగా ఉంది. తూర్పుప్రాంతంలోని ఇతరచోట్ల ఇంచుమించు ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఉదయం 10 గంటలకే భానుడి భగభగలు మొదలవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో గడపదాటి బయటకు వచ్చేందుకు భయపడిపోతున్నారు.

ఇక సమరమే.!

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

ఒంగోలులో విడుదల చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

ఇప్పటికే అభ్యర్థుల ప్రచారం ముమ్మరం

మరింత పెరగనున్న వేడి

సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టానికి తెరలేసింది. వచ్చేనెల 13న జరగనున్న పోలింగ్‌కు గురువారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆ వెంటనే నామినేషన్‌ల దాఖలు ప్రక్రియ మొదలైంది. ఈనెల 25 వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ 29తో ముగియనుంది. ఇప్పటికే అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు దూసుకుపోతున్నారు. ఇప్పుడు నామినేషన్ల పర్వం కూడా ప్రారంభంకావడంతో ఎన్నికల వేడి మరింత పెరిగింది.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట, పక్కన రాఘవరెడ్డి, రియాజ్ తదితరులు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఒంగోలులో ఒంగోలులో కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫాం-1 నోటిఫికేషన్‌ను జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆర్వోలు జారీ చేశారన్నారు. ఆ వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. నిర్దేశించిన కార్యాలయాల్లో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను సమగ్రంగా సమర్పించాలన్నారు. ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు వీడియో గ్రఫీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. నామినేషన్ పత్రాలతోపాటు బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలన్నారు. లేటెస్ట్ అఫిడవిట్ ఫాం-16, లేటెస్ట్ నామినేషన్ పత్రాలను మాత్రమే వినియోగించాలన్నారు.



సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తొలిరోజు 13 నామినేషన్లు దాఖలు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల్లో కీలకఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఉదయం 11 గంటలకు నామినేషన్‌ల షెడ్యూల్‌ను ఎక్కడికక్కడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ విడుదల చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్లు స్వీకరించారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి నాలుగు సెట్‌లు, జిల్లాలో ఉన్న ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు అసెంబ్లీ స్థానాలకు 9 నామినేషన్లు దాఖలయ్యాయి. మార్కాపురం, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కటి కూడా దాఖలు కాలేదు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒక సెట్ నామినేషన్ వేయగా, మాగుంట గీతాలత మరో సెట్ దాఖలు చేశారు. బూచి ఏడుకొండలు, బొడ్డు క్రాంతికుమార్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, నందిని బూచేపల్లి మరో రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. మందా మీనా స్వతంత్ర, పి.కొండారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా కైలా వెంకటరావు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆసోది శంకర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కొండపి నియోజకవర్గం నుంచి శ్రీపతి సతీష్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక తరఫున ఈవీ సురేష్‌బాబు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

ఇంటింటికీ బియ్యం బస్తా..

కొత్తపట్నం మండలంలో జోరుగా పంపిణీ

ఎన్నికల తాయిలాలు పంపిణీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి



కొత్తపట్నంలో రాత్రి సమయాల్లో బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న వైసీపీ శ్రేణులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) ఏప్రిల్ 18: కొత్తపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో వైసీపీ శ్రేణులు తాయిలాల పంపిణీతో ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. నెలరోజుల క్రితం నుంచే వైసీపీ నాయకులు మండలంలోని అన్ని గ్రామాల్లో రకరకాల వస్తువుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తాజాగా వారం రోజుల నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి బియ్యం బస్తాలు, వంటనూనె ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ పంపిణీ ప్రతిరోజు రాత్రి సమయాల్లో నిర్వహిస్తున్నారు. ఒంగోలు నుంచి వాహనాల్లో బియ్యం, నూనె ప్యాకెట్ల బస్తాలు రాత్రి సమయాల్లో గ్రామాలకు చేరుతున్నాయి. వీటిని స్థానిక నాయకులు ఇంటికి ఒక బస్తా లెక్కన అందజేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు బియ్యం లోడుతో వస్తున్న వాహనాలను చూసీచూడనట్లుగా వదిలేస్తుండగా లారీ గ్రామాల్లోకి వచ్చిన వెంటనే గంటలోపే వీటిని స్థానిక నాయకులు పంపిణీ చేసేస్తున్నారు. నెలరోజుల క్రితమే అంటే ఎన్నికల కోడ్ రాక ముందే డ్వాక్రా సంఘాల మహిళలకు వైసీపీ నేతలు చీరలు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. గ్రామగ్రామానికి చీరలను పంపించి ఆయా గ్రామాల్లోని పొదుపుసంఘాల మహిళలకు అందజేశారు. ఆ తర్వాత అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు రూ.5 వేల వంతున నగదును పంపిణీ చేశారు. తాజాగా ఇప్పుడు ఇంటింటికి బియ్యం బస్తాను పంపిణీ చేస్తున్నారు. వారంరోజుల నుంచి ఈ పంపిణీ ప్రారంభమైంది. తొలుత కొత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని డీటీకాలనీ, డీడీకాలనీల్లోని ఎస్టీ కుటుంబాలకు పంపిణీ చేశారు. ఇప్పుడు గ్రామంలోని అన్ని ఏరియాల్లో ఉన్న ఇంటింటికీ ఈ బియ్యాన్ని అందజేస్తున్నారు. కాగా వైసీపీ శ్రేణులు పంపిణీ చేస్తున్న బియ్యం నాసిరకంగా ఉన్నాయంటూ ఓటర్లు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే సబ్సిడీ బియ్యాన్ని తిరిగి మర పట్టించి గోతాలు మార్చి నాణ్యమైన బియ్యంగా పంపిణీ చేస్తున్నారంటూ ఓటర్లు చెబుతున్నారు. కొంతమంది వైసీపీ ఇస్తున్న బియ్యాన్ని తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని ఓటర్లను ప్రలోభపెట్టే దిశగా చిన్నస్థాయి మీటింగ్‌లు పెడుతున్నారు. చిన్నదే అయినప్పటికీ సమావేశానికి వస్తే రూ.500, బిర్యానీ ప్యాకెట్లను అందజేస్తున్నారు. ఈ రకంగా వైసీపీ నేతలు గత ఐదేళ్ల నుంచి దోచుకున్న డబ్బును మంచినీళ్ల ప్రాయంగా వెదజల్లుతున్నారని మండలవాసులు మాట్లాడుకుంటున్న పరిస్థితి.

అకుంఠిత దీక్ష, పట్టుదలతో సివిల్స్ ర్యాంకు సాధించా..!

- తల్లిదండ్రుల ప్రోత్సాహం, భార్య సహకారం మరువలేనిది
- రాహుల్‌కుమార్



కుటుంబ సభ్యులతో రాహుల్‌కుమార్ (ఫైల్)

కనిగిరి, ఏప్రిల్ 18: అదో కఠోర పరీక్ష... ప్రతి యువకుడు సాధించేందుకు తపనపడే సివిల్స్ సర్వీసెస్. ఆ లక్ష్యాన్ని సాధించాలంటే ఎంతో కఠోర శ్రమతో పాటు అకుంఠిత దీక్ష, పట్టుదల ఎంతో అవసరం. అలాంటి సివిల్స్ పరీక్షల్లో 504 స్థానాన్ని సాధించి కనిగిరి ప్రాంతానికి పేరు తీసుకు వచ్చిన రాహుల్‌కుమార్‌ను ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు. వీరి స్వగ్రామం వెలిగండ్ల మండలం మొగళ్లూరు. తండ్రి వంగేపురం రత్నకుమార్ పశుసంవర్ధకశాఖలో (ఈహెచ్ఏ)గా పీసీపల్లి మండలం ముద్దపాడు గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. తల్లి వయోలారాణి కనిగిరి మండలం చింతలపాలెం హైస్కూల్‌లో ఉపాధ్యాయినిగా పనిచేస్తుంది. వృత్తిరీత్యా వీరిరువురు గత 25 ఏళ్ళుగా కనిగిరిలో నివాసం ఉంటున్నారు. అంతేకాకుండా తమ ఒక్కగానొక్క కుమారుడి రాహుల్ ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే వారి ఆకాంక్ష. కనిగిరి పట్టణంలోని ప్రగతి విద్యానిలయంలో పదో తరగతి 2009లో పూర్తి చేశాడు. ఇంటర్మీడియట్ నెల్లూరు నారాయణ కళాశాలలో పూర్తి చేయగా, 2011 నుంచి 2015 వరకు కాకినాడ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.

కలెక్టర్ కావాలన్నదే తన లక్ష్యం.. రాహుల్

చిన్ననాటి నుంచి తనకు కలెక్టర్ కావాలని బలంగా ఉండేది. అందుకు అమ్మానాన్న ఎంతో ప్రోత్సాహన్నిచ్చారు. వారి ప్రోత్సాహంతో ఇంజనీరింగ్ పూర్తయిన అనంతరం ఢిల్లీలోని వాజీరాం అండ్ రవి కోచింగ్ సెంటర్‌లో ఒక ఏడాది కోచింగ్ తీసుకున్నా. ఆ తర్వాత స్వీయ శిక్షణతో నిరంతరం పుస్తకపఠనం, కొత్త విషయాలను తెలుసుకోవటం, గూగుల్ ద్వారా జనరల్‌నాలెడ్జ్ పెంపొందించుకుంటూ వచ్చా. పోటీ పరీక్షలకు హాజరవుతూ 2017లో 701వ ర్యాంకు సాధించా. ఆర్యాంకు ద్వారా ఐఆర్‌ఎస్, ఐఎఫ్ఎస్ లలో ఉద్యోగం వచ్చేది. అయితే, కలెక్టర్ కావాలన్నా తన సంకల్పం వీడలేదు. వాటిలో చేరకుండా మళ్ళీ సాధన చేశా. 2024 యూపీఎస్సీ ఫలితాల్లో 504 ర్యాంకు పొంది లక్ష్యాన్ని సాధించా.

తన లక్ష్యసాధనలో తల్లితండ్రుల ప్రోత్సాహంతోపాటు తన భార్య సహకారం మరువలేనిది. 2021లో గుంటూరుజిల్లా తెనాలి మండలం వడ్లమూడికి చెందిన ప్రియాంకతో వివాహమైంది. వీరిరువురికి ఒక పాప జన్మించింది. ఎమ్మెస్సీ నర్సింగ్ చేసిన భార్య ప్రియాంక హైదరాబాద్‌లో మెడికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుంది. తన లక్ష్యాన్ని సాధించేందుకు ఆమె పూర్తి సహకారం అందించటం మరువలేనిది.

కార్పొరేటర్లకూ తాయిలాలు..!

కొంతకాలంగా వైసీపీకి చెందిన కొందరు అలక

వారిని బుజ్జగించేందుకు అభ్యర్థుల ప్రయత్నం

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఆధ్వర్యంలో రూ.లక్షల పంపిణీ

నగరంలో చర్చనీయాంశం



ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 18 : వచ్చే ఎన్నికల్లో విజయం కోసం వైసీపీ అనేక అడ్డదారులను తొక్కుతోంది. కోడ్‌ను అతిక్రమంచి తాయిలాలు పంపిణీ చేస్తోంది. ఒంగోలులో ఇప్పటికే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఆర్పీలు, అంగన్‌వాడీలకు దుస్తులు, నగదు ఇచ్చిన వైసీపీ నేతలు ఇప్పుడు అసంతృప్తితో ఉన్న సొంత పార్టీ నాయకులను సంతృప్తి పరిచే చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా కార్పొరేటర్లను బహుమతుల పేరుతో బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రజల్లో వ్యతిరేకతతో ప్రలోభాలు

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గ్రహించిన వైసీపీ నాయకులు పార్టీ శ్రేణులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆపార్టీ తరఫున ఒంగోలు పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి తాయిలాల పంపిణీని ముమ్మరం చేశారు. ఎన్నికల కోడ్ అమలుకు ముందే ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పుడు పార్టీ నాయకులు, శ్రేణులపై దృష్టి సారించారు. కొద్ది నెలల క్రితం నగరంలో పేదలకు పట్టాల పంపిణీ సందర్భంగా ఎన్.అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కలపాలెంలో కొనుగోలు చేసిన పొలాలను బాగుచేసి, రోడ్లు, ఎర్త్ వర్క్, విద్యుత్ సౌకర్యం కల్పన పనుల్లో తమకు పనుల్లో వాటా ఇస్తారని నగరపాలక సంస్థ కార్పొరేటర్లు ఆశపడ్డారు. అయితే ఆ పనులు తమకు కేటాయించకపోవడంతో వారు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కొందరు కార్పొరేటర్లు తమకు అధికార పార్టీలో ఉన్నా అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఈనేపథ్యంలో ఆర్థికంగా స్థితిమంతుడైన వ్యక్తిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా వైసీపీ రంగంలోకి దించడంతో మరోసారి ఆశలు పెంచుకున్నారు. ఆయన ఒంగోలులో పర్యటించే ప్రతిసారీ తమకు కబురు వస్తుందని ఆశించిన వారికి ఆయన నుంచి పిలుపురాలేదు. అధిక సమయం ఆయన పశ్చిమప్రాంతంపై దృష్టి సారించారు. అంతేకాకుండా ఎంపీ అభ్యర్థి కార్యాలయం సైతం జిల్లాకు మధ్యస్థంగా ఉండే పొదిలిలో తీసుకోవడంతో కార్పొరేటర్లు నిరాశకు గురయ్యారు.

కార్పొరేటర్‌కు రూ.3లక్షలు, కోఆప్షన్ సభ్యుడికి రూ.2లక్షలు

నెలరోజులుగా ఎంపీ అభ్యర్థి పిలుపు కోసం ఎదురు చూసిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వైసీపీ డివిజన్ అధ్యక్షులకు ఎట్టకేలకు అవకాశం లభించింది. రెండు రోజుల క్రితం ఒంగోలులో ఎంపీ అభ్యర్థి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాన్ని విజయవంతం చేయాలంటూ నియోజక వర్గ పార్టీ శ్రేణులకు, కార్పొరేటర్లకు తాయిలాలు ఇచ్చినట్లు సమాచారం. సమావేశం జరిగిన వేదిక వద్ద ఇస్తే మీడియా కంట పడే అవకాశం ఉందని గ్రహించిన ఎంపీ, ఎమ్మెల్యేల వర్గీయులు గుట్టుగా డివిజన్‌లకే వెళ్లి కార్పొరేటర్‌కు రూ.3లక్షలు, కోఆప్షన్ సభ్యుడికి రూ.2లక్షలు, డివిజన్ అధ్యక్షులకు రూ.లక్ష చొప్పున తాయిలాలు ఇచ్చినట్లు తెలిసింది. ఓటమి తప్పదని భావించిన వైసీపీ నాయకులు అటు ప్రజలను, ఇటు పార్టీ శ్రేణులను డబ్బుతో కొనుగోలు చేయడం చర్చనీయాంశమైంది.

వైసీపీకి షాక్

- ఎన్‌జీపాడు మండలంలో భారీగా టీడీపీలో చేరికలు
- సీనియర్ నేత పున్నారావు సైతం గుడ్‌బై
- కండువాలు వేసి ఆహ్వానించిన కూటమి అభ్యర్థి విజయ్‌కుమార్



ఓబన్నపాలెంలో బీఎన్ సమక్షంలో టీడీపీ లో చేరిన కార్యకర్తలు

ఒంగోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని నాగులుప్పలపాడు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మూడు గ్రామాల్లో గురువారం ఒక్కరోజే పలువురు కీలక నేతలు, వారి అనుచరులతో టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ ఆ గ్రామాలకు వెళ్లి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి పసుపు కండువాలు వేశారు. నియోజకవర్గంలోనే గతంలో కాంగ్రెస్, ప్రస్తుతం వైసీపీలో సీనియర్ నేత అయిన దివి పున్నారావు తన అనుచరులతో స్వగ్రామమైన పోతవరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సైకిల్ ఎక్కారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న పున్నారావు పోతవరం గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఆయన సతీమణి దివి రంగవల్లి నాగులుప్పలపాడు ఎంపీపీగా పనిచేశారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, వైసీపీ ఆవిర్భావం అనంతరం ఆపార్టీ మండల కన్వీనర్‌గా పనిచేసిన పున్నారావు సంతనూతలపాడుతో పాటు ఒంగోలు నియోజకవర్గంలోనూ రాజకీయ వర్గాలకు సుపరిచితులు. ఇక మండలంలోని ఓబన్నపాలెంలో మాజీ సర్పంచ్ వక్కింటి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్‌తో పాటు పలువురు బీఎన్ సమక్షంలో చేరారు. అగ్రహారంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పొద శ్రీధర్‌తోపాటు మరికొంత మంది పసుపు కండువాలు వేసుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో వైసీపీ నేతలు పలువురు టీడీపీలో చేరేందుకు మండల నాయకులతోపాటు అభ్యర్థి బీఎన్ విజయకుమార్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు



జనసేనలో చేరిన శ్రీనివాసరావు తదితరులు

ఒంగోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మద్దిపాడులో వైసీపీ కీలక నేతగా ఉన్న నూనె శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. గురువారం స్థానిక గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయకుమార్ ప్రచార కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరి బాబు, మండల జనసేన అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొనగా వారి సమక్షంలో శ్రీనివాసరావు పార్టీలో చేరారు. మద్దిపాడు పంచాయతీ ఐదో వార్డు మెంబరు కూడా అయిన శ్రీనివాసరావుకు వివిధ వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయనతో పాటు 20 కుటుంబాలకు పైగా జనసేనలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీలో చేరిన వలపర్ల బీసీ కుటుంబాలు


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన వలపర్ల బీసీ కుటుంబాలు


మార్టూరులో ప్రచారం చేస్తున్న కూటమి శ్రేణులు

మార్టూరు, ఏప్రిల్ 18 : మండలంలోని వలపర్ల గ్రామంలోని 20 బీసీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారు గురువారం మండలంలోని ఏలూరి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఏలూరి వారికి కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ వలపర్ల గ్రామంలో టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించినట్లు చెప్పారు. ఇకపై కూడా అభివృద్ధికి కృషి చేస్తానని ఏలూరి తెలిపారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఏలూరి కోరారు. చేరినవారిలో తన్నీరు శివ, తన్నీరు వెంకటేష్, తన్నీరు వెంకయ్య, గుంజి సాయి వెంకటేష్, గుంజి పవన్, కుంచాల వీరాంజనేయులు, గుంజి సుబ్బారావు, తన్నీరు అనిల్, గుంజి ధనమూర్తి, లక్ష్మీనారాయణ, తన్నీరు అంకమ్మ, కుంచాల వెంకటేష్, తన్నీరు ఆకాష్, తన్నీరు గురు ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో కంభం పాటి హనుమంతరావు, గుంటి వెంకటేశ్వర్లు షేక్ బషీర్ పాల్గొన్నారు.

వలపర్లలో పార్టీ కార్యాలయం ప్రారంభం

మండలంలోని వలపర్ల గ్రామంలో గురువారం టీ డీపీ కూటమి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం బీసీ కాలనీలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు, షేక్ బషీర్, గుంటి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ఎస్పీ సలాం, గుద్దంటి శంకర్, రమేష్ , మోహనరావు పాల్గొన్నారు.

ఏలూరి నామినేషనుకు తరలిరండి

టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఈనెల 22వ తేదీన పర్చూరులో నామినేషన్ వేస్తున్నారని, ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని శ్రేణులు కోరారు. గురువారం మార్టూరులో పాత సినిమా హాలు వెనుక కాలనీలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎమ్మెల్యేగా ఏలూరిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, శివనాగేశ్వరరావు, రమాదేవి, శేషకుమారి, భూలక్ష్మి, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏలూరి విజయాన్ని కాంక్షిస్తూ జోరుగా ప్రచారం

పర్చూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపు కోసం ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో ప్రచారం జోరుగా సాగుతోంది. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరి విజయం కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రచారం చేస్తున్నారు. గురువారం పర్చూరులోని ప్రధాన వీధుల్లో ప్రచారం సాగింది. కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, ఆకుల మధుబాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్, వడ్డెముక్కల అబ్రహాం, నలిగిల కిషోర్, మార్టూరు నాగరాజు, కొల్లా చౌదరి, పూరిమెట్ల జయమ్మ, ఊటుకూరి నిర్మల, సుబ్బమ్మ, జనసేనులు సందీప్ తేజ, దీర్ఘాల రమేష్, తులసి చంటి, అచ్చికోలు సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

చినగంజాం, సంతరావూరులో కూటమి ప్రచారం

చినగంజాం : చినగంజాం, సంతరావూరు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కూటమి శ్రేణులు గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో, సంతరావూరు రామాలయంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు అబ్దుల్ కలాంఅజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, టీ.జయరావు. చేవూరి రవణమ్మ, నరహరి శ్రీనివాసరావు, గంటా చెన్నయ్య, బెల్లంకొండ రమేష్‌బాబు, ఎం.పద్మావతి, షేక్ జిలాని, బాజీ అమీర్జాన్, సుభాని, రసూల్, పీ.శ్రీనివాసరావు, తుమ్మలపెంట చిన్నా, ఎం.రామాంజనేయులు, బడుగు సామ్యేలు, హుస్సేన్‌బాషా, జి.నరసింహారావు, సతీష్, సూరిబాబు, దుర్గారావు, జే.సంధ్యారాణి, కే.శ్యాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పర్చూరులో ఏలూరిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న శ్రేణులు


చినగంజాంలో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

కూటమితోనే మంచి పాలన

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలకు మంచి పాలన అందుతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం రాత్రి అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం, శింగరకొండలో గొట్టిపాటి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలు చేసే పథకాలను, వాటి ప్రయోజనాలను గొట్టిపాటి వివరించారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచేశారన్నారు. దోపిడీ, దౌర్జన్యం, అరాచక పాలన సాగించేవారికి మరో చాన్స్ ఇవ్వొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసం, పిల్లల భవిష్యత్ కోసం సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని గొట్టి పాటి పిలుపునిచ్చారు. టీడీపీ రాగానే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారు. పైగా రూ.4వేలకు పింఛన్ పెంచినట్లు తెలి పారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామన్నారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరిస్తామన్నారు. టీడీపీ, వైసీపీ పాలనలో ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించా లన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమం లో ఆయా గ్రామాల టీడీపీ నాయకులతో పాటు, మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సం ఖ్యలో పాల్గొన్నారు.

సైకిల్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న గొట్టిపాటి



గొట్టిపాటికి హారతులిస్తున్న మహిళలు

5, 16 వార్డుల్లో టీడీపీ శ్రేణుల ప్రచారం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ కార్యక్రమానికి వార్డులోని ప్రజలందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని టీడీపీ వార్డు నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని 5, 16 వార్డుల్లో టీడీపీ నాయ కులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అభ్యర్థి గొట్టిపాటి నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఆ కార్యక్రమాన్ని అభిమానులు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాలల్లో 5వ వార్డులో టీడీపీ నాయకులు వడ్లవల్లి పూర్ణచంద్రరావు, గొట్టిపాటి రవికుమార్ బావమరిది కామేపల్లి బ్రహ్మనాయుడు, గార్లపాటి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చిలుకూరి సంధ్యారాణి, అనిల్, పొన్నలూరి కిరణ్‌కుమార్, రామిశెట్టి రవి, వెంకట్రావు, రంజిత్, సుబ్బారావు, శివకృష్ణతో పాటు 16 వార్డులో బీసీ నాయకులు యత్రాకుల రామాంజనేయులు, మాజీ ఎంపిపి మన్నెం ఏడుకొండలు, అద్దంకి నరేష్, బైరపునేని మోహనరావు, అమర్, గుండెమెడ సుబ్బారావు, కొండమ్మ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


5వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నేడు గొట్టిపాటి నామినేషన్

భారీగా తరలిరానున్న అభిమానులు

అద్దంకి , ఏప్రిల్ 18 : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అద్దంకి పట్టణంలోని భవాని సెంటర్ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి రానుంది. ఈ ర్యాలీకి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గొట్టిపాటి అభిమానులు తరలి రానున్నారు. ఈ మేరకు ఇప్పటికే గ్రామ స్థాయి నుంచే ఏర్పాట్లు జరిగాయి. ర్యాలీకి తరలి వచ్చే నేతలకు, కార్యకర్తలకు అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డు, శింగరకొండ రోడ్డు, కలవకూరు రోడ్డులలో భోజన ఏర్పాట్లు చేశారు.


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రారంభమైన నామినేషన్ల పర్వం

- తొలి రోజు స్వతంత్ర అభ్యర్థి దాఖలు
- పోలీసుల పటిష్ఠ బందోబస్తు

చీరాలటౌన్, ఏప్రిల్ 18 : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు స్వతంత్ర అభ్యర్థిగా పొలిశెట్టి శ్రీనివాసరావు ఒక్కరే నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈనెల 25 వరకు నామినేషన్‌లను స్వీకరిస్తారు. ఆర్వో కార్యాలయానికి నాలుగు వైపులా సుమారు 100 మీటర్ల దూరం వరకు పోలీసులు ఆంక్షలు విధించారు. సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పరిసర ప్రాంత ప్రజలు రాకపోకలకు అసంతృప్తి చెందారు.

పర్చూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కట్టుదిట్టమైన పోలీసు వలయం మధ్య అధికారులు నామినేషన్‌ను స్వీకరించారు. తొలిరోజు బహుజన సమాజ్‌వాది పార్టీ (బీఎస్పీ) పర్చూరు అసెంబ్లీ అభ్యర్థిగా తమ్ములూరి వెంకటరత్నం మొదటి నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ నేతృత్వంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. శాంతి భద్రతకు ఎలాంటి విఘాతం వాటిల్లకుండా పోలీసు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. కార్యాయానికి వందమీటర్ల దూరం నుంచి అభ్యర్థితోపాటు మరో నలుగురు వ్యక్తులకు మాత్రమే అనుమతి కల్పించారు.


నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న బీఎస్పీ అభ్యర్థి

లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : అనుకున్న లక్ష్య సాధన కోసం పట్టుదలతో ఇష్టపడి చదవాలని సివిల్స్ ర్యాంకర్ జగన్నాథం రాహుల్ అన్నారు. పూర్వ విద్యార్థి అయిన రాహుల్‌ను గురువారం అద్దంకిలోని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ జీవీవీ ఆర్ శాస్త్రి, జోనల్ ఇన్‌చార్జి సాయి గణేష్ సన్మానించారు. ఈ సందర్భంగా సివిల్స్‌లో 873 ర్యాంక్ సాధించిన జగన్నాథం రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో, పోటీ పరీక్షల్లో ఎలా రాణించాలో తెలిపారు. అనంతరం రాహుల్‌ను, అతని తల్లి ప్రభావతిని శాలువతో, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రాహుల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

ఉద్యోగిని మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

చీరాలటౌన్, ఏప్రిల్ 18 : సస్పెండ్ అయిన ప్రభుత్వ ఉద్యోగికి తిరిగి అదేస్థానంలో పోస్టింగ్ ఇప్పిస్తామని మోసగించిన ఘటనపై చీరాల వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అందిన వివరాల మేరకు.. చీరాల పరిధిలోని ఓ ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి సస్పెండ్ అయ్యారు. అయనకు పరిచయమైన ఓ వ్యక్తి తిరిగి పోస్టింగ్ ఇప్పిస్తానని నబమ్మబలికి రూ.80 వేలు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఆర్డర్ కాపీ ఇప్పించకపోవడంతో మోసపోయిన విషయాన్ని గ్రహించిన బాధితుడు చీరాల వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

భర్త కోసం భార్య.. తండ్రి కోసం కుమార్తె పూజలు

చీరాల, ఏప్రిల్ 18 : బరిలో ఉన్న అభ్యర్థుల విజయానికి వారి కుటుంబ సభ్యులు శ్రమిస్తు న్నారు. ఓ వైపు ప్రచారాలు, మరో వైపు పూజ ల్లో బిజీ బిజీగా కన్పిస్తున్నారు. టీడీపీ, జనసే, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ గెలుపు కోసం ఆయన సతీమణి తెన్నేటి శిరీష, ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య విజయం కోసం ఆయన కుమార్తె శివనారాయణదేవి తమవంతు పాత్రను పోషిస్తున్నారు. గురువారం పలుదేవాలయాల్లో వారు పూజలు నిర్వహించారు. కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవాలని కోరుకున్నారు. ఆయా సందర్భాల్లో పనిలో పనిగా స్థానిక ప్రజలు, భక్తులతో సైకిల్ గుర్తుపై ఓట్లేసి కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ముందుగా పట్టణంలోని పాపరాజు తోటలో ఉన్న సాయిబాబా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత పేరాల శివాలయం, సాయిబాబాగుడి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఎంపీగా టీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేగా కొండయ్య గెలుపొందాలని గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు చే యించారు. ఆ తరువాత మండల పరిధిలోని ఈపురుపాలెం రాములవారి ఆలయం లో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. తమ వారిని గెలిపించేందుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత డాక్టర్ సజ్జా హేమలత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాయిబాబా ఆలయంలో కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ భార్య శిరీష, ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య కుమార్తె శివ నారాయణదేవి పూజలు


గౌరీఅమర్‌నాథ్‌తో 18,19 వార్డుల యువకులు

సైకిల్‌కే ఓటేస్తాం

18, 19 వార్డుల్లో నూతనంగా ఓటు హక్కు పొందిన యువకులు

చీరాల, ఏప్రిల్ 18 : మొదటిసారిగా ఓటు హక్కు పొందాం. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కొండయ్యకే ఓటు వేసి సైకిల్ గుర్తును ఆదరిస్తామని 18, 19 వార్డుల యువకులు స్పష్టం చేశారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్‌ను నూతన ఓటర్లు కలిసి సంఘీభావం తెలిపారు. వారి మెడలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన అమర్‌నాథ్ కూటమి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమికే బీసీ సంఘం మద్దతు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18: రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు ఈ ఎన్నికల్లో బీసీ సంక్షేమ సంఘం మద్దతును ఎన్డీఏ కూటమికి ఇస్తుందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. గురువారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక బీసీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వచ్చినట్లన్నారు. జగన్‌రెడ్డి అస్తవ్యస్త పాలనతో రాష్ట్రం సంక్షోభంలో నిలిచిందని, చేతి వృత్తులైన బీసీలకు సముచిత స్థానం కల్పించి, వారి అభ్యున్నతికి కృషి చేయని వైసీపీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆదేశాల మేరకు టీడీపీ కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు రవి చంద్రాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శి ఎస్ఎస్‌పీ రాజు ఉన్నారు.


మాట్లాడుతున్న బీసీ సంఘ నేత రవికుమార్

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 18 : గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యద్దనపూడి గ్రామానికి చెందిన వృద్ధుడు ఉసుళ్ల బాబూరావు (65) బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ జీవీఎస్ చౌదరి గురువారం తెలిపారు. అతనికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ నెల 13 వతేదీన కడుపునొప్పితో బాధ పడుతున్న బాబూరావు ఇంటిలో ఎలుకలు మందు ఉన్న బిస్కట్లను తినడంతో అనారోగ్యానికి గురయ్యారు. అతనిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాబూరావు మృతి చెందారు. అతని భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి, మృతదేహానికి పోస్టు మార్టమ్ నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. గురువారం సాయంత్రం మృత దేహాన్ని యద్దనపూడి గ్రామానికి తీసుకువచ్చారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18: 108 అంబులెన్స్ వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి), పైలెట్ లేదా డ్రైవర్, అలాగే తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా మేనేజర్ పీ బాలకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చేసిన వారు ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. పైలెట్, డ్రైవర్ పోస్టులకు సంబంధించి తప్పని సరిగా 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు, హెవీ లైసెన్స్, 35 సంవత్సరాల కంటె తక్కువ వయస్సు కలిగి ఉండాలన్నారు. ఇంగ్లీష్ చదవడం, రాయడం తెలిసి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 21వ తేదీలోపు 108 కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు అందించాలన్నారు. లేదా 108 ఆఫీస్, రూమ్ నెంబరు 25, చీరాల గవర్నమెంట్ ఏరియా హస్పిటల్‌లో అందజేయాలన్నారు. వివరాలకు 8309530078, 8885107040 నెంబర్లును సంప్రదించాలని కోరారు.

మూణ్నాళ్ల ముచ్చటగా సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 18 : సాగర్ జలాలు వస్తున్నాయని.. మంచినీటి చెరువులు నిండి మన తాగు నీటి కష్టాలు తీరుతాయని గ్రామస్థులు ఎంతో ఆశపడ్డారు. అయితే వారి ఆశలు నీరుగారాయి. బుధవారం సాయంత్రానికే సాగర్ జలాల రాక ఆగిపోయింది. కేవలం మూడు రోజులు మాత్రమే జలాలు రావడంతో మంచి నీటి చెరువులకు అరకొరగా చేరాయి. మండలంలో మిగిలిన గ్రామాల పరిస్థితి కన్నా మేజరు పంచాయతీ మార్టూరు మంచి నీటి చెరువుకు ఈ వేసవిలో తాగు నీటి ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగర్ జలాలతో చెరువును నింపుకోవాలని రాజుపాలెం మేజరు నుంచి మార్టూరు చెరువు వరకు సాగర్ మైనరు కాలువను అక్కడక్కడా పంచాయతీ వారు మరమ్మతు పనులు చేశారు. వీలైనంత వేగంగా చెరువును నింపుకోవడానికి చెరువులో అదనంగా మోటార్లతో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ ముచ్చటగా మూడు రోజులు మాత్రమే నీళ్లు రావడంతో చెరువులకు ఒక మాదిరిగా కూడా సాగర్ జలాలు చేరలేదు. వాస్తవంగా 40 రోజుల పాటు నీరు వస్తేనే చెరువు నిండుతుంది. అలాంటిది కేవలం మూడు రోజులు మాత్రమే నీళ్లు రావడంతో చెరువులో చాలా తక్కువగా నీటి నిల్వలు కన్పిస్తున్నాయి. ఇక మండలంలో సాగర్ కాలువకు దగ్గరలో ఉన్న వలపర్ల, కోనంకి, జొన్నతాళి చెరువులకు ఒక మాదిరిగా సాగర్ జలాలు చేరాయి. అయితే ఎన్ఎస్‌పీ అధికారులు మరలా రెండు మూడు రోజులలో సాగర్ జలాలు వస్తాయని చెప్తున్నారు. ఏదిఏమైనా ఏమైనా ఈ వేసవిలో కొన్ని గ్రామాలలో తాగు నీటి ఇబ్బందులు తలెత్తే అవకాశంతో పాటు, గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉందని పరిసర గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.


మార్టూరు చెరువుకు అరకొరగా చేరిన జలాలు


టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

మార్టూరు, ఏప్రిల్ 18 : జాతీయ రహదారిపై మండల పరిధి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద హైవేపై వెళ్లే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఒంగోలు వైపు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎన్నికలు సందర్భంగా మద్యం, నగదును తదితర వాటిని పార్టీల నాయకులు, వ్యక్తులు అక్రమంగా తరలిస్తారన్న కారణంగా పోలీసులు వాహనాలను సోదా చేస్తున్నారు. ఎస్ఎస్ టీమ్ దయాసాగర్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ శ్రీహరి బృందంతో వాహనాల తనిఖీ ప్రక్రియ వారం రోజుల నుంచి చేస్తున్నారు.

పొగాకు దొంగతనాలపై రెండు కేసులు

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 18 : యద్దనపూడి మండలం గన్నవరం, చిమటావారిపాలెం గ్రామాలలో పొలాల్లో కర్ర పందిళ్లపై ఉంచిన పొగాకు కట్టలను గుర్తు తెలియని వ్యక్తులను దొంగిలించారని స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ జీవీఎస్ చౌదరి తెలిపారు. రెండు రోజుల కిందట గన్నవరంలో పత్తిపాటి రాంబాబు అనే వ్యక్తి పొలంలో రాత్రి సమయంలో రూ.లక్ష విలువైన 10 క్వింటాళ్ల పొగాకును, చిమటా వారిపాలెం లో టంకసాల వెంకటరత్నంకు చెందిన పొలంలో రూ.80 వేల విలువైన 8 క్వింటాళ్ల పొగాకును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారు. ఆ ఇద్దరు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాయమాటలతో బాలికపై లైంగిక దాడి

ఫోక్సో కేసు నమోదు

బల్లికురవ, ఏప్రిల్ 18 : రోజువారీ పనులకు వెళుతున్న బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడి చేసిన కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ జొన్నలగడ్డ అవినాష్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఆటో డ్రైవర్ జొన్నలగడ్డ అవినాష్ ఆటోలో రోజూ బాలిక కూలి పనులకు వెళుతోంది. 15వ తేదీన పనులకు వెళ్లిన బాలికను డ్రైవర్ ఇంటికి తీసుకురాకుండా ఇతర ప్రాంతానికి తీసుకు వెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మరుచటి రోజు బాలికను తీసుకొచ్చాడు. ఎక్కడికి వెళ్లావని బాలిక కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో విషయం చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమదు చేసినట్లు తెలిపారు.


వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 18 : యద్దనపూడి మండలంలో గురువారం మూడు గ్రామాలలో 12 మంది వలంటీర్లు రాజీ నామా చేసినట్లు ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తెలిపారు. యనమదలలో 7 గురు, పూనూరులో 4 గురు, పోలూరులో ఒకరు రాజీనామా చేసినట్లు తెలిపారు. మొత్తం 159 మందికిగాను 70 మంది రాజీనామా చేసినట్లు తెలిపారు. వలపర్లలో గురువారం 33 మంది వలంటీర్లు రాజీ నామా చేసినట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. దీంతో రాజీనామా చేసిన వారి సంఖ్య 136కు చేరిందని తెలిపారు. మొత్తం 368 మంది వలంటీర్లు ఉన్నారు.

బదిరుల పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ

పర్చూరు, ఏప్రిల్ 18 మండల పరిధిలోని నాగులపాలెం గ్రామంలోని బదిరుల పాఠశాలకు రొటేరియన్ కోదూరి సుబ్రహ్మణ్యాచారి సమకూర్చిన సీలింగ్ ఫ్యాన్‌లను గురువారం అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు చేతులమీదుగా ఫ్యాన్లను అందజేశారు. కొమ్మాలపాటి మనోజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా బదిర విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, పాటోలు ఉదయభాస్కర్, తోకల కృష్ణమోహన్, కాసా అశోక్ కుమార్, కోటా శ్రీనివాసరావు, మున్నంగి వెంకట సుబ్బయ్య, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.


బదిర విద్యార్థులతో రోటరీ సభ్యులు




సోమశిలలో 8.500 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఏప్రిల్ 18: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి ప్రాజెక్టులో 8.500 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 15, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ముసుగు తొలగింది!

ఇప్పటికే అనేక వర్గాలను తమ రాజకీయ స్వలాభం కోసం వినియోగించుకున్న వైసీపీ, ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కూడా అంతకుమించిన రీతిలో ఉపయోగించుకుంటోంది. ఎన్నికల ముందు వరకూ ప్రజలకు పారదర్శక సేవలు అందించేందుకు వలంటీర్లను నియమించామని చెబుతూ వచ్చిన ఆ పార్టీ నేతల అసలు వ్యూహం ఎన్నికల కోడ్ వచ్చాక బయటపడుతోంది. అటు వలంటీర్లను, ఇటు ప్రజలను చేసిన మోసం తేటతెల్లమవుతోంది. నిరుద్యోగుల జీవితాలను రాజకీయ ఆటలో బలిచేసి ఎన్నికల్లో గెలవాలన్న కుట్రలకు తెరలేపింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక భారీగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి రాజకీయ ప్రచారాల్లో ఉపయోగించుకుంటుండడమే ఇందుకు నిదర్శనం. సంక్షేమ పథకాలను పేదలకు అందించే క్రమంలో లబ్ధిదారులకు, వలంటీర్లకు మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ సంబంధాలను ఉపయోగించుకొని వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను భయపెట్టో, బెదిరించో ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి.



- రాజకీయ కూలీలుగా వలంటీర్లు
- బయట పడుతున్న వైసీపీ వ్యూహం
- ఎన్నికల కోసమే వాళ్లతో గొడ్డు చాకిరీ
- నేడు బలవంతంగా రాజీనామా చేయిస్తున్న నేతలు
- ఇప్పటికే 2,542 మంది రిజైన్

నెల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వలంటీర్ల రాజీనామాలు భారీగా కొనసాగుతున్నాయి. రోజు రోజుకూ రాజీనామా చేసేవారి సంఖ్య పెరుగుతోంది. కొంత మంది వైసీపీ సేవలో తరించేందుకు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తుండగా, మరికొంత మంది చేత మాత్రం వైసీపీ నాయకులు బలవంతంగా చేయిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ నాటికి అంటే ఎన్నికల నోటిఫికేషన్ ముందు రోజు వరకు 2,542 మంది వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. ఒక్క 16వ తేదీనే 349 మంది రాజీనామా చేయగా 17వ తేదీన మరో 99 మంది రాజీనామా చేయడం గమనార్హం. వీరికి అదనంగా మరో 27 మంది వలంటీర్లను అధికారులే తొలగించారు. వీరంతా రాజకీయ ప్రచారాల్లో పాల్గొనడమే కారణం. దీంతో మొత్తంగా ఎన్నికల కోడ్ వచ్చిన నెల రోజుల్లో 2,569 మంది వలంటీర్లు ఉద్యోగాలు వదిలేశారు. అత్యధికంగా కావలి అర్బన్‌లో 438 మంది, నెల్లూరు అర్బన్‌లో 223 మంది, విడవలూరులో 171, కొడవలూరులో 156, ఇందుకూరుపేటలో 192, దగదర్తిలో 112, బుచ్చిలో 146, కోవూరులో 156, రాపూరులో 87, ముత్తుకూరులో 91, వెంకటాచలం మండలంలో 95 మంది, ఆత్మకూరు రూరల్‌లో 104, ఆత్మకూరు అర్బన్‌లో 45, చేజర్లలో 70, పొదలకూరులో 90 చొప్పున రాజీనామాలు చేశారు. ఇంకా చాలా మంది రాజీనామాలు చేసి ఉన్నారు. ఆ దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

● అనుచరగణం ఉన్నా..

అధికార పార్టీ నేతలకు ఎంత అనుచరగణమున్నా, ఎన్ని ఆర్థిక వనరులున్నా ఎన్నికల్లో మాత్రం ప్రధానంగా వలంటీర్లపైనే ఆధారపడుతున్నారు. గ్రామ, వార్డుల పరిధిలో వలంటీర్లకున్న విస్తృత పరిచయాలు, ప్రభావం ఇతరులకు వుండడం లేదు. ప్రతి యాభై ఇళ్లకు ఒక వలంటీరు అందుబాటులో వుండడం, ఆ యాభై కుటుంబాలను తరచూ కలుస్తూ వుండడం, ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేస్తుండడం, ఇతరత్రా ప్రభుత్వ పనులకు కూడా జనం వారిపై ఆధారపడుతుండడం దీనికి కారణం. దీంతో ఏ కుటుంబం పరిస్థితి ఏమిటి? ఏ కులం లేదా ఏ మతం? ఎంతమంది ఓటర్లున్నారు? వారిలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నది ఎంతమంది? వారి నేపథ్యం? ఏ పార్టీకి సానుభూతిపరులు? వంటి సమాచారం వలంటీర్ల నుంచే రాబడుతున్నారు. వీటన్నింటికీ మించి ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులను, పార్టీ నేతలను కూడా వలంటీర్లే ప్రజలకు పరిచయం చేయాల్సిన పరిస్థితి. దీనికి మించి పంపకాలకు వలంటీర్లను మించిన నమ్మకమైన ప్రత్యామ్నాయం అధికార పార్టీ నేతలకు మరొకరు దొరకడం లేదు. ఈ అంశాలను దృష్టిలో వుంచుకుని అధికార పార్టీ నేతలు వలంటీర్లపైనే భారం వేస్తున్నారు. ఆ పనులు స్వేచ్ఛగా, నిరాటంకంగా జరగడం కోసం రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నారు. అయితే మరికొందరు వలంటీర్లు మాత్రం రాజీనామాలు చేసేందుకు ససేమిరా అంటున్నారు.

వలంటీరు ఉద్యోగానికి రూ.5 వేలు వేతనంగా నిర్ణయించినా అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. దానిని బట్టి నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వలంటీర్లుగా కొంతమంది వైసీపీ కార్యకర్తలను చేర్చగా మరికొంత మంది సామాన్య పేదలున్నారు. అయితే వైసీపీ అసలు వ్యూహం వలంటీర్లను ఎన్నికల సమయంలో ఉపయోగించుకోడమేనని మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. కానీ ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించడంతో వైసీపీ వ్యూహం బెడిసికొట్టింది. అయినా మరో అడ్డదారిలో వలంటీర్ల సేవలను

● నిరుద్యోగులతో ఆటలు

ఉపయోగించుకునేందుకు వారి చేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. వారిని తమ ప్రచార కార్యక్రమాల్లో తిప్పుకుంటూ పేదలకు వల వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. రాజకీయాల్లోకి తమను లాగొద్దని చాలా మంది వలంటీర్లు వేడుకుంటున్నా వారికి బెదిరింపులు ఎక్కువవుతున్నాయి. దీంతో ప్రశాంతంగా బతికే తాము స్థానికంగా ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు శత్రువులుగా మారిపోతున్నామంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి శబరి శ్రీరామక్షేత్రం బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 : నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రంలో కొలువైయున్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి మొదలవుతాయి. ఈ నెల 27వతేదీ వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయం పునఃనిర్మాణ ధర్మకర్త చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20వతేదీ రాత్రి అంకురార్పణ, 21 ఉదయం ధ్వజా రోహణ, హోమం, రాత్రి శేషవాహనంపై నగరోత్సవం, 22 ఉదయం హోమం, తిరుమంజనం, రాత్రి హనుమంతసేవ జరుగుతాయని తెలిపారు. 24 ఉదయం హోమం, మోహినీ ఉత్సవం, రాత్రి గరుడసేవ, గ్రామోత్సవం, 25 హోమం, తిరుమంజనం, రాత్రి సీతారాముల కల్యాణం, రాత్రి గజవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 26 ఉదయం హోమం, బలిహరణం, సాయంత్రం శ్రీరామకోటి స్థూపం ప్రాంగణంలో పారువేట ఉత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. 27వతేదీ రాత్రి పుష్పయాగం, పల్లకీసేవ, హారతులతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.



భక్తులకు దర్శనం ఇస్తున్న విష్వక్సేనులవారు

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు వైభవంగా అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 : నగరంలోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, సమస్త దేవతారాధన, మృత్సంగ్రహణం, హోమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, రాత్రికి శేషవాహన సేవ, నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో వీ గిరికృష్ణ పర్యవేక్షించారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం

డిప్యుటేషన్లపై చర్యలేవి ?

- వైద్యాధికారుల మౌనం
- నేడు డీఎంహెచ్‌వోలతో ప్రిన్సిపల్ సెక్రటరీ సమావేశం

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 18: వైద్యఆరోగ్యశాఖలో డిప్యుటేషన్ల రగడ కొనసాగుతూనే ఉంది. ఇష్టారాజ్యంగా వైద్యులను, ఉద్యోగులను మార్చిన అధికారులకు, ఆయా డిప్యుటేషన్ల రద్దు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరి కృష్ణబాబు నుంచి ఉత్తర్వులు అందాయి. అయితే ఆ ఉత్తర్వులను జిల్లాలోని వైద్యాధికారులకు పంపిన డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య డిప్యుటేషన్‌లో ఉన్న వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై వైద్య ఆరోగ్యశాఖలో తీవ్రంగా చర్చ జరుగుతుంది.

● నేడు సమావేశం

ఈ క్రమంలో శుక్రవారం విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాష్ట్రంలోని డీఎంహెచ్‌వోలతో సమావేశం నిర్వహించనున్నారు. డిప్యుటేషన్లపైనే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే జిల్లాలో డిప్యుటేషన్‌లో ఉన్న వారిలో ఎక్కువమంది విధులకు డుమ్మా కొట్టి తమ స్వంత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వైద్యులయితే ఏదో మొక్కుబడిగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి వస్తున్నట్లు ఉద్యోగ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఈ డిప్యుటేషన్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చేడాల్సి ఉంది.



కోవూరులో ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

సమరం ఆరంభం!

● ఎన్నికల నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్ల స్వీకరణ

నెల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి తెరలేచింది. కీలక సమరం ఆరంభమైంది. ఎన్నికల నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారులు గురువారం విడుదల చేశారు. ఉదయం 10:30 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయగా 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు ఆయా కార్యాలయాల్లో కూర్చున్నారు. పటిష్ట భద్రత మధ్య తొలిరోజు నామినేషన్ల స్వీకరణ మొదలైంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. తొలి రోజు మంచి ముహూర్తాలు ఉండడంతో ఎక్కువ మంది నామినేషన్లు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. మధ్యాహ్నం 12.30 గంటల్లోపే దాదాపుగా అభ్యర్థులందరూ నామినేషన్లను ఆర్వోలకు అందజేశారు. 8 అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ ఐదింటికి తొలిరోజు నామినేషన్లు దాఖలయ్యాయి. కోవూరులో ప్రధాన పోటీదారులైన టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు నామినేషన్లు వేశారు. ప్రసన్నకు డమ్మీగా ఆయన కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు. కావలిలో వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా రామిరెడ్డి ఆదిలక్ష్మి కూడా నామినేషన్ వేశారు. నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తరపున మాజీ మేయర్ ఎస్.భానుశ్రీ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరిలలోనూ నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇక నెల్లూరు పార్లమెంటు స్థానానికి తొలిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) తరపున ఎస్‌కే మాబు నామినేషన్ వేశారు. మొత్తంగా తొలి రోజు ఒక పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పది మంది అభ్యర్థులు 15 సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు అందజేయడం విశేషం. కాగా నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రానికి వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ పరిధిలోకి నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు ఐదుగేనిరి మించి అనుమతించడం లేదు.

తొలిరోజు దాఖలైన నామినేషన్లు

నియోజకవర్గం	అభ్యర్థి	పార్టీ	సెట్లు
నెల్లూరు (ఎంపీ)	ఎస్‌కే మాబు	ఆర్పీఐ	1
కోవూరు	వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి	టీడీపీ	2
కోవూరు	నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	వైసీపీ	2
కోవూరు	నల్లపురెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి	వైసీపీ	2
కావలి	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి	వైసీపీ	2
కావలి	రామిరెడ్డి ఆదిలక్ష్మి	వైసీపీ	2
కావలి	గుంజి వెంకటేశ్వర్లు	బీఎస్పీ	1
నెల్లూరు రూరల్	కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి	టీడీపీ	1
ఆత్మకూరు	నెల్లూరు కృష్ణారెడ్డి	యుగతులసి పార్టీ	1
ఉదయగిరి	చెరుకూరి వేణుగోపాల్	స్వతంత్ర	1

ఏడు కేసుల్లో నిందితుడిగా రామిరెడ్డి ప్రతాప్

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : కావలి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఏడు కేసులున్నాయి. అందులో ఆరు కేసులు కల్తీ మద్యం పంపిణీ కేసులే కావడం గమనార్హం. ఈ కేసుల వివరాలను ఆయన తన నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2014 ఎన్నికలప్పుడు ఇతర రాష్ట్రాల్లో తయారు చేసిన కల్తీ మద్యాన్ని జిల్లాలో పంపిణీ చేశారని కేసులు నమోదయ్యాయి. నాసిరకమైన మద్యాన్ని తయారు చేయడం, వాటికి ప్రత్యేక లేబుళ్లు వేయడం, ఎలాంటి ఎక్సైజ్ డ్యూటీ చెల్లించకుండా ఎన్నికల సమయంలో పంపిణీ చేయడం వంటి అభియోగాలపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కావలి ఎక్సైజ్ స్టేషన్‌లో 2014-15లో క్రైమ్ నెంబర్లు (పీఆర్ నంబర్) 17, 19, 20, 21, 23, 24లతో ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ బాధ్యతలను అప్పటి ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. విచారణ పూర్తి చేసిన సీఐడీ కోర్టులో చార్జ్‌షీట్‌లు దాఖలు చేసింది. ప్రస్తుతం నెల్లూరులోని రెండవ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసులు విచారణలో ఉన్నాయి. మొదటి కేసులో రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఏ12గా, రెండో కేసులో ఏ9గా, మూడో కేసులో ఏ9గా, నాలుగో కేసులో ఏ9గా, ఐదో కేసులో ఏ12గా, ఆరో కేసులో ఏ11గా ఉన్నారు. వీటితోపాటు కావలి ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 49/2019గా నమోదైన కేసులో కూడా నిందితుడిగా ఉన్నారు. ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన కేసు కాగా, ఇది ప్రస్తుతం విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు విచారణలో ఉంది.

● ప్రతాప్ ఆస్తులు ఇవే...

ఇక ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబ ఆస్తులు కూడా భారీగానే ఉన్నాయి. ఆయనకు రూ.94.67 కోట్ల చరాస్తులు, ఆయన సతీమణికి రూ.34.27 కోట్ల చరాస్తులు ఉన్నాయి. అలానే ప్రతాప్ కుమార్‌రెడ్డి పేరుపై రూ.72.02 కోట్ల స్థిరాస్తులు, ఆయన సతీమణి పేరుపై రూ.36 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే ప్రతాప్‌కుమా ర్‌రెడ్డికి రూ.40.14 కోట్ల అప్పులు, ఆయన సతీమణికి రూ.13.81 కోట్ల అప్పులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వివరించారు.

కోవూరు అభ్యర్థుల ఆస్తులు ఇవిగో...

కోవూరు, ఏప్రిల్ 18: కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డిలు ఎన్నికల అఫిడవిట్‌లో తమ ఆస్తుల వివరాలను పొందుపరచారు. తమపై ఎలాంటి కేసులు లేవని ప్రమాణపత్రంలో వారు పేర్కొన్నారు. ప్రశాంతిరెడ్డికి వివిధ బ్యాంకుల్లో రూ 46,94,59,995, తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి రూ.464,43,20,644 నగదు ఉన్నట్లు వివరించారు. ప్రశాంతిరెడ్డికి రూ.30,11,93,087 విలువ చేసే పొలాలు, భవనాలు ఉన్నట్లు చూపారు. ప్రభాకరరెడ్డికి రూ.174,83,48, 539 విలువ చేసే పొలాలు, భవనాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రశాంతిరెడ్డికి రూ.43,48,11,682 రుణాలు, వీపీఆర్‌కు రూ.153,81,50,921 రుణాలు ఉన్నట్లు వివరించారు. ప్రశాంతిరెడ్డికి రూ.6,52,372 విలువచేసే హోండా కారు ఉందని పేర్కొన్నారు. కాగా ఆమె తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు.

● ప్రసన్న ఆస్తుల వివరాలు..

ఇక వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆస్తి రూ.1,05,41,523గా పేర్కొన్నారు. ఆయన భార్య గీతమ్మకు రూ.54,85,618, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ.1,45,08,788, కోడలు పూజారెడ్డికి రూ.39,27,666 ఆస్తులు ఉన్నట్లు వివరించారు. ప్రసన్నకు రూ.9.6 కోట్లు విలువ చేసే పొలం, స్థలాలు, ఆయన భార్య గీతమ్మకు రూ.2.5కోట్లు, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ. 3.3కోట్లు, కోడలు పూజారెడ్డికి రూ.1,72,40,000 విలువ చేసే పొలం, స్థలాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రసన్నకు రూ.1,87,66,272, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ. 1,57,34,838 అప్పులు ఉన్నట్లు తెలిపారు. ప్రసన్నకు రూ.15 లక్షల విలువ చేసే మూడు కార్లు, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ.7.5 లక్షలు విలువచేసే నాలుగు వాహనాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా ప్రసన్నకుమార్ రెడ్డి బీఏ పట్టభద్రుడు.

కోవూరులో స్వల్ప ఉద్రిక్తత

కోవూరు : కోవూరు రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు రావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దాదాపు ఒకే సమయంలో నామినేషన్ వేసేందుకు వచ్చారు. ఎన్నికల కార్యాలయం లోకి అనుమతించే విషయమై ఇరు పార్టీల నాయకుల మధ్య వివాదం చెలరేగింది. అయితే, పోలీసులు ఇరువర్గాలను పక్కకు నెట్టేశారు. ఇద్దరు టీడీపీ కార్యకర్తలను పోలీసులు లాఠీలతో కొట్టి పక్కకు నెట్టారు. మరోవైపు తమను ఎన్నికల కార్యాలయంలోనికి అనుమతించాలని కోరుతూ బీజేపీ జిల్లా నాయకుడు సురేంద్రరెడ్డి నాయకత్వంలో పలువురు కార్యకర్తలు సీఐ శ్రీనివాసరావును నిలదీశారు.



కోవూరులో లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులు

జన కేతనం

ప్రలోభాలకు గురి చేస్తున్నారా.. అయితే ఫోన్ చేయండి!

తక్షణమే చర్యలు తీసుకుంటాం!

పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు : ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి నగరంలో వాహనాల తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ గురువారం దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ తనిఖీ, సెబ్ అధికారులతో సమావేశం, కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభించారు. పోలీసు కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు వివరాలను ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరుగుతున్నా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా వెంటనే కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. కంట్రోల్‌రూమ్ ఫోన్ నెంబర్లు 9440796385, 9392903413, 0861-2328400లకు నేరుగా ఫోన్‌చేసినా, ఫొటోలు పంపినా తక్షణమే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని 9వేల మందిని ముందస్తు బైండోవర్ చేశామన్నారు. మద్యం, నగదు అక్రమరవాణా, అనధికార విక్రయాలు, నిల్వలు, పంపిణీ పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులు, 26 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్‌టీమ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.

మద్యం నిల్వలపై నిఘా

జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో సెబ్ అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నియమావళికి లోబడి విధులు నిర్వహించాలని హెచ్చరించారు. జిల్లాలో నాటుసారా, గంజాయి, మద్యం అక్రమ నిల్వలు, రవాణాను గుర్తించి ఆకస్మిక దాడులు నిర్వహించి సీజ్ చేయాలన్నారు. పొరుగు మద్యం జిల్లాలోకి రాకుండా చెక్‌పోస్టుల్లో క్షుణ్ణంగా తనిఖీ చేయడంతోపాటు సరిహద్దు స్టేషన్లలో గట్టిగా నిఘా ఉంచాలని ఆదేశించారు. స్థానిక పోలీసులు సెబ్ అధికారులు సమన్వయంతో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

24న తుది ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్ పక్కనే ఎస్పీ, ట్రైనీ కలెక్టర్

నెల్లూరు (వ్యవసాయం) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను పరిష్కరించి 24వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో రాజకీయ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 20,53,397 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. ఓటు నమోదు కోసం వచ్చిన ఫామ్-6, ఓట్ల బదిలీ కోసం వచ్చిన ఫామ్-8 దరఖాస్తులను పరిష్కరించి 24న తుది జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. ఇక 25వ తేది నామినేషన్లకు ఆఖరని 26న పరిశీలన ఉంటుందని తెలిపారు. 27, 28వ తేదీ సెలవు రోజులు కాబట్టి 29వతేదీ ఒక్కరోజు మాత్రమే ఉపసంహరణకు గడువు ఉంటుందని వెల్లడించారు. అదేరోజు మధ్యాహ్నం అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని తెలిపారు. నామినేషన్లు ప్రారంభమైనప్పటి నుంచి ఖర్చులన్నీ లెక్కల్లోకి వస్తాయని సెక్షన్ 127-ఎ ప్రకారం పత్రికల్లో ఇస్తున్న ప్రకటనలకు తప్పనిసరిగా పబ్లిషర్ పేరును ముద్రించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

● జూన్ 6వ తేదీ వరకు కోడ్

జూన్ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ హరినారాయణన్ స్పష్టం చేశారు. ఇక నామినేషన్ల స్వీకరణ తొలిరోజున నెల్లూరు పార్లమెంటు స్థానానికి ఒకటి, 8 నియోజకవర్గాలకు 9మంది అభ్యర్థులు 14 నామినేషన్లు వేయడం జరిగిందని తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో గురువారం ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌తో కలిసి ఆయన విలేకరుతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.1.78 కోట్ల నగదు సీజ్ చేయడం జరిగిందని చెప్పారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఇప్పటికే జిల్లాకు వచ్చారని సాధారణ పరిశీలకులు, పోలీసు పరిశీలకులు ఈ నెల 24న జిల్లాకు వస్తారని వెల్లడించారు.

కావలి కందుకూరు

ఓగూరు ఎస్సీ కాలనీలో టీడీపీలోకి వలసలు



టీడీపీలో చేరిన ఓగూరు ఎస్సీ కాలనీ వైసీపీ కార్యకర్తలు

కందుకూరు, ఏప్రిల్ 18: మండలంలోని ఓగూరు ఎస్సీ కాలనీలో పలు కుటుంబాల వారు వైసీపీని వీడి గురువారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఒంగోలు డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. పల్లె రఘుబాబు, రవిబాబు, మేడికొండ మనోజ్‌కుమార్, మెడబలిమి మధుబాబు, మాధవరావు, బల్లికూర తిరుపతిస్వామి, గొర్రెముచ్చు శ్రీను, బూసి రవితేజ, ఏపూరి సింగయ్య, కార్తీక్ సహా పలు కుటుంబాల వారు టీడీపీలో చేరగా వారికి నాగేశ్వరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్సీకాలనీ టీడీపీ నాయకులు ఏపూరి మాలకొండయ్య, కొండలరావు, బల్లికూర వెంకటేశ్వర్లు, ఏపూరి మాలకొండయ్య, అంద్రా మాల్యాద్రి, గ్రామపార్టీ నాయకులు అల్లం వెంకటేశ్వర్లు, గుళ్లా శ్రీనివాసులు, రాయపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

17, 18 వార్డులలో ఇంటింటి ప్రచారం

టీడీపీ కూటమి అభ్యర్థులైన ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను గెలిపించాలని కోరుతూ నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య ఆధ్వర్యంలో పట్టణంలోని 17, 18 వార్డులలో గురువారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బంగారమ్మ గుడి ప్రాంతంలో స్థానిక పార్టీ నాయకులు, మహిళలతో కలిసి ఇంటింటికి తిరిగి రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. తెలుగుదేశం పార్టీ మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, దివి శ్రీనివాసులు, నగర జయకృష్ణ, ముచ్చు శ్రీను, జొన్నాదుల రాఘవయ్య, షేక్ ఫిరోజ్, కాకుమాని మాల్యాద్రి, అమర రామలింగయ్య, అత్తంటి మాధవరావు, దివి వెంకటేశ్వర్లు, జంపాల శ్రీకాంత్, బెల్లం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు ఏవి జగనన్నా..!?

- బియ్యం పంపిణీకే పరిమితం
- అప్పుడప్పుడు చక్కెర, కందిపప్పు, గోధుమపిండి
- మిగిలిన సరుకులపై అమలుకాని హామీ

కొండాపురం, ఏప్రిల్ 18: రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు చౌకధరల దుకాణాల ద్వారా ఇం టికి అవసరమయ్యే అన్నిరకాల నిత్యావసర స రుకులు రాయితీపై అందిస్తామని చెప్పిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదు. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం మాత్రమే రెగ్యులర్‌గా పం పిణీ జరుగుతోంది. చక్కెర, కందిపప్పు, గోధుమపిండి అప్పుడప్పుడు పంపిణీ చేస్తున్నారు. ఇతర వస్తువులు ఏవీ పంపిణీకి నోచుకోవడం లేదు. దీంతో గత ఎన్నికల సమయంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నీటిమీద రాతలగా మారాయి. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 34 చౌకధరల దుకాణాలు ఉండగా 12,533 బియ్యం కార్డులున్నాయి. లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి సరుకుల పంపిణీకి మండలానికి 8 వాహనాలను కేటాయించారు. ఇందులో గొట్టిగుండాల, గొట్టిగుండాలపా లెం, ఉప్పలూరు పంచాయతీలకు చెందిన వాహనం మరమ్మతులకు గురవ్వడంతో నిలిచిపోయింది. ఆయా గ్రామాల లబ్ధిదారులు దుకాణం వద్దకే వెళ్లి బియ్యం తీసుకొంటున్నా రు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి, మంత్రులు చౌకధరల దుకాణాల ద్వారా ఇంట్లో వినియోగించే నిత్యావసర సరుకులన్నీ రాయితీపై అందిస్తామని చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మంత్రుల ప్రకటనలు వింటున్న లబ్ధిదారులు ఆ సరుకులన్నీ ఎందు కు తేవట్లేదని పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లపై ఎదురుదాడికి దిగుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తే మేము తీసుకువచ్చి ప్రజలకు చేరవేస్తామని ఆపరేటర్లు అంటున్నారు. ఇటీవల వరకు బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు, గోధమపిండి తదితర వస్తువులు మాత్రమే రాయితీపై ఇస్తుండగా రెండు, మూడు నెలలుగా అవికూడా ఇవ్వలేదు. ఈ నెలలో మాత్రం బియ్యంతో పాటు చక్కెర పంపిణీ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బియ్యంతోపాటు చక్కెర, గోధుమపిండి, కందిపప్పు తదితర నిత్యావసరాలు రాయితీపై సరఫరాచేసి పేదలను అందుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను వివరణకోరగా ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో ఈనెల ఒక్క బియ్యం, చక్కెర మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు.



గ్యాస్ గోదాముల వద్ద భద్రతా నియమాలు పాటించాలి

కావలి రూరల్, ఏప్రిల్ 18: పట్టణంలోని ప్రతి గ్యాస్ గోదాము వద్ద భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించాలని అగ్నిమాపక అధికారి రామసిద్ధార్థ పేర్కొన్నారు. పట్టణంలోని జేమ్స్ హెచ్‌పీ గ్యాస్ గోదాము, ప్రశాంతి ఫిల్లింగ్ స్టేషన్ సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామసిద్ధార్థ మాట్లాడుతూ గ్యాస్ గోదాముల వద్ద, పెట్రోల్ బంకుల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ, పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్యాస్ గోదాము సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

కలిగిరి, ఏప్రిల్ 18: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం త్రైతశకం-46 క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్‌ను ఎంపీడీవో రంగసుబ్బరాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జీ.ప్రసాద్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా రూపొందించారన్నారు. భగవద్గీత శ్లోకముల సారాంశములతోపాటు నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలు ఇందులో పొందుపరచారన్నారు. అనంతరం క్యాలెండర్లను పోలీసు, రెవెన్యూ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు జి సుధాకర్, వై మహేంద్ర, డి మధు, ఎన్ వెంకటేశ్వర్లు, డి రమణమ్మ, రమణయ్య, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి రథోత్సవం

అల్లూరు, ఏప్రిల్ 18 : అల్లూరుపేటలో వెలసిన సీతా లక్ష్మణ హనుమత్సమేత కోదండరాముడి రథోత్సవం వైభవంగా జరిగింది. రామమందిరంలో జరుగుతన్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో సీతారాములను దర్శించుకునేందు ప్రముఖులు తరలివచ్చారు. జై.. శ్రీరామ్.. నినాదాలతో రథాన్ని స్థానిక యువత సునాయాసంగా లాగారు. అతనంతరం అడుగడుగునా భక్తులు రథానికి నీరాజనాలు పలికారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



అల్లూరులో రథంపై ఊరేగుతున్న సీతా లక్ష్మణ హనుమత్సమేత కోదండరాముడు

చంద్రబాబుతోనే మాదిగల జీవితాల్లో వెలుగులు

- ఆదిఆంధ్ర కాలనీల్లో పర్యటించిన ఎంఆర్‌పీఎస్ నేతలు

లింగసముద్రం, ఏప్రిల్ 18 : షెడ్యూల్ కులాల వర్గీకరణ సమస్య పరిష్కారం కావాలన్నా, మాదిగల జీవితాల్లో వెలుగులు నింపాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ, ఎంఎస్సీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాసు మాదిగ చెప్పారు. గురువారం వారు మండలంలోని వీఆర్ కోట, చీమలపెంట, జంపాలవారిపాలెం, మొగిలిచెర్ల, గంగపాలెం, ఆర్‌ఆర్ పాలెం గ్రామాల్లోని ఆదిఆంధ్ర కాలనీల్లో పర్యటించి తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చదలవాడ కిట్టు మాదిగ, అవినాష్, అజయ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

పీహెచ్‌సీలో అదనపు డీఎంహెచ్‌వో తనిఖీ

బిట్రగుంట, ఏప్రిల్ 18: బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. 104 మొబైల్ వాహన నిర్వహణ, వైద్యశాల, ల్యాబ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లెప్రసీ, హెచ్‌ఐవీ, టీబీ వ్యాధులపై వైద్యాధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు జీ.హారిక, నిత్యప్రశాంతి, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

వైసీపీ ప్రభుత్వంలో పేదలు నలిగిపోయారు..!

అల్లూరు, ఏప్రిల్ 18 : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో పేదలు నలిగిపోయారని టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరు నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తుమోపూరులో గురువారం ఆయన ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదో చేసేస్తారని నమ్మి వైసీపీకి ఓట్లు వేసిన పేదలు నేడు కట్టుబట్టలతో నిలబడ్డారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో గిరిజన, చల్లా యానాదుల జీవనం క్షీణ దశకు చేరుకుందన్నారు. జీవన వ్యయం తీవ్రంగా పెరిగిపోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన చెందారు. అన్ని రాష్ట్రాలకంటే ముందంజలో ఉండేలా రాజధాని నిర్మిస్తానని నమ్మించి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్ అసలు రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విడవలూరు దశరథరామిరెడ్డి, మేడా మల్లారెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నార్తుమోపూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు ప్రయోజనం

- తీరప్రాంత గ్రామాల్లో కావ్య ప్రచారం

కావలి, ఏప్రిల్ 18: టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు ప్రయోజనం చేకూరిందని ఎన్డీఏ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి చెప్పారు. కావలిరూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీలోని పలు గ్రామాలలో గురువారం ఆయన స్థానిక నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకు లు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, బీజేపీ నేత జీ.భరత్ కుమార్, జనసేన నేత తిరుపతిస్వామి పాల్గొన్నారు.

కావలిని అవినీతికి అడ్డాగా మార్చారు

కావలిటౌన్ : ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి కావలిని అవినీతి, అసాంఘికాలకు అడ్డాగా మార్చారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఆరోపించారు. ముసునూరులోని తన నివాసం వద్ద కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనతో ప్రజలు విసిగి చెందారని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు.

నేడు నామినేషన్ : ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం ఉదయం 12-20 గంటలకు తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సూచనలతో ఉదయం 9-30 నిమిషాలకు ముసునూరులోని తన నివాసంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు కిషోర్, బాబురావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, అలేఖ్య, మన్నవ రవిచంద్ర, బీజేపీ నేతలు భరత్, బ్రహ్మానందం, జనసేన నేతలు పబ్బాసాయి, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

తొలిరోజు మూడు నామినేషన్ల దాఖలు

కావలి, ఏప్రిల్ 18: కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి తొలిరోజు గురువారం ముగ్గురు నేతలు 5 సెట్ల నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో కావలి రిటర్నింగ్ అధికారి శీనానాయక్‌కు అందజేశారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వైసీపీ పేరుతో 2 సెట్లు, రామిరెడ్డి ఆదిలక్ష్మి వైసీపీ పేరుతో 2 సెట్లు నామినేషన్లను దాఖలు చేశారు. గుంజి శ్రీనివాసులు బహుజన సమాజ్ పార్టీ పేరుతో ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

కావలిటౌన్ : వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గురువారం ఉదయం స్థానిక కలుగోళ శాంభవి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాయానికి వెళ్లి నామినేషను వేశారు. ఆయన వెంట ఎంపీ బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి

కందుకూరు, ఏప్రిల్ 18: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షేక్ గౌస్ మొహిద్దీన్ విజయం కోసం సీపీఎం, సీపీఐ కార్యకర్తలు, నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో అభ్యర్థి గౌస్ మొహిద్దీన్‌తో కలిసి సీపీఐ నాయకులు పి.మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, సీపీఎం నాయకులు ఎస్‌ఏ గౌస్, జి.వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్ తదితరులు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సీహెచ్ నరేష్, ఆనంద్‌మోహన్, బాలబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేద్దాం

కలిగిరి, ఏప్రిల్ 18: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ వింజమూరు తాలూకా సమావేశం స్థానిక పీహెచ్‌సీలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరు జిల్లా హంస యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా కప్పా నారాయణరాజు (హెల్త్ అసిస్టెంట్, కలిగిరి), వింజమూరు తాలూకా ప్రెసిడెంట్‌గా ఎస్ చెంచురామయ్య (సీహెచ్‌ఓ, కొండాపురం, పీహెచ్‌సీ) సెక్రటరీగా సక్కుబాయమ్మ(పీహెచ్‌ఎన్, కలిగిరి), ట్రెజరర్‌గా డీ దొరసానమ్మ(స్టాఫ్ నర్స్, కలిగిరి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్ సాయిలక్ష్మి(సీహెచ్‌ఓ, కలిగిరి), పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్ తిరుపతిరావు(ల్యాబ్ అసిస్టెంట్, కలిగిరి)తోపాటు 20మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏపీ హంస మెడికల్ యూనియన్‌కి ప్రభుత్వ గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డికి, హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, నెల్లూరు జిల్లా హంస జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకర్, జనరల్ సెక్రటరీ బీ కమల్‌కిరణ్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే జలీల్, తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు!

అల్లూరు, ఏప్రిల్ 18: విద్యుత్ సరఫరాను నియంత్రించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. మండల కేంద్రమైన అల్లూరులో అక్కడక్కడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు తగ్గిపోయి ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయి. అల్లూరు వాటర్ ప్లాంట్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గిపోయి ఉండడంతో అక్కడ నిత్యం పశు సంచారం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా వేణుగోపాల స్వామి దేవాలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. అదేవిధంగా ఆర్‌డిఆర్ కాలనీలో పాఠశాలకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ప్రమాదానికి గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటిని మరమ్మతులు చేపట్టి ప్రమాదం లేకుండా చూడాలని తల్లిదండ్రులు, రైతులు కోరుతున్నారు.



వేణుగోపాలస్వామి ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉలవపాడు యువకుడికి రుయాలో అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 18: తిరుపతిలోని రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాక అరుదైన శస్త్ర చికిత్స చేసి ఓ యువకుడి ప్రాణాలు కాపాడామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. గురువారం ఆ వివరాలను తెలిపారు. నెల్లూరు జిల్లా ఉలవపాడుకు చెందిన ఆనంద్‌బాబు(26) చిన్నతనం నుంచి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. ఏ ఆస్పత్రిలో చూపించినా నయం కాకపోవడంతో కుటుంబీకులు అతడిని రుయాస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడి ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్బారావు పరీక్షించగా, ఊపిరితిత్తులో చీముతో కూడిన గడ్డలు (డెకార్టికేషన్ ఆఫ్ లంగ్) ఉన్నట్లు గుర్తించారు. ఇది అరుదుగా వచ్చే వ్యాధి అని తేల్చారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి కళ్యాణి రమ, అనస్థీషియా విభాగాధిపతి రాధా ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదో తేదీన మినీ థొరకాటమీ (చిన్నపాటి రంధ్రం) పద్ధతిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ పద్ధతిలో శస్త్ర చికిత్స చేయడం వల్ల రోగి రోజుల వ్యవధిలోనే కోలుకుంటాడని సూపరింటెండెంట్ తెలిపారు. ప్రస్తుతం యువకుడు కోలుకోవడంతో ఆయన్ను డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు. అరుదైన సర్జరీని విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు, ఏఆర్ఎంవో హరికృష్ణ, క్లినిక్ పర్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కోలుకున్న యువకుడితో రుయా అధికారులు

27న పాలిసెట్ పరీక్ష

కావలి రూరల్, ఏప్రిల్ 18: ఈ నెల 27వ తేదీన పాలిసెట్-2024 పరీక్షలు నిర్వహించనున్నట్లు రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సుశీల్ కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల, కావలి పట్టణం ఉదయగిరిరోడ్డులోని విశ్వోదయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్లు ఇంటర్నెట్ సెంటర్‌లో, లేదా రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో తీసుకోవచ్చని తెలిపారు. పరీక్షల ప్రిపరేషన్‌కు విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కోచింగ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కోచింగ్‌కు హాజరయ్యే 91 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9642255592, 9949022772, 9440707944ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కిలో పొగాకు రూ.246

కలిగిరి, ఏప్రిల్ 18: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 771 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 640 బేళ్లు కొనుగోలు చేశారు. నో బిడ్-100, ఆర్‌ఆర్-6, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-12 కారణాలతో 131 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.246, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.226.90గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

దుండిగంలో టీడీపీ నేతల ప్రచారం

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 18: దగదర్తి మండలం దుండిగం పంచాయతీ, ఎన్టీఆర్ నగర్‌లలో గురువారం ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలన నుంచి విముక్తి కావాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. ఉమ్మడి పార్టీలు బలపరుస్తున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారు. కాగా కిడ్నీ సమస్యతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వెలిపోడు గ్రామానికి చెందిన షేక్.షాహీరను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు శ్రీహరి, ఖాజారహమతుల్లా, ఫైరోజ్ తదితరులు ఉన్నారు.

సీపీఎం నేత మృతికి సంతాపం

బిట్రగుంట, ఏప్రిల్ 18: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటకు చెందిన సీపీఎం ఏతదానం(68) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య సందర్శించి పూలమాలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఆయన వెంట తాళ్లూరు మాల్యాద్రి, గడ్డం వెంకయ్య, శేషాద్రి, కాటయ్య ఉన్నారు.

పరిశుభ్రతకు తిలోదకాలు!

- వాటర్ ట్యాంకుల్లో చేపట్టని క్లోరినేషన్
- అధికారుల పర్యవేక్షణ కరువు
- దుర్వినియోగమవుతున్న నిధులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 18 : ప్రజలకు రక్షిత నీటిని అందించే లక్ష్యంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంకుల పరిశుభ్రతను గాలికొదిలేశారు. దీంతో ఆరోగ్య కరమైన తాగనీటికి బదులు కలుషిత నీరు సరఫరా అవుతోంది. నీరు నిల్వ చేసే ట్యాకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తుండడంతో ప్రజలు రోగాలు భారిన పడుతున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. వీటిని పర్యవేక్షించే నాథుడే లేడు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని 36 గ్రామాల్లో 38 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీరు పరిశుభ్రంగా ఉందానేది ప్రశ్నార్థకంగా మారింది. పథకం ప్రారంభించే సమయాల్లో ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వం తర్వాత పూర్తిస్థాయిలో పథకం అమలు తీరును విస్మరిస్తోంది. కొన్ని చోట్ల నెలలు తరబడి ట్యాంకులను శుభ్రం చేయని పరిస్థితులు ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్నిచోట్ల మొక్కుబడిగానే క్లోరినేషన్ జరుగుతుందన్న విమర్శలున్నాయి.

నిబంధనల ప్రకారం...

రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను ప్రతినెలా 15 నుంచి 30 రోజుల్లో శుభ్రం చేయాలి. పంచాయతీ కార్యదర్శి లాక్‌బుక్ ట్యాంక్ శుభ్రం చేసిన తేదీ, మళ్లీ శుభ్రం చేయాల్సిన తేదీని విధిగా నమోదు చేయాలి. ట్యాంక్ ఆ నెలలో శుభ్రం చేయించినట్లు అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి సంతకాలు చేయాలి. కానీ గ్రామాల్లో ట్యాంకులు శుభ్రం చేయకుండానే శుభ్రం చేయిస్తున్నట్లు వీరితో సంతకాలు చేయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే శుభ్రం చేస్తున్న దాఖలాలు మాత్రం లేవు. ఈ క్ర మంలో శుభ్రత కోసం వినియోగించాల్సిన నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నా యి.

● క్లోరినేషన్ ఊసే లేదు

గ్రామాల్లో ట్యాంకులను పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రతి 20 రోజులకొకసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి ఓపెన్ లెవల్ మోతాదుకు మించకుండా బ్లీచింగ్ వేయాలి. ఇది ఎక్కడా అమలు కావడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించి పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అంకభూపాలపురంలో క్లోరినేషన్‌కు నోచని వాటర్ ట్యాంక్



కలువాయి : దాచూరులో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఓటరు అనే నేను...

ప్రతిఒక్కరూ ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలని అధికారులు ఓటర్లను చైతన్యవంతులు చేస్తున్నారు. అందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఓటుహక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని ప్రతిజ్ఞ చేయించారు. శుక్ర, శనివారాల్లో కూడా ఎస్సీ కాలనీల్లో ఓటర్లను చైతన్యవంతులు చేసే కార్యక్రమం చేపడతామని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు.

- కలువాయి

అభ్యర్థి ఖర్చుకు చందాలేసి ఇచ్చేటోళ్లం!

మా రోజుల్లో



మా కాలంలో ఎలచ్చన్లకు.. ఇప్పుడు ఎలచ్చొన్లకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందయ్యా. అప్పట్లో ఇప్పటిలాగా మైకాల మోతల్లేవ్.. కరపత్రాల పంపిణీ లేదు.. గిర్రుగిర్రున తిరిగే కార్లూ లేవు. ప్రజలకు డబ్బులు ఇచ్చే చేసే ఆనవాయితీ లేదు. సేవాగుణం, పేరు ప్రఖ్యాతలు, కుటుంబ నేపథ్యం ఉన్న వ్యక్తులే పోటీలో నిలబడేవారు. ప్రజలు కూడా గ్రామపెద్ద సూచించిన వ్యక్తికే గుత్తగా ఓట్లు వేసి మాట మీద నిలబడేవారు. అభ్యర్థుల ఖర్చు కూడా రూ.వేలల్లో ఉండేది. కొన్ని గ్రామాల్లో ప్రజలే చందాలు వేసుకొని పోటీలో నిలబడ్డ వ్యక్తికి డబ్బులు ఇచ్చేటోళ్లు. కానీ ఇప్పుడంతాలేదు. ఎన్నికలంటేనే డబ్బుమయంగా మారి పోయింది. ఆర్థిక నేరస్థులు, రౌడీలు, హత్య కేసుల్లో నిందితులు సైతం ఎలచ్చన్లో నిలబడతా ఉండారు. ఇవన్నీ ప్రజలు గమనించాలి. భావితరాలను గుర్తు చేసుకుని అభివృద్ధి చేసేటోళ్లనే గెలుపుపించుకోవాలి.

- గూడూరు శివరామయ్య (90), గండిపాళెం, ఉదయగిరి మండలం

విజ్ఞతతో ఆలోచించి ఓటేద్దాం

యువగళం



ఎన్నికల షెడ్యూలు విడదలైన నాటి నుంచి తొలి ఓటు వేస్తున్నాననే ఆలోచన సంతోషం కలిగిస్తోంది. నేను బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. చదువుకున్న యువత విజ్ఞతతో ఆలోచించి రాష్ట్రాభివృద్ధికి పాటు పడే వారికి ఓటు వేస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుంది. గడిచిన ఐదేళ్లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. చదువుకోసమే కాదు.. ఉపాధి కోసమూ బయట రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆశలు పెట్టేవారిని దూరంగా పెట్టి అవకాశాలు కల్పించే నాయకుడ్ని ఎన్నుకోవడానికి రానున్న ఎన్నికలో తొలి ఓటు వినియోగిస్తాం.

- శ్రీహర్షవర్ధన్ రెడ్డి, కలిగిరి

కఠినంగా ఎన్నికల ఆంక్షలు

- నెల్లూరు నగర రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్



సార్వత్రిక ఎన్నికలలో తొలిఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ మొదలైనందున కార్పొరేషన్ కార్యాలయం పరిసరాల్లో ఎన్నికల ఆంక్షలు కఠినంగా అమలు చేస్తున్నట్లు నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ వెల్లడించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలు తన కార్యాలయంతోపాటు నెల్లూరు ఆర్డీవో, సిటీ తహసీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉందని అన్నారు. కార్యాలయానికి 100 మీటర్లలోపు ర్యాలీ, ఊరేగింపులను ఆపేయాలని సూచించారు. 144 సెక్షను అమల్లో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగనివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిటీ నియోజకవర్గంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని, ఇరగాళమ్మ సంఘం, చిల్డ్రన్స్‌పార్కు, పాతచెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

- నెల్లూరు (సిటీ)



విజయం కోసం...

ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య గురువారం సుదర్శన నారసింహ యాగం నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 11మంది రుత్వికులు శాస్త్రోక్తంగా సుదర్శనయాగం క్రతువు నిర్వహించారు.

- కందుకూరు



లైనింగ్ చేయకుండా వదిలేసిన కనిగిరి ప్రధాన కాలువ

ఆ మాటలు తలుచుకొని

'ఆత్మ' ఘోషిస్తోంది!

- ఆత్మకూరు నియోజకవర్గానికి రూ.85 కోట్లు అన్నారు... పైసా విదల్చలేదు!

సంగం, ఏప్రిల్ 18 : అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని సీఎం జగన్ హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా వాటి ఊసేలేదు. ఆ హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో జగనన్న మాట ఇచ్చి మడమ తిప్పారని ప్రజలు విమర్శిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2022 సెప్టెంబరు 6న సంగం బ్యారేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆత్మకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సుమారు రూ. 85 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంతో గొప్పగా ప్రకటించారు. దీంతో పలు సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలంతా సంబరపడ్డారు. కానీ సీఎం హామీ ఇచ్చి ఏడాదిన్నర పూర్తైంది. కానీ పైసా కూడా విడుదలయిన దాఖలాలు లేవు.



సంగం : అధ్వానంగా ఉన్న వంగల్లు - మర్రిపాడు రహదారిపై ఎర్రమట్టి తోలి గుంతలు పూడ్చిన ఆటో డ్రైవర్లు



సీఎం ఇంకా ఏం చెప్పారంటే...

- సంగం - నెల్లూరు జాతీయ రహదారి నుంచి సంగం బ్యారేజీ వరకు రహదారి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ఆ ఊసేలేదు.
- సంగం గ్రామ ప్రజలకు పెన్నానది నుంచి తాగునీటి పథకం కోసం సుమారు రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది కొండెక్కింది.
- ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోల ని 12 ఇరిగేషన్ పనులకు సుమారు రూ. 40 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఒక్క ఇరిగేషన్ పనికి కూడా ప్రారంభం కాలేదు.
- ఆత్మకూరు మున్సిపాలిటీకి స్పెషల్ గ్రాంట్ కింద రూ. 12 కోట్లు ఇస్తామన్నారు. అదీ లేదు.
- నియోజకవర్గ పరిధిలోని 25 గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారుల నిర్మాణానికి రూ. 14 కోట్లు ఇస్తామని ప్రకటించారు. కానీ వాటి అతీగతీలేదు.

కలగానే పట్టణాభివృద్ధి

ఆత్మకూరు : జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక సీఎంగా ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి రూ. 12 కోట్లు మంజూరు చేస్తామని చెప్పినా, నిధులు విడుదలకాకపట్టణ సుందరీకరణ అలాగే మిగిలి ఉంది. అలాగే పట్టణ సమీపంలో ఉన్న చెరువు వద్ద 1.5 కి.మీ మేర అహ్లాదకరంగా ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ. 4కోట్లు మంజూరుకు రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గతంలో కోటిరూపాయలతో బట్టేపాడు రోడ్డు సమీపంలో అర్థంతరంగా ఆగిపోయిన పార్కు నిర్మాణం పనులు పునరుద్ధరణలో భాగంగా రూ. 2 కోట్లతో 3 ఎకరాల్లో పార్కు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. వీటిలో దేనికీ కూడా నిధులు మంజూరు కాలేదు. కాగా ఆత్మకూరు సమీపంలోని అశ్వనీపురం, జంగాలపల్లి మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణానికి అధికారులు సర్వే చేశారు. నిధులు రాక పనులు ప్రారంభం కాలేదు.

● యాత్రలో ఇచ్చిన హామీలూ అంతే..

జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంకల్ప యాత్రలో భాగంగా 2018 ఫిబ్రవరి 6న సంగం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటికే 75 శాతం పూర్తయిన సంగం బ్యారేజీని ఏడాదిలోపు పూర్తి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. సీఎం అయిన మూడున్నర ఏళ్లకు బ్యారేజీ పూర్తి చేయకుండానే ప్రారంభించారు. నేటికీ 2శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా రూ. 20 కోట్ల బిల్లులు కాంట్రాక్టరుకు బకాయిలు ఉన్నాయి. బ్యారేజీ వద్ద కనీసం ఘాట్‌లు కూడా నిర్మించలేదు. దీంతో సంగమేశ్వరుడి తెప్పోత్సవం కూడా నిర్వహించడం లేదు.

● మాజీ ఎంపీ హామీలకూ దిక్కులేదు..

సంగం బ్యారేజీని పర్యాటక కేంద్రంగా చేస్తామని నెల్లూరు ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. హామీ ఇవ్వడం మడమతిప్పడం జగనన్న బాటలో మేకపాటి కుటుంబం ప్రయణిస్తున్నట్లు నియోజకవర్గ ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఏడు దశాబ్దాలు.. మూడు కుటుంబాల ఆధిపత్యం !

- తొలిసారిగా బరిలో కొత్తముఖాలు
- మారనున్న కందుకూరు రాజకీయ ముఖచిత్రం
- మంత్రులు, స్పీకర్‌గా ఇక్కడివారు ప్రాతినిధ్యం


కందుకూరు, ఏప్రిల్ 18: కందుకూరు నియోజకవర్గంలో ఏడు దశాబ్దాల రాజకీయ చరిత్ర మారి కొత్తశకానికి తెరలేచింది. ఈ సెగ్మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రధాన రాజకీయ పార్టీలు కొత్తముఖాలను ఈ ఎన్నికల్లో బరిలో దింపాయి. పార్టీలు ఏవైనా ఈ 70 ఏళ్లకాలంలో మూడు కుటుంబాల మధ్యే రాజకీయం నడిచింది. దివి కుటుంబం వర్సెస్ నలమోతు కుటుంబంగా రెండు దశాబ్దాలపాటు రాజకీయాలు నడిచాయి. అనంతరం దివి కుటుంబం వర్సెస్ మానుగుంట కుటుంబంగా రూపాంతరం చెంది, 50 ఏళ్ల పాటు పెత్తనం సాగింది. ఇరవై ఏళ్లు తమ ప్రాబల్యం చాటుకున్న దివి కుటుంబం, 50 ఏళ్లుగా నియోజకవర్గంపై తమ పట్టు కొనసాగించిన మానుగుంట కుటుంబం తాజా ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఎన్నో సార్లు ఆయా పార్టీలు ప్రయోగాలు చేసినా ఆ మూడు కుటుంబాలవారే ఎవరో ఒకరు రంగంలో ఉంటూ వచ్చారు. కొత్తవారు రంగంలోకి వచ్చినా ఆ మూడు కుటుంబాలు ఒక్కటై మట్టికరిపించిన చరిత్ర కందుకూరుది.

● కాంగ్రెస్‌కు కంచుకోట

కాగా 2024 ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వైసీపీ అభ్యర్థిగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పోటీచేస్తుండగా, టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు బరిలో దిగారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో పార్టీలకన్నా వ్యక్తులకు, వర్గాలకు ప్రజలు అధిక ప్రాధాన్యం ఇచ్చి గెలిపించారు. ప్రధాన రాజకీయ పార్టీల గాలి బలంగా వీస్తున్న తరుణంలోనూ రాష్ట్రమంతటిది ఓదారి అయితే, కందుకూరుది మరోదారి అన్నట్లుగా ఇక్కడ ఇండిపెండెంట్లను రెండు దఫాలు గెలిపించారు.

● 15 సార్లు ఎన్నికలు

1952లో కందుకూరు నియోజకవర్గం ఆవిర్భవించగా ఇప్పటివరకు 15సార్లు ఎన్నికలు జరిగాయి. రెండేసి సార్లు టీడీపీ, వైసీపీ, స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. 9 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే జయకే తనం ఎగుర వేశారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నల మోతు చెంచు రామానాయుడు విజయం సాధించారు.



1955 ఎన్నికల్లో కాం గ్రెస్ అభ్యర్థిగా దివి కొండయ్య చౌదరి గెలుపొందారు. 1962,67 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నలమోతు చెంచు రామానాయుడు విజయం సాధించారు. 1972లో మానుగుంట ఆదినారాయణరెడ్డి స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచారు. 1978లో దివి కొండయ్య చౌదరి కాంగ్రెస్ అభ్యర్థిగా, 1983లో స్వతంత్ర అభ్యర్థిగా మానుగుంట ఆదినారాయణరెడ్డి విజేతలుగా నిలిచారు. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదినారాయణ రెడ్డి గెలిచారు. 1989 ఎన్నికల్లో ఆదినారాయణరెడ్డి వారసునిగా రాజకీయ ప్రవేశం చేసిన మాను గుంట మహీధరరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా విజ యం సాధించారు. 1994 ఎన్నికల నాటికి దివి కొండయ్య చౌదరి వారసునిగా డాక్టరు దివి శివరాం రంగంలోకి వచ్చి విజయం సాధించారు. 1999 ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా దివి శివరాం విజయం సాధించారు. 2004, 2009 ఎన్ని కల్లోనూ కాం గ్రెస్ అభ్యర్థి మహీధరరెడ్డి గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన నలమో తు చెంచురామానాయుడు సమీప బంధువు పోతుల రామారావు విజేతగా నిలిచారు. 2019 వైసీపీ అభ్యర్థిగా మానుగుంట మహీధరరెడ్డి విజయం సాధించారు. ఈ దఫా ఆ మూడు కుటుంబాలకు చెందిన వ్యక్తులు బరిలో లేకుండా ఇద్దరూ కొత్తవారే బరిలో దిగుతున్నారు.

ముఖచిత్రం

ముగ్గురు మంత్రులు, స్పీకర్ ప్రాతినిధ్యం

కందుకూరు నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన ఆ మూడు కుటుంబాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవులు వరించటం విశేషం. నలమోతు కుటుంబం, దివి కుటుంబంలోని తొలితరం నేతలే మంత్రులుగా ప్రాతినిధ్యం వహించారు. మానుగుంట కుటుంబాన్ని రెండోతరంలో మంత్రిపదవి వరించింది. దివి కొండయ్యచౌదరి మంత్రిగా ప్రాతినిధ్యం వహించటమేకాగా అసెంబ్లీ స్పీకర్‌గానూ పనిచేశారు. కందుకూరు నెల్లూరు జిల్లాలో అంతర్భాగంగా ఉన్న రోజుల్లోనే జిల్లా నుంచి నలమోతు చెంచు రామానాయుడు 1965 నుంచి 1972 వరకు రాష్ట్ర అటవీశాఖామంత్రిగా పనిచేశారు. జిల్లా విభజన జరిగి ప్రకాశం జిల్లా ఆవిర్భవించాక దివి కొండయ్య చౌదరి 1978-83 మధ్యకాలంలో ఆర్అండ్‌బీశాఖ మంత్రిగా, రెండేళ్ల శాసనసభాపతిగానూ పనిచేశారు. ఇక మానుగుంట కుటుంబం నుంచి ఆదినారాయణ రెడ్డి వారసుడైన మహీధరరెడ్డి 2010-14 కాలంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేశారు. దివి కొండయ్య చౌదరి కుమారుడు దివి శివరాం రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేయటమేకాగా 2017 నుంచి 2019 వరకు రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

కందుకూరు నుంచి గెలుపొందిన అభ్యర్థులు

సంవత్సరం	విజేత	ప్రత్యర్థి	మొత్తం ఓట్లు	మెజారిటీ
1952	నలమోతు చెంచురామానాయుడు (కాంగ్రెస్)	దివి కొండయ్య చౌదరి(కేఎంపీపీ)	59286	4361
1955	దివి కొండయ్య చౌదరి (కాంగ్రెస్)	రావిపాటి వెంకయ్య (సీపీఐ)	60357	7097
1962	నలమోతు చెంచురామానాయుడు(కాంగ్రెస్)	దివి కొండయ్య చౌదరి(స్వతంత్ర పార్టీ)	67880	1672
1967	నలమోతు చెంచురామానాయుడు(కాంగ్రెస్)	డాక్టర్ వీవై కోటారెడ్డి (స్వతంత్ర పార్టీ)	82561	5912
1972	మానుగుంట ఆదినారాయణరెడ్డి(స్వతంత్ర)	ఎన్. చెంచురామానాయుడు (కాంగ్రెస్)	94258	5433
1978	దివి కొండయ్య చౌదరి(కాంగ్రెస్)	ఎం.ఆదినారాయణరెడ్డి (జనతాపార్టీ)	105692	12305
1983	మానుగుంట ఆదినారాయణరెడ్డి (స్వతంత్ర)	గుత్తా వెంకటసుబ్బయ్య(టీడీపీ)	116376	2841
1985	మానుగుంట ఆదినారాయణరెడ్డి (కాంగ్రెస్)	గుత్తా వెంకటసుబ్బయ్య (టీడీపీ)	128782	1285
1989	మానుగుంట మహీధరరెడ్డి(కాంగ్రెస్)	మోరుబోయిన మాలకొండయ్య(టీడీపీ)	155210	10198
1994	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	మానుగుంట మహీధరరెడ్డి (ఐఎన్‌సీ)	148677	6025
1999	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	మానుగుంట మహీధరరెడ్డి (ఐఎన్‌సీ)	176773	1525
2004	మానుగుంట మహీధరరెడ్డి (కాంగ్రెస్)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	153392	7879
2009	మానుగుంట మహీధరరెడ్డి (కాంగ్రెస్)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	185120	4243
2014	పోతుల రామారావు (వైసీపీ)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	194679	3806
2019	మానుగుంట మహీధరరెడ్డి(వైసీపీ)	పోతుల రామారావు (టీడీపీ)	218961	14936

భలే భలే బంతి!

- ప్రచారాలకు బస్తాల కొద్దీ కొనుగోళ్లు
- డిమాండ్ పెరగడంతో రెట్టింపయిన ధర

ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుండటంతో అభ్యర్థులు నిర్వహించే రోడ్‌షోలు, బహిరంగ సభలు, ర్యాలీలకు ప్రత్యేక ఆకర్షణగా బంతి పూలను చల్లుతుంటారు. వీటిలో మాలలుగా తయారు చేసి తమ అభిమాన నాయకులు వేస్తుంటారు. గత కొన్ని రోజులుగా అన్ని నియోజకవర్గాలలో అభ్యర్థుల ప్రచారాలు హోరెత్తిస్తుండటంతో నెల్లూరులోని మార్కెట్లో బంతిపులు కనబడటం లేదు. బెంగళూరు, హొసకోట (కర్ణాటక) ప్రాంతాల నుంచి నెల్లూరుకు నిత్యం బస్సుల్లో ముప్పాతిక శాతం బంతిపూలు దిగుమతి అవుతుంటాయి. పాతిక శాతం పూలు నెల్లూరురూరల్, సంగం, ఇందుకూరుపేట, పొదలకూరు తదితర మండలాల నుంచి అందుతుంది. ఇలా మార్కెట్‌కు వచ్చిన బంతిపూలన రాజకీయ పార్టీల నాయకులు బస్తాల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. పండగలు, పెళ్లిళ్ల సీజన్లలో ఈ పులు గరిష్ఠంగా కేజీ రూ. 100 ధర ఉంటుంది. కానీ ప్రస్తుతం బంతికి డిమాండ్ ఉండటంతో కేజీ రూ.200ల వరకు ధర పలుకుతోంది. ఇంత ధర ఇస్తామన్నా నెల్లూరు మార్కెట్లో బంతిపూలు చూద్దామన్నలేకపోవడం గమనార్హం

- నెల్లూరు (సిటీ)

